epaper.ninadamnews.com

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

గురువారం, జులై 23, 2026 | సంపుటి - 22 | సంచిక 295 | వెల - 7 | పేజీలు - 12 - 8

Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం

## కొనుగోలుకు ఆమోదం

### తెలంగాణకు కేంద్రం శుభవార్త



**హైదరాబాద్,జులై22(నినాదం):**

తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం భుభవార్త తెలిపింది.రాష్ట్రంలో రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా వడ్ల కొనుగోలు చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే ఉన్న కొనుగోలు లక్ష్యానికి అదనంగా 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో రైతులకు పెద్ద ఊరట లభించనుంది.

▸▸తరువాయి2లో..

**అంతర్మథనం**

వార్త వెనుక వాస్తవం... (కొనసాగింపు)



6

బిజిగిరి శ్రీనివాస్
సంపాదకులు – నినాదం

**దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకులపై మొదలైన ఆందోళనలు ఇప్పుడు కేవలం పరీక్షల సమస్యగా మిగలలేదు. అవి దేశ రాజకీయాలను కుదిపే అంశంగా మారాయి. ఉద్యోగాలు, విద్య, భవిష్యత్తు కోసం సంవత్సరాల పాటు శ్రమించిన లక్షలాది మంది యువతలో పేరుకుపోయిన అసంతృప్తి ఇప్పుడు వీధుల్లోకి వచ్చింది.**

## యువత ఆగ్రహం.. రాజకీయాల బలిపీఠంపై భవిష్యత్

**పేపర్ లీకుల సంక్షోభం... పరిష్కారాల కంటే పరస్పర ఆరోపణలకే ప్రాధాన్యమా?**

*విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు, పలు పౌరసంఘాలు ఈ ఉద్యమాలకు మద్దతు తెలుపుతున్నాయి. వివిధ ప్రతిపక్ష పార్టీలు కూడా దీనిని ప్రధాన రాజకీయ అంశంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ పరిణామం కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీకి రాజకీయంగా సవాలుగా మారిందని విశ్లేషకులు భావిస్తున్నారు.*

ప్రశ్నాపత్రాల లీకులు ఒక్క రాష్ట్రానికో, ఒక్క పరీక్షకో పరిమితం కాలేదు. దేశంలోని పలు నియామక పరీక్షల విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తాయి. ఒకసారి నియామక వ్యవస్థపై ప్రజల విశ్వాసం దెబ్బతింటే, దాన్ని తిరిగి నెలకొల్పడం అంత సులభం కాదు.

*దేశ చరిత్ర చెబుతున్న పాఠం ఒక్కటే. యువత ఆవేదనను ఎక్కువకాలం నిర్లక్ష్యం చేయడం ఏ ప్రభుత్వానికీ మంచిది కాదు. ఉద్యోగం కోసం చదివిన యువకుడు తన కష్టానికి విలువ లేదని భావించే పరిస్థితి వస్తే, అది కేవలం ఒక పరీక్ష వైఫల్యం కాదు; మొత్తం పాలనా వ్యవస్థపై విశ్వాస సంక్షోభానికి సంకేతం.*



## రాష్ట్రంలో పవర్ కట్ అనేదే లేదు

### 'ఎల్‌నినో' షాక్‌ను తట్టుకున్న విద్యుత్ వ్యవస్థ

- వర్షా కాలంలోనూ వేసవిని తలపించిన 16,500 మెగావాట్ల పీక్ డిమాండ్
- 2 వేల మెగావాట్ల నిరంతరాయంగా విద్యుత్ సరఫరా
- దేశంలోనే తొలిసారిగా 'ఎలక్ట్రిసిటీ ఆంబ్యులెన్స్
- అప్పల రీస్ట్రక్చరింగ్‌తో డిస్కంలను నంబర్`1గా తీర్చిదిద్దే ప్రణాళికలు
- ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష

**హన్మకొండ, జూలై22(నినాదం):**

ఎల్ నినో' ప్రతికూల వాతావరణ ప్రభావంతో వర్షాకాలంలోనూ వేసవిని తలపించిన విద్యుత్ డిమాండ్, పడిపోయిన జల విద్యుత్ ఉత్పత్తితో ఒకేసారి పడిన 7,000 మెగావాట్ల అదనపు భారాన్ని తెలంగాణ విద్యుత్ వ్యవస్థ అత్యంత సమర్థవంతంగా తట్టుకుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. సాధారణంగా వర్షాకాలంలో 11,000 మెగావాట్లుగా ఉండే పీక్ డిమాండ్ అనూహ్యంగా 16,500 మెగావాట్లకు చేరడం, మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేక 2,000 మెగావాట్ల జల విద్యుత్ (హైడల్ పవర్) నిలిచిపోవడం డిస్ట్రిబ్యూ షన్ వ్యవస్థపై తీవ్రమైన షాక్ లాంటి ఒత్తిడిని తెచ్చిందన్నారు.

▸▸తరువాయి2లో..

పేపర్ లీక్‌పై ప్రశ్నిస్తే

# పాశవిక దాడులా?

**అవినీతి పరులను జైల్లో పెట్టకుండా విద్యార్థులపై లాఠీచార్జిలా?**

**విద్యార్థులతో చెలగాటమాడుతున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించుతాం**

**కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జాతీయ స్థాయి నీట్ పరీక్ష పేపర్ లీక్ అవడంతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపడితే నిరసన చేపట్టిన విద్యార్థులపై లాఠీచార్జీలు చేస్తూ బాష్ప వాయువులను ప్రయోగిస్తూ పాశవిక దాడులు చేయడం ఏంటని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ప్రశ్నించారు.**

- భాజపా అంటే బ్రిటిష్ జనతా పార్టీ
- గాడ్సే వారసులంటూ ఘాటు విమర్శలు
- కొడంగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**కొడంగల్, జులై 22(నినాదం):**

ఢిల్లీలో పోలీసులు ఇష్టారీతిగా విద్యార్థులను కాళ్లు చేతులు విరిగేలా తలలు పగిలేలా దాడులు చేయడమేంటని సీఎం మండిపడ్డారు. అవినీతిపరులను జైల్లో బంధించాల్సింది పోయి న్యాయం కోసం పోరాడుతున్న విద్యార్థులపై పాశవికంగా దాడులు చేస్తుంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. బుధవారం కొడంగల్ లోని అంబేద్కర్ కూడలిలో చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడుతూ, , విద్యార్థుల పక్షాన పోరాడేందుకు శాంతియుత వాతావరణంలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నేతలు రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ లను విచక్షణ రహితంగా రక్తం చిందేల పోలీసుల చేత కొట్టించడం సరికాదని హెచ్చరించారు.

▸▸తరువాయి2లో..



కాంగ్రెస్ ఓట్లు తొలగించేందెకు

## బిజెపి ఎత్తులు

- కొడంగ్‌లో నన్ను దెబ్బతీయాలని కుట్రలు
- ఓట్లు పోకుండా జాగ్రత్తలు తీసుకోండి
- సర్‌పై బూత్‌లెవల్ కార్యకర్తలతో సిఎం రేవంత్

వివరాలు 2

మూడోరోజూ పార్లమెంట్‌లో

## గందరగోళం

**విపక్షాల నిరసనలతో హోరెత్తిన సభ**

**నల్ల చొక్కలాతో పార్లమెంట్ ముందు విపక్షాల నిరసన**



**న్యూఢిల్లీ,జులై22(నినాదం):**

వరుసగా మూడో రోజు కూడా పార్లమెంట్‌లో గందరగోళం నెలకొంది. విపక్ష సభ్యులు వాయిదా తీర్మానాలపై చర్చకు పట్టుబట్టడంతో ఉభయ సభలు వాయిదా పడ్డాయి.

▸▸తరువాయి2లో..

## కాంగ్రెస్, బిజెపి పోటాపోటీ ఆందోళనలు

**ఇరువర్గాల పరస్పరం దాడులతో ఉద్రిక్తత**

- లోక్‌భవన్ ముట్టడికి కాంగ్రెస్ యత్నం
- గాంధీభవన్ ముట్టడికి బిజెపి నేతల దూకుడు
- రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేసిన పోలీసులు
- నగరంలో పలువురు కాంగ్రెస్, బిజెపి నేతల అరెస్ట్

2

***కాంగ్రెస్, బీజేపీ ఆందోళనలతో బుధవారం హైదరాబాద్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్, బిజెపి పోటాపోటీ ఆందోళనలతో సిటీ అట్టుడికింది..***

## మాది మాకిచ్చిపో.. ఎంతైనా అమ్ముకో!

- రేషన్ స్మగ్లింగ్ స్కాములో.. అధికారుల అండర్‌స్టాండింగ్?
- అవినీతి కొండకు అన్‌లిమిటెడ్ సపోర్ట్?
- జగిత్యాలలో 'నో పోలీస్' అంటున్న నెటిజన్లు..!

**జగిత్యాల జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారంపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది. పదేళ్లుగా అనేక అక్రమాలకు సంబంధించిన ఆరోపణలు, వందల కోట్ల విలువైన ఆస్తులపై ప్రచారం, పీడీ చట్టానికి అర్హత కలిగే స్థాయిలో నమోదైన కేసులు ఉన్నప్పటికీ అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. నిఘా వ్యవస్థ సమర్థంగా పనిచేయడం లేదని, పోలీసు శాఖ స్మగ్లింగ్‌ను పూర్తిగా అరికట్టలేకపోతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో సివిల్ సప్లైస్ శాఖ పనితీరుపైనా నెటిజన్లు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.**

**ప్రత్యేక ప్రతినిధి - నినాదం**


స్థానికుల కథనం ప్రకారం, ఇప్పటికే పలు కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొన్న ఓ పాత డిఫాల్టర్ రైస్ మిల్ వ్యాపారం ముసుగులో ప్రతినెలా భారీగా రేషన్ బియ్యం అక్రమ రవాణా కొనసాగిస్తున్నాడని చెబుతున్నారు. ఇందుకోసం గ్రామ శివారులో ఉన్న, కార్యకలాపాలు దాదాపు నిలిచిపోయిన ఓ డమ్మీ రైస్ మిల్లును వినియోగిస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి.

గత ఏడాది దాదాపు వెయ్యి క్వింటాళ్ల రేషన్ బియ్యంతో స్టేట్ టీమ్‌కు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడినప్పటికీ, ఆ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్నప్పటికీ పీడీ చట్టం అమలుకాలేదని స్థానికులు గుర్తుచేస్తున్నారు. చట్టంలోని లొసుగులను ఉపయోగించుకుని కేసు నుంచి బయటపడ్డాడని, చివరకు స్వాధీనం చేసుకున్న బియ్యం కూడా తిరిగి అతనికే అప్పగించబడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామాలపై సివిల్ సప్లైస్ శాఖ పాత్ర ఏమిటనే ప్రశ్నలు నెటిజన్ల నుంచి వ్యక్తమవుతున్నాయి.

ఏడాది క్రితం సదరు స్మగ్లర్ నిర్వహించిన గృహప్రవేశ వేడుకకు పలువురు అధికారులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరైనట్లు ప్రచారం ఉంది. అదే సందర్భంగా స్థానిక అమ్మవారికి బంగారు పల్లెం సమర్పించినట్లు కూడా చెబుతున్నారు.

**పట్నం సారుకు రూ.2 కోట్లు... అమ్మవారికి బంగారు పల్లెం!**

స్థానికంగా వినిపిస్తున్న ప్రచారం ప్రకారం, సదరు స్మగ్లర్‌కు లోకల్ స్థాయి నుంచి రాష్ట్ర కేంద్రం వరకు కొందరు అధికారుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అవసరానికి మించి ధాన్యం కేటాయించడం, అనంతరం ఆ బియ్యాన్ని బయట విక్రయించినా సంబంధిత మిల్లుల్లో తనిఖీలు జరగకుండా చూడటం వంటి అంశాల్లో కొందరు అధికారులు సహకరిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రతిఫలంగా సంబంధిత వ్యక్తి కూడా స్థాయిని బట్టి వాటాలు చెల్లిస్తాడని స్థానికంగా చర్చ సాగుతోంది.



**అదే కాలంలో రాత్రివేళ అక్రమ రవాణాకు సిద్ధం చేసిన సుమారు 15 లారీల బియ్యాన్ని స్టేట్ టీమ్ దాదాపు పట్టుకునే పరిస్థితి ఏర్పడిందని, అయితే విషయం తెలుసుకున్న స్మగ్లర్ సంబంధిత శాఖలోని ఓ ఉన్నతాధికారిని రూ.2 కోట్లతో ప్రసన్నం చేసుకున్నాడనే ప్రచారం స్థానికంగా వినిపిస్తోంది.**

ఈ ఘటనలతో పాటు స్థానికంగా మరి కొందరు అధికారులు కూడా సదరు స్మగ్లర్‌కు సహకరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. గతంలో అతను పట్టుబడ్డ ప్రతి సందర్భంలోనూ సివిల్ సప్లైస్, పోలీసు శాఖల చర్యలు అతనికి అనుకూలంగా మారాయని విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఈ బియ్యం స్మగ్లింగ్ వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉందనే అంశాలపై మరిన్ని వివరాలు, సంబంధిత ఆధారాలతో 'నినాదం' తదుపరి సంచికలో...**

## పదేళ్లలో 152 పేపర్ లీక్ కేసులు

- ఒక్క దాంట్లో కూడా దోషులను తేల్చలేదు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే
- ప్రధాని మోడీ క్షమాపణలు చెప్పాల్సిందే
- మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ డిమాండ్



**న్యూఢిల్లీ,జూలై22(నినాదం):**

గత 10 ఏళ్లల్లో 152 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయని కాంగ్రెస్ నేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒక్క కేసులో కూడా దోషులు ఎవరో తేలలేదని అన్నారు. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై ఉద్యమిస్తున్న యువతకు మద్దతుగా రాహెల్ గాంధీ బుధవారం ఏర్పాటు చేసిన పత్రికాసమావేశంలో కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో విద్యావ్యవస్థ మొత్తం రిగ్గింగ్ బారిన పడిందని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పనితీరు అసమర్ధంగా, అవినీతిమయంగా ఉందని ఆరోపించారు.

▸▸తరువాయి2లో..



అత్యవసర చర్చకు

## సుప్రీం తిరస్కరణ

**చలో సంసద్‌పై పోలీసుల లాఠీఛార్జ్‌పై..**

**న్యూఢిల్లీ,జులై22(నినాదం):**

కాక్రోచ్ జనతాపార్టీ 'చలో సంసద' మార్చ్‌లో భాగమైన నిరసనకారులపై పోలీసు లాఠీఛార్జ్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. అయితే.. దాని

▸▸తరువాయి2లో..

## రెడ్కో డీఈ ముత్యం వెంకటరమణ అరెస్ట్

**సోదాల్లో భారీగా ఆస్తులు గుర్తించిన ఎసిబి**

**హైదరాబాద్,జూలై22(నినాదం):**

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో తెలంగాణ రెడ్కో డీఈ ముత్యం వెంకటరమణను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. సోదాల అనంతరం ఆస్తులను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేస్తున్నట్లు ప్రకటించారు. మాదాపూర్‌లోని డీఈ ఇల్లు సహా 8 ప్రాంతాల్లో బుధవారం ఉదయం నుంచి సోదాలు చేశారు.

▸▸తరువాయి2లో..






# పేపర్ లీక్‌పై ప్రశ్నిస్తే పాశవిక దాడులా?

నీట్ పేపర్ లీక్ చేస్తూ బజార్లో అమ్ముకుంటూ కోట్లాది రూపాయలు సంపాదిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా నరేంద్ర మోడీ కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను వెంటనే మంత్రివర్గం నుండి భర్త రఫ్ చేయాలని డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్రం తెచ్చిన మహాత్మా గాంధీని ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం తెల్ల దొరలు కూడా ఆయనపై లాఠీ ఎత్తలేదని, అలాంటి మహాత్మా గాంధీని గాడ్సే ద్వారా చంపించిన ఘనత భాజపా నాయకులదని,వారు గాడ్సే వారుసులని ఘాటు విమర్శలు చేశారు. భాజపా అంటే బ్రిటిష్ జనత పార్టీ అని అన్నారు. గాడ్సే వారసులు బిజెపి పార్టీని నడిపిస్తున్నారని ఘాటుగా విమర్శించారు గాంధీ కుటుంబం లో ఇందిరా గాంధీ రాజీవ్ గాంధీ లు ప్రజల క్షేమం కోసం తమ ప్రాణాలర్పించారని చివరి రక్తపు బొట్టులను నేలకరిపించారని గుర్తు చేశారు లోక్సభలో రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీలు పేపర్ లీకుల పైన గలమెత్తితే భాజపా నాయకులు సమాధానం ఇవ్వలేక దాటవేస్తున్నారన్నారు. గతంలో గ్లోబలిన సంస్థ ఇంటర్మీడియట్ మరియు సిబిఎస్సీ పేపర్ లీకులకు పాల్పడినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఈనాడు నీట్ పరీక్ష పేపర్ లీక్ అయిందని ఇలాంటి పేపర్ లీకులకు పాల్పడుతున్న సంస్థలను, కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించేదాకా ఊరుకునేది లేదన్నారు. ఇప్పటికైనా నరేంద్ర మోడీ విద్యార్థులకు దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పి కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను భర్తరఫ్ చేసి మున్ముందు పేపర్ లీకులు జరగకుండా చూడాలని కోరారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు అందరూ కలిసి రావాలని యువతను కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ధారాసింగ్, ఎండి యూసుఫ్, కృష్ణంరాజు, మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కొనుగోలుకు ఆమోదం

కేంద్ర ప్రభుత్వం సవరించిన వరి కొనుగోలు అంచనాను బియ్యం రూపంలో 43 లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్ణయించింది. ఈ నిర్ణయం ద్వారా తెలంగాణలో రైతులు పండించిన ధాన్యానికి మరింత మార్కెట్ భరోసా లభించనుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతించింది. ఇదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా వాహనాల స్థాన నిర్ధారణ వ్యవస్థ అమలుపై కూడా కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. 2026 సెప్టెంబర్ 30 నాటికి రాష్ట్రంలోని అన్ని అర్హత గల వాహనాల్లో వీఎల్టీఎస్ వ్యవస్థను పూర్తిగా అమలు చేయాలని కేంద్రం స్పష్టం చేసింది. ఈ వ్యవస్థ ద్వారా వాహనాల కదలికలను రియల్ టైమ్‌లో పర్యవేక్షించే అవకాశం ఉండటంతో భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపడనున్నాయి. అంశాలపై పార్లమెంట్‌లో కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి పీయ ష్ గోయల్‌ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కలిశారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వడ్ల కొనుగోలు అంచనాను పెంచినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యానికి సరైన మద్దతు ధరతో కొనుగోలు జరిగేలా కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం వ్యవసాయ రంగానికి ఊతమివ్వనుంది. అదనపు కొనుగోళ్లతో రైతులకు ఆర్థిక భరోసా పెరగడంతో పాటు రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ మరింత సాఫీగా సాగేందుకు అవకాశం ఏర్పడింది.

## మూడోరోజూ పార్లమెంట్‌లో గందరగోళం

బుధవారం కూడా లోక్‌సభ, రాజ్యసభలో గందరగోలం నెలకొన్నది. దీంతో రెండు సభలు 12 గంటల వరకు వాయిదా పడ్డాయి.తాము ఇచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చ చేపట్టాలని లోక్‌సభలో విపక్షాలు డిమాండ్ చేశాయి. సభను ఆర్డర్‌లోకి తెచ్చేందుకు స్పీకర్ ఓం బిర్లా ప్రయత్నించారు. కానీ ఫలితం కనిపించలేదు. ప్రశ్నోత్తరాల సమయం జరిగే రీతిలో విపక్షాలు సహకరించాలని ఆయన కోరారు. ఎటువంటి సమస్యపైన అయినా చర్చ చేపట్టేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని అన్నారు. కానీ విపక్ష సభ్యులు వినిపించుకోలేదు. నినాదాలు చేశారు. దీంతో సభను మధ్యాహ్నం 12 గంటలవరకు వాయిదా వేశారు. రాజ్యసభలో కూడా విపక్షాలు సీజేపీపై లాఠీచార్జ్ అంశాన్ని చర్చించాలని పట్టుపట్టాయి. కానీ చైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ వ్యతిరేకించారు. గందరగోళ నేపథ్యంలో సభను 12 వరకు వాయిదావేశారు. మరో వైపు విపక్ష ఎంపీలు ఇవాళ నల్ల దుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఆవరణలో ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శన చేశారు. నీట్ పేపర్ లీకేజీ అంశంలో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు నిరసనగా నల్ల దుస్తులు ధరించినట్లు కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేరా ఆరోపించారు.

## అత్యవసర చర్చకు సుప్రీం తిరస్కరణ

అత్యవసర విచారణకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. కోర్టు సమయాన్ని వృథా చేయొద్దని.. అలాగే పిటిషనర్ కూడా తన సమయాన్ని వృథా చేసుకోవద్దని ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. నిరసనకారులపై పోలీసు చర్యకు సంబంధించిన వీడియోల గురించి పిటిషనర్ తరపు న్యాయవాది ప్రస్తావించగా..'మాకు వీడియోలు చూసే సమయం లేదు' అని సీజేఐ వ్యాఖ్యానించారు. ఈ పిటిషన్ అత్యవసర విచారణకు ఢిల్లీ హైకోర్టు కూడా నిరాకరించిన సంగతి తెలిసిందే. ఈ అంశంలోకి తమను లాగొద్దని వ్యాఖ్యానించింది. దాంతో ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. ఈ లాఠీఛార్జిపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని పిటిషనర్ కోరారు. నీట్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యా వ్యవస్థలో సంస్కరణలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన చలో పార్లమెంటు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వేల మంది సీజేపీ మద్దతుదారులు పార్లమెంటువైపు దూసుకురావడం, బారికేడ్లను దాటి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకుని బాష్పవాయు గోళాలు ప్రయోగించడం, లాఠీఛార్జి చేయడంతో ఆ ప్రాంతం రణరంగాన్ని తలపించింది. పలుచోట్ల రాళ్లు రువ్వడం, ఘర్షణ పడటం, తోపులాటలతో అటు పోలీసులు, ఇటు ఆందోళనకారులు గాయపడ్డారు. చాలా మంది రక్తమోడుతున్న వీడియోలు వైరలయ్యాయి. వీటిని చూపుతూ విచారణ కోరారు. అయితే సుప్రీం ప్రధాన న్యాయమ ర్తి వాటిని తిరస్కరించారు. అత్యవసరంగా చర్చించాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు.

## అర్ధరాత్రి కరీంనగర్‌లో దొంగల బీభత్సం

**వృద్ధుడిని, మహిళలను కట్టేసి దోపిడీ**

కరీంనగర్ : కరీంనగర్ నగరంలోని భగత్ నగర్ ప్రాంతంలో అర్ధరాత్రి వేళ ఘోర దారి దోపిడీ కలకలం రేపింది. ఆయుధాలతో, ముసుగులు ధరించి ఇంట్లోకి ప్రవేశించిన ముఠా సభ్యులు కుటుంబ సభ్యులను కత్తులు, తుపాకులతో బెదిరించి, విచక్షణారహితంగా దాడి చేసి భారీగా సొత్తును దోచుకెళ్లారు. అర్ధరాత్రి దాదాపు 12:30 గంటల సమయంలో, ఇంట్లో ఉన్న వృద్ధుడైన యజమాని తన కొడుకులు ఎవరైనా వచ్చారన్న భావనతో తలుపు తీశాడు. వెంటనే ముసుగులు ధరించి లోపలికి చొరబడ్డ దుండగులు అతనిపై దాడి చేశారు. వృద్ధుడిని తాళ్లతో బంధించి, ముక్కు నుంచి రక్తం వచ్చేలా దారుణంగా చితకబాదారు. ఆ తర్వాత ఇంట్లోని ముగ్గురు మహిళలను పిస్టళ్లు, కత్తులతో బెదిరించి, బట్టలు, కాళ్లకు`చేతులకు ఓణీలతో కట్టేసి తీవ్రంగా భయాందోళనకు గురిచేశారు. లోపల విధ్వంసం సృష్టించిన దొంగలు, పెనుగులాట మధ్య ఇంట్లోని బంగారంతో పాటు సుమారు రూ.50 లక్షల కంటే ఎక్కువ నగదును దోచుకెళ్లారు. ఆ తర్వాత, ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న రెండు బైకులను కూడా దొంగిలించి పరారయ్యారు. బైపాస్ నుంచి మానేరు బ్రిడ్జి విOదుగా వరంగల్ వైపు పారిపోయినట్లు పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ప్రాథమికంగా గుర్తించారు. దుండగులు లోపలికి రాగానే నోరు విప్పవద్దని బెదిరించారని బాధితురాలు తెలిపారు. తమ వద్ద ఉన్న రివాల్వర్లు, కత్తులు చూపిస్తూ తమను కాళ్లు, చేతులు కట్టేసి హింసించారని, ఇంట్లోని బంగారం, పైసలన్నీ పట్టుకెళ్లారని కన్నీటిపర్యంతమయ్యారు. దొంగలు హిందీ మాట్లాడారని, వారి వద్ద నకిలీ పిస్టల్ సహా ఇతర ఆయుధాలు ఉన్నాయని బాధితులు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, క్లూస్ టీమ్‌లతో సహా సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. దీనిపై కరీంనగర్ టౌన్ డిసిపి వెంకటరమణ మాట్లాడుతూ.. ఘటనపై సమాచారం రాగానే అన్ని ప్రత్యేక టీమ్‌లను రంగంలోకి దించాం. బాధితులు ఇచ్చిన సమాచారం ఆధారంగా ఉత్తర భారతదేశానికి చెందిన వారి ప్రమేయం ఉందా అనే కోణంలో విచారిస్తున్నాం. అలాగే, బాధితుల పెద్ద అల్లుడు ఢిల్లీలో ఉంటారని, కుటుంబంలో కొన్ని గొడవలు ఉన్నట్లు తెలిసిందన్నారు. దాంతో కుటుంబ వివాదాల కోణంలోనూ, అలాగే వృత్తిపరమైన దొంగల పనా అనే అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నాం. ఎంత సొత్తు పోయిందనే దానిపై స్పష్టత కోసం పూర్తి వివరాలు సేకరిస్తున్నామని.. త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు. ప్రస్తుతం కరీంనగర్ పోలీసులు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా నిందితుల కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

# కాంగ్రెస్, బిజెపి పోటాపోటీ ఆందోళనలు

**హైదరాబాద్,జూలై22(నినాదం):**

కాంగ్రెస్, బీజేపీ ఆందోళనలతో బుధవారం హైదరాబాద్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లోక్‌భవన్ ముట్టడికి పిలుపునివ్వగా, మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ నివాసం ఎదుట కాంగ్రెస్ చేపట్టిన నిరసనను ఖండిస్తూ బీజేపీ నాయకులు గాంధీభవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో ఇరువర్గాలు ముట్టడికి బలయుదేరడంతో పాటు పరస్పర దాడులకు తెగించారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు చేస్తున్న నిరసనలతో నాంపల్లి బీజేపీ కార్యాలయం దగర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ ఆఫీస్ ముట్టడికి కాంగ్రెస్ నేతలు యత్నించారు. కాంగ్రెస్ నేతలు రాకుండా బీజేపీ నేతలు కర్రలతో అడ్డుకున్నారు. మరోపక్క.. రాజ్ భవన్ ముట్టడికి యత్నించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు నాంపల్లి పీఎస్‌కు తరలించారు. కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి నాంపల్లి పీఎస్‌కు చేరుకున్నారు. ఖైరతాబాద్‌లో కూడా కాంగ్రెస్ ఆందోళనకు దిగింది. నెక్లెస్ రోడ్డులోని ఐమాక్స్ సవి పంలో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం దగ్గరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరుకున్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లోక్ భవన్ ముట్టడికి యత్నించిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఘటనా స్థలంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్దకు చేరుకున్న బీజేపీ నాయకులను అక్కడే అడ్డుకున్నారు. అలాగే లోక్‌భవన్ వైపు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఖైరతాబాద్ సర్కిల్ వద్ద నిలువరించారు. ఈ క్రమంలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ రాష్ట్ర కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కర్రలతో దాడులు జరిగాయని, కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసు వాహనాలపైకి ఎక్కి నిరసన వ్యక్తం చేసినట్లు సమాచారం. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు తీవ్రంగా శ్రమించారు. ముందస్తు చర్యల్లో భాగంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. తొలుత కాంగ్రెస్ నేతలు హైదరాబాద్ నెక్లెస్‌రోడ్ నుంచి లోక్‌భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అజారుద్దీన్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ర్యాలీ లోక్‌భవన్‌కు చేరుకున్న వెంటనే మంత్రులు, కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో కరీంనగర్‌లో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కేంద్రమంత్రి బండి సంజయ్ ఇంటిని ముట్టడించేందుకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లగా... వారిని బీజేపీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా అడ్డుకున్నారు. చేతుల్లో కర్రలతో బండి సంజయ్ ఇంటికి బీజేపీ నేతలు కాపలాగా నిలవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. బీజేపీ నేతలపై కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లు, చెప్పులతో దాడులకు తెగబడ్డారు. ఇరుపార్టీల కార్యకర్తలు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో కరీంనగర్ వీధులు రణరంగాన్ని తలపించాయి. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఉద్రిక్తతలను అదుపు చేసేందుకు లాఠీలకు పనిచెప్పారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను చెదరగొట్టి, పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా... కాంగ్రెస్ దాడికి నిరసనగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు బీజేపీ శ్రేణులు యత్నించాయి. అయితే వారిని కాంగ్రెస్ నేతలు అడ్డుకోవడంతో మరోసారి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రెండు ప్రధాన పార్టీల సవాల్`ప్రతిసవాల్‌తో కరీంనగర్‌లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు.

## రెడ్కో డీఈ ముత్యం వెంకటరమణ అరెస్ట్

ఆయనకు శేరిలింగంపల్లి, కూకట్‌పల్లిలో నాలుగు ప్లాట్లు, కూకట్‌పల్లిలో మూడంతస్తుల వాణిజ్య భవనం, గుట్టల బేగంపేటలో ఐదంతస్తుల భవనం ఉన్నట్లు గుర్తించారు. ఇంట్లో 2.09 కిలోల బంగారం, 3 కార్లు, బ్యాంకు ఖాతాల్లో రూ.52.02 లక్షలున్నట్లు తేలింది. ఆయన భార్య పేరుపై నాలుగు కన్‌స్ట్రక్షన్ కంపెనీలు ఉన్నట్లు గుర్తించారు. ఆ సంస్థలు 10 అపార్ట్‌మెంట్లను నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.27.65 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లిలో 4 ప్లాట్లు, అంజనేయనగర్‌లో జీ ప్లస్`3 కమర్షియల్ భవనం, గుత్తాల బేగంపేట్‌లో జీ ప్లస్`5 కమర్షియల్ భవనాలు ఉన్నట్లు గుర్తించారు. అలాగే ఆయన భార్య పేరుతో నమోదైన నాలుగు నిర్మాణ సంస్థల ద్వారా భారీ పెట్టుబడులు పెట్టినట్లు దర్యాప్తులో తేలిందని ఏసీబీ వెల్లడించింది. అంజనేయనగర్, మ సాపేట్ ప్రాంతాల్లో 10 అపార్ట్‌మెంట్లు నిర్మించినట్లు, వాటి నిర్మాణ విలువ సుమారు రూ.20 కోట్లుగా అంచనా వేసినట్లు అధికారులు తెలిపారు. సోదాల్లో బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.52.02 లక్షల నగదుతో పాటు 2,094 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నట్టు ఏసీబీ అధికారులు తెలిపారు. కియా, మహీంద్రా, బలెనో కార్లు సహా మ డు వాహనాలు, సుమారు రూ.30 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు, 19 విదేశీ మద్యం సీసాలు, ఒక ఐఎంఎఫ్ఎల్ మద్యం సీసాను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వెంకట రమణ 2019లో రూ.25 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ ట్రాప్‌లో చిక్కుకున్నారని, ఆ కేసులో ఇప్పటికే ఛార్జ్‌షీట్ కూడా దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు. అప్పట్లో స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం విలువను కూడా కలుపుకుంటే ఆయనకు సంబంధించిన మొత్తం అక్రమ ఆస్తుల విలువ రూ.28.14 కోట్లకు చేరిందని ఏసీబీ వెల్లడించింది. ప్రస్తుతం ఆయనను కోర్టులో హాజరుపరిచి తదుపరి విచారణ కొనసాగిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

# కాంగ్రెస్ ఓట్లు తొలగించేవందెకు బిజెపి ఎత్తులు

**వికారాబాద్,జూలై22(నినాదం):**



కొడంగల్ ప్రజలు, కార్యకర్తల ఆశీర్వాదంతోనే కాంగ్రెస్‌కు రాష్ట్రానికి నాయకత్వం వహించే అవకాశం వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం కొడంగల్‌లో పర్యటించిన సీఎం.. స్థానిక నాయకులు, బీఎలఏలతో సర్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'కొడంగల్‌లో నన్ను దెబ్బతీయాలని కుట్రలు చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో దెబ్బతీయాలంటే పునాదులు దెబ్బతీయాలని చూస్తున్నారు. పేర్లు వేరైనా బీఆరఎస్, బీజేపీ రెండూ ఒక్కటే. కొడంగల్‌లో కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లు తొలగించాలని చూస్తున్నారు. ఇంట్లో పొగ పెడితే రేవంత్ రెడ్డి బయటకు రాకుండా ఉంటారని కుట్రలు చేస్తున్నారు. ఎదురు నిలబడలేక దొంగదెబ్బ తీయాలని కుట్ర చేస్తున్నారు. కొడంగల్‌లో కుట్రలు చేసేవారిని బొంద పెట్టే బాధ్యత వి పై ఉందని సిఎం అన్నారు. 119 నియోజకవర్గాలను అభివృద్ధి చేయడం కోసం రోజుకు 18 గంటలు పనిచేసినా సమయం సరిపోవడంలేదని సీఎం తెలిపారు. ఆగస్టు 3 వరకు సర్ గడువు ఉందన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం 2,51,255 ఓట్లున్నాయని.. కానీ 1,96,626 ఓట్లు మాత్రమే సర్‌లో నమోదు చేసుకున్నారని.. మిగిలిన 54,635 నమోదు చేసుకోలేదని సీఎం తెలిపారు. మొత్తం ఓట్లలో ఇంకా 22 శాతం నమోదు జరగలేదని చెప్పారు. ఆ ఓట్లను తొలగిస్తే ప్రమాదం పొంచి ఉందన్నారు. వారందరినీ తిరిగి నమోదు చేయించాల్సిన బాధ్యత బీఎలఏలపై ఉందన్నారు. ఓటు పోగొట్టుకుంటే గుర్తింపు ఉండదని సీఎం తెలిపారు. ఓటు లేకుంటే చనిపోయిన వారితో సమానమన్నారు. కార్యకర్తగా ఇంటింటికీ వెళ్లి ఓటరు వెరిఫికేషన్ ఫారం నమోదు చేయించాలని నేతలకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఓట్లు తొలగించాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బీజేపీ, బీఆరఎస్ ఒక్కటై కాంగ్రెస్‌ను దొంగదెబ్బ తీయాలని గూడుపుఠాణి చేస్తున్నాయని మండిపడ్డారు. ఓటర్ల వివరాలు ఎన్నికల అధికారులకు అందించాల్సిన బాధ్యత బూత్ లెవెల్ ఏజెంట్లపైనే ఉందన్నారు. ఈనెల 30లోగా నూటికి నూరు శాతం కొడంగల్ నియోజకవర్గంలో ప్రక్షాళన పూర్తి కావాలని తెలిపారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ ఓటు కోల్పోవడానికి వీల్లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



# పదేళ్లలో 152 పేపర్ లీక్ కేసులు

ఆయన రాజీనామా చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఆయన రాజీనామాకు విద్యార్థులు పట్టుబడుతున్నారని, ఇది సరైన డిమాండేనని వ్యాఖ్యానించారు. ఈ దుస్థితికి ప్రతిబింబంగా మారిన ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకోవాల్సిందేనని తేల్చి చెప్పారు. గత పదేళ్లల్లో సుమారు 152 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయి. అంటే.. సగటున వారానికి ఒక పేపర్ లీక్ జరిగింది. కోట్ల మంది విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడింది. కానీ ఒక్క కేసులో కూడా దోషులెవరో తేలలేదు. ఇలా ఎందుకు జరిగిందని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఒకప్పుడు దేశానికి సంపదగా ఉన్న విద్యారంగం ఎన్డీయే పాలనలో ధ్వంసమైందని రాహుల్ గాంధీ ఆరోపించారు. పేద, మధ్యతరగతి వర్గాలకు విద్య భారంగా మారిందని చెప్పారు. కోచింగ్‌పై నీట్ అభ్యర్థుల వార్షిక ఖర్చు రూ.1.32 లక్షల కోట్లని అన్నారు. ఇది విద్యారంగం వార్షిక బడ్జెట్ రూ.1.42 లక్షల కోట్లకు దాదాపు సమానమని వ్యాఖ్యానించారు. సంపన్నుల కోసమే ఉద్దేశించిన ఈ వ్యవస్థలో పేదలకు స్థానం లేదని అన్నారు. సోమవారం నిరసనల సందర్భంగా విద్యార్థులపై లాఠీ చార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రధాని మోదీ విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సిందేనని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. విద్యార్థుల విషయంలో ఏం జరుగుతోంది. పారదర్శకమైన విద్యా వ్యవస్థ కావాలని యువత కోరుతోంది. కానీ, ఈ ప్రభుత్వం శాంతియుతంగా నిరసనలు చేస్తున్న వారిపై లాఠీఛార్జ్ చేయించింది. మధ్యతరగతి కుటుంబాలకు చదువు ఆర్థిక భారంగా మారింది. విద్యపై రూ.1.4లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయించినట్లు కేంద్రం చెబుతోంది. కానీ, గత దశాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా 152 పరీక్షల పత్రాలు లీక్ అయ్యాయి. దీని వల్ల 7.50కోట్ల మంది విద్యార్థులు నష్టపోయారు. విద్యార్థులు ఎంత బాధపడుతున్నా.. ఈ ప్రభుత్వం లెక్క చేయట్లేదు. ఈ పేపర్ లీకేజీ ఘటనల్లో ఇప్పటివరకు శిక్షపడిన నేరస్థుల సంఖ్య సున్నా అని రాహుల్ విమర్శించారు. దేశ యువతకు ఉద్యోగాలు లేవు. విద్యార్థుల ఆశలు, ఆకాంక్షలను ఈ ప్రభుత్వం నాశనం చేస్తోంది. మన దేశంలో చైనా వస్తువుల సంఖ్య పెరిగింది. పరిశ్రమలు మ తపడుతున్నాయి. బ్యాంకులను బడా వ్యాపారులు లూటీ చేస్తున్నారు. ఏఐ వల్ల కార్పొరేట్ రంగంలో ఉద్యోగాలు పోతున్నాయి. కేంద్రం విధానాల వల్ల పేదలు, విద్యార్థులు నష్టపోతున్నారు. విద్యార్థులంటే మనకు శత్రువులు కాదు. ఈ దేశ భవిష్యత్తు అన్న విషయం కేంద్రం గుర్తుంచుకోవాలని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద ప్రధాన్ పూర్తిగా విఫలమయ్యారు. లీకేజీకి బాధ్యత వహిస్తూ ఆయన రాజీనామా చేయాలని యువత డిమాండ్ చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి జవాబుదారీతనాన్ని యువత కోరుకుంటోంది. ఆందోళన చేస్తోన్న యువతపై దాడి చేసిన వారికి శిక్ష పడాలని కోరుతోంది. ఇక, ఈ వైఫల్యాలకు గానూ ప్రధాని క్షమాపణలు చెప్పాలని వారు కోరుతున్నారు. విద్యార్థుల డిమాండ్లకు మేం పూర్తి మద్దతు ప్రకటించాం అని రాహుల్ వెల్లడించారు. విద్యార్థుల ఆందోళనను మేం రాజకీయాలకు వాడుకోవట్లేదు. ప్రతిపక్ష నేతగా ప్రజల గళం వినిపించడం నా బాధ్యత. దీనిపై పార్లమెంట్‌లో మాట్లాడేందుకు కేంద్రం అవకాశం ఇవ్వట్లేదు. అందుకే విద్యార్థులకు మద్దతుగా వీధుల్లోకి వచ్చాం. నిన్న నిరసనల్లో నా పట్ల జరిగిన దానికి బాధపడటం లేదు. విద్యార్థులకు జరుగుతోన్న నష్టం విషయంలోనే బాధగా ఉంది. పరీక్షల విధానంలో మార్పులు రావాలి. ప్రజల కోసం ఎన్ని దెబ్బలు తినేందుకైనా నేను సిద్ధం అని కాంగ్రెస్ ఎంపీ తెలిపారు

# రాష్ట్రంలో పవర్ కట్ అనేదే లేదు



అయినప్పటికీ, విద్యుత్ సిబ్బంది అహర్నిశలు శ్రమించి, ముందుచూపుతో పక్కా ప్రణాళికలను అమలు చేయడం వల్లే ఈ సంక్లిష్ట పరిస్థితులను దాటుకొని ప్రజలకు ఎక్కడా ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా ఉచిత, నాణ్యమైన విద్యుత్‌ను అందించగలుగు తున్నామన్నారు. హనుమకొండలోని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో విద్యుత్ రంగ ప్రగతిపై ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సవి□క్షించారు. ఈ సమావేశంలో మంత్రులు కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు సీఎండీ వరుణ్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ కాళేశ్వరం, దేవాదుల, సీతారామ వంటి బృహత్తర ఎత్తిపోతల పథకాలతో పాటు వర్షాభావంతో రైతులు బోర్ వెల్స్ ఎక్కువగా వాడటం వల్ల పెరిగిన విద్యుత్ అవసరాలను ప్రభుత్వం విజయవంతంగా మేనేజ్ చేసిందన్నారు. రాష్ట్రంలో 'పవర్ కట' అనేదే లేదని, వర్షాలు, ఈదురుగాలుల వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల స్తంభాలు, లైన్లపై చెట్లు కూలినప్పుడు మాత్రమే తాత్కాలికంగా విద్యుత్ అంతరాయం కలుగుతుందని, దీనిని ప్రజలు పవర్ కట్‌గా భావించవద్దని స్పష్టం చేశారు. 'ప్రజా బాట', 'పొలం బాట' వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా అధికారులు స్వయంగా ప్రజల వద్దకే వెళ్తూ సమస్యలను పరిష్కరిస్తున్నారని అభినందించారు. గతంలో ఎక్కువ వడ్డీలతో తెచ్చిన పాత రుణాలను 'రీస్ట్రక్చ□రింగ' చేయడం ద్వారా సంస్థల రుణభారం తగ్గించి, డిస్కంలను దేశంలోనే నంబర్`1 స్థానంలో నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. విద్యుత్ సేవా ప్రమాణాలను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లేందుకు దేశంలోనే ప్రథమంగా తెలంగాణలో ఎలక్ట్రిసిటీ అంబ్యులెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించారు. గతంలో వైద్యారోగ్య శాఖలో 108 అంబ్యులెన్స్ సేవలు తీసుకొచ్చిన తరహాలోనే, ఇప్పుడు విద్యుత్ అత్యవసర సమస్యల కోసం ట్రాన్స్‌ఫార్మర్లు, నిచ్చెనలు, వైర్లతో పాటు నిపుణులైన ఇంజనీర్లు నిరంతరం అందుబాటులో ఉండేలా ఈ వాహనాలను రంగంలోకి దించామన్నారు. వినియోగదారులు ఉచిత టోల్ ఫ్రీ నంబర1912 కు ఫోన్ చేయగానే, కృత్రిమ మేధస్సు సాంకేతికత ద్వారా సమాచారాన్ని స్వీకరించి, ఆటోమేటిక్‌గా క్షణాల్లో సమాచారాన్ని అంబ్యులెన్స్ సిబ్బందికి చేరవేస్తుందని... మెసేజ్ ఆధారంగా అంబ్యులెన్స్ నిమిషాల వ్యవధిలోనే ఘటనా స్థలానికి చేరుకుని సమస్యను తక్షణమే పరిష్కరిస్తుందని వివరించారు. విద్యుత్ వ్యవస్థకు మ లస్తంభాలైన లైన్‌మెన్లు, ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉందని ఉద్ఘాటిస్తూ... విధి నిర్వహణలో అనుకోకుండా ప్రమాదం జరిగి సిబ్బంది మరణిస్తే ఆ కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు రూ. 1.20 కోట్లు బీమా సౌకర్యాన్ని కల్పించామని తెలిపారు. అలాగే లైన్ క్లియరెన్స్ సమయంలో ప్రమాదాలను అరికట్టేందుకు అవసరమైన సేఫ్టీ కిట్లు, య నిఫారాలు అందించినట్లు పేర్కొన్నారు. మరోవైపు 'గృహజ్యోతి' పథకం ద్వారా 200 య నిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందుతున్న 53 లక్షల కుటుంబాల బిల్లుల మొత్తాన్ని ఆర్థిక శాఖ డిస్కం కంపెనీలకు చెల్లిస్తోందని తెలిపారు. దీంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 30 లక్షల వ్యవసాయ పంప్‌సెట్లకు ఏటా అయ్యే ?రూ. 14,000 కోట్ల సబ్సిడీ నిధులను? కూడా ఆర్థిక శాఖ నేరుగా డిస్కంలకు విడుదల చేస్తోందని వెల్లడించారు.

Union Bank of India
A Government of India Undertaking

మీర్‌బాగ్ కాలనీ బ్రాంచ్-(SOL ID: 13831)
మహబూబ్‌నగర్ రీజియన్. ఫోన్: 8688794150.
ఇ-మెయిల్: ubin0813834@unionbankofindia.bank

Ref: 13831/SARFAESIA/Possession Notice/592745568/2025-26 Date: 20.07.2026

**స్వాధీనతా ప్రకటన**
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ -8(1))
(స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (రెండవ) యాక్ట్, 2002 (చట్టము నెం. 2002 యొక్క 54) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదవబడు సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మీర్‌బాగ్ కాలనీ బ్రాంచ్ (Sol Id: 13831)** వారి అధీకృత అధికారి అయిన ఈ క్రింది సంతకముదారు జారీ చేసిన **డిమాండ్ నోటీసు తేది: 07.04.2026** ప్రకారము **రుణగ్రహీత/లు: రుణగ్రహీత/దరఖాస్తుదారు: శ్రీ కొండ్ర సాగర్, తండ్రి కొండ్ర పెద్ద నరసింహ, చిరునామా-1:** ప్లాట్ నెం. 52, ఎన్‌జివోస్ కాలనీ, అర్బన్ హాస్పిటల్ లేన్ దగ్గర, నల్గొండ పోస్ట్ జిల్లా, తెలంగాణ-508001, **చిరునామా-2:** ఇంటి నెం. 8-87, మర్రెమ్మగూడెం, అయిటిపాముల గ్రామం, కట్టంగూర్, నల్గొండ జిల్లా, తెలంగాణ - **సహ-దరఖాస్తుదారు: కుమారి కొండ్ర ఇందిర, భర్త కొండ్ర సాగర్, చిరునామా-1:** ఇంటి నెం. 1-4-945 నుండి 950 వరకు, బ్లాక్ నెం. 3, ఫ్లాట్ నెం. 530, జనప్రియ అబోడ్స్, గాంధీనగర్, సికింద్రాబాద్, తెలంగాణ-500080. **చిరునామా-2:** ప్లాట్ నెం. 52, ఎన్‌జివోస్ కాలనీ, అర్బన్ హాస్పిటల్ లేన్ దగ్గర, నల్గొండ పోస్ట్ జిల్లా, తెలంగాణ-508001, **చిరునామా-3:** ఇంటి నెం. 8-87, మర్రెమ్మగూడెం, అయిటిపాముల గ్రామం, కట్టంగూర్, నల్గొండ జిల్లా, తెలంగాణ వారిని నోటీసులో తెలిపిన బకాయి మొత్తం **రూ. 26,98,303/- (రూపాయలు ఇరవై ఆరు లక్షల తొంభై ఎనిమిది వేల మూడు వందల మూడు మాత్రమే)** లను సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించమని కోరడమైనది.

సదరు రుణగ్రహీత సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదవబడు సదరు చట్టములోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారములను వినియోగించుకొనుచూ క్రింద తెలిపిన ఆస్తిని ఈ క్రింది సంతకముదారు **20 జులై, 2026**న స్వాధీనం చేసుకోవడమైనదని రుణగ్రహీతను మరియు సాధారణప్రజానీకమునకు తెలియజేయడమైనది.

కావున ప్రత్యేకించి రుణగ్రహీతను మరియు సాధారణప్రజానీకమును హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరుపకూడదనియు, ఒక వేళ జరిపినట్లయితే **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మీర్‌బాగ్ కాలనీ బ్రాంచ్ (Sol Id: 13831)** వారికి చెందవలసిన బకాయి మొత్తము **రూ. 26,98,303/- (రూపాయలు ఇరవై ఆరు లక్షల తొంభై ఎనిమిది వేల మూడు వందల మూడు మాత్రమే)** ల క్రింద వర్తించును. రుణగ్రహీత సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గల సమయ లభ్యత కొరకు చట్టములోని సెక్షన్ 13 సబ్‌సెక్షన్ (8)ని గమనించవలసిందిగా రుణగ్రహీతలను కోరడమైనది.

**ఆస్తి యొక్క షెడ్యూల్**
**శ్రీ కొండ్ర సాగర్ (రుణగ్రహీత) తండ్రి కొండ్ర పెద్ద నరసింహ** కు చెంది ఉండి, తెలంగాణ-508001, నల్గొండ, చెర్లపల్లి గ్రా॥, "నేచర్ స్మార్ట్ సిటీ" వద్ద సర్వే నెం. 643లో 120.00 చ॥గ॥లు దానికి సమానమైన 103.33 చ॥మీ॥ల విస్తీర్ణము కలిగిన ప్లాట్ నెం. 29 మధ్య భాగము గల నివాస ప్లాట్ యావదాస్తి. **సరిహద్దులు:** తూర్పు: 40'-0" అడుగుల వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెం. 32, ఉత్తరం: ప్లాట్ నెం. 29 భాగము, దక్షిణం: ప్లాట్ నెం. 29 భాగము.

తేది: 20.07.2026 ప్రదేశం: నల్గొండ
చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా



ఫారం నెం.14
(రెగ్యులేషన్ 33 (2) చూడుము)
రిజిస్టర్డ్ A/D, దస్తి విఫలమైనందున ప్రచురణ ద్వారా

**రికవరీ ఆఫీసర్ -I/II వారి కార్యాలయం**
**డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ హైదరాబాద్ (DRT-1)**
3వ అంతస్తు, త్రివేణి కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్-500001.

**డిమాండ్ నోటీసు**
రికవరీ ఆఫ్ డెట్స్ & బ్యాంక్రప్టసీ యాక్ట్, 1993లోని సెక్షన్‌లు 25 నుండి 28 మరియు ఆదాయపు పన్ను చట్టం, 1961లోని రెండవ షెడ్యూల్ యొక్క రూల్ 2 క్రింద నోటీసు

RC/22/2025 15-07-2026

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
వర్సెస్
శ్రీ ఆపూరి వెంకటయ్య ఆపూరి

దిగువ వారికి,
**(CD-1) శ్రీ ఆపూరి వెంకటయ్య ఆపూరి రాములు తండ్రి ఎ. రాములు,** వయస్సు : 56 సంవత్సరాలు, వృత్తి : పాఠశాల, అసిస్టెంట్ (ఉపాధ్యాయుడు), నివాసం : ఇం.నెం.6.135/3, విజయ హోమ్స్, స్వాగత్ గ్రాండ్ హోటల్ ప్రక్కన, రోడ్ నెం.36, జిల్లెలగూడ, హైదరాబాద్-500097. హైదరాబాద్, తెలంగాణ-500097.
**మరియు కార్యాలయం :** జెపి హై స్కూల్, నోముల, నక్రేకల్, నల్గొండ-508211.
**(CD-2) జెపి ఉన్నత పాఠశాల యొక్క అధీకృత అధికారి,** నివాసం : నోముల, నక్రేకల్, నల్గొండ-508211. (అధికారిక పార్టీ)
**OA/283/2025** లో డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, హైదరాబాద్ (డిఆర్‌టి-1), ప్రిసైడింగ్ ఆఫీసర్ ద్వారా జారీచేసిన ఉత్తర్వును అనుసరిస్తూ రికవరీ సర్టిఫికెట్ ప్రకారం **రూ.22,72,415/- (రూపాయలు ఇరవై రెండు లక్షల డెబ్బై రెండు వేల నాలుగు వందల పదిహేను మాత్రమే)** మొత్తాన్ని, దానిపై **30.06.2025** తేది నుండి చెల్లింపు జరిగే వరకు సంవత్సరానికి సాధారణ వడ్డీ % వంతున భవిష్య వడ్డీ మరియు పెండెంటలైట్ (రికవరీ సర్టిఫికెట్ ప్రకారం)తో పాటు మరియు ఖర్చులు **రూ. 51,015/- (రూపాయలు యాభై ఒక్క వేల పదిహేను మాత్రమే)**లను మీరు (ఉమ్మడిగా మరియు విడివిడిగా/ పూర్తిగా/ పరిమితంగా) చెల్లించవలసిఉన్నది.
2. కావున ఈ నోటీసు స్వీకరణ నుండి **15 రోజులలోగా** పైన తెలిపిన మొత్తమును చెల్లించవలసిందిగా ఆదేశిస్తూ, విఫలమైనచో రికవరీ ఆఫ్ డెట్స్ డ్యూ టూ బ్యాంక్స్ మరియు ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ యాక్ట్, 1993 మరియు రూల్స్‌ను పరిశీలిస్తూ వసూలు చేయబడును.
3. కావున తదుపరి విచారణ తేదిలోగా మీ ఆస్తులపై పూర్తి వివరములతో ఒక అఫిడవిట్ దాఖలు చేస్తూ ప్రకటించవలసిందిగా మిమ్ముల్ని ఆదేశించడమైనది.
4. కావున తదుపరి ప్రొసీడింగ్స్ కొరకు **తేది : 28.10.2026న ఉ॥ 10.30గం॥లకు** ఈ క్రింది సంతకందారు సమక్షములో హాజరు కావలసిందిగా మిమ్ముల్ని కోరడమైనది.
5. పైన తెలిపిన మొత్తమునకు అదనముగా మీరు చెల్లించవలసిన మొత్తము :
(ఎ) సర్టిఫికెట్/ అమలుచేయు ప్రొసీడింగ్స్ యొక్క ఈ నోటీసు తరువాత వెంటనే ప్రారంభమగు కాలమునకు వడ్డీ చెల్లించవలెను.
(బి) బకాయి మొత్తము వసూలు చేసుకొనుటకు అన్ని ఇతర ప్రొసీడింగ్స్ చేపట్టుటకు మరియు ఇతర ప్రాసెస్‌లు, వారెంట్లు మరియు ఈ నోటీసు సేవలకు సంబంధించి అన్ని ఛార్జీలు, ధరలు మరియు వ్యయములతో చెల్లించవలెను.
**తేది : 15.07.2026**న నాచే సంతకం చేసి మరియు ట్రిబ్యునల్ సీలు వేసి జారీచేయడమైనది.
రికవరీ ఆఫీసర్,
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, హైదరాబాద్ (DRT-1)



HDFC BANK
**హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్**
బ్రాంచ్: నెం. 3-6-310, హైదర్‌గూడ రోడ్, బషీర్‌బాగ్, హైదరాబాద్-500029.
టెలి: 18002100018/040-66588491- CIN L65920MH1994PLC080618, Website: www.hdfcbank.com

**డిమాండ్ నోటీస్**
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదవబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్స్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (యాక్ట్)లోని సెక్షన్ 13(2) క్రింద ఇందుమూలముగా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్స్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచు ఈ క్రింది సంతకందారైన **హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్** (17 మార్చి, 2023 తేదీ గల ఉత్తర్వు ప్రకారం గౌరనీయ ఎన్‌సిఎల్‌టి - ముంబై వారిచే ఆమోదించబడిన విలీన పథకం ద్వారా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ నందు విలీనం అయినటువంటి పూర్వపు హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్) (హెచ్‌డిఎఫ్‌సి) యొక్క అధీకృత అధికారి సదరు చట్టములోని సెక్షన్ 13(2) క్రింద జారీ చేసిన డిమాండ్ నోటీసు ప్రకారము రుణగ్రహీత(లు)/ చట్టబద్ధ వారసుడు(లు)/చట్టబద్ధ ప్రతినిధి(లు) లకు ఈ క్రింద తెలియజేసిన బకాయి మొత్తమును సంబంధిత డిమాండ్ నోటీసు/నోటీసుల తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించమని కోరుతూ వివరములు ఈ క్రింది విధముగా తెలియజేయడమైనది. ఈ క్రింది సంతకందారు సదరు రుణగ్రహీత(లు)/చట్టబద్ధ వారసుడు(లు)/చట్టబద్ధ ప్రతినిధి(లు)ల యొక్క చివరిగా తెలిసిన చిరునామాల యొక్క ప్రాంగణంలో ఈ నోటీసులను అతికించడమైనది. అంతేగాక సదరు నోటీసు కాపీలు ఈ క్రింది సంతకందారు వద్ద లభ్యమగును మరియు రుణగ్రహీత(లు)/చట్టబద్ధ వారసుడు(లు)/చట్టబద్ధ ప్రతినిధి(లు) సంబంధిత సదరు కాపీలు కావలసిన వారు ఈ క్రింది సంతకందారునుండి ఏదైనా పని దినములలో సాధారణ ఆఫీసు వేళలయందు పొందవచ్చును. పై దానికి సంబంధించి సదరు రుణగ్రహీతల(లు)చే అమలు చేయబడిన రుణ ఒప్పందము మరియు ఇతర డాక్యుమెంట్లు/వ్రాసినవి ఏవైన ఉన్నచో వాటితో చదువబడే బకాయి మొత్తము చెల్లింపు తేదీ మరియు/లేదా రాబట్టుకొనువరకు కాలమ్ (సి) నందు దిగువ తెలియజేయబడిన సంబంధిత తేదీల నుండి సదరు డిమాండ్ నోటీసులలో వివరించబడిన ప్రకారము తదుపరి వడ్డీతో సాలుకు 18% చొప్పున వారి సంబంధిత పేర్లకు ఎదురుగా సూచించబడిన మొత్తములు ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోపుగా హెచ్‌డిఎఫ్‌సికి చెల్లించవల్సిందిగా సదరు రుణగ్రహీతలు/చట్టబద్ధ వారసుడు(లు)/చట్టబద్ధ ప్రతినిధులకు మరియొక పర్యాయము ఇందుమూలముగా నోటీసు జారీ చేయడమైనది. సదరు రుణగ్రహీత(లు)చే వరుసగా హెచ్‌డిఎఫ్‌సికి దిగువ సెక్యూర్ చేయబడిన ఆస్తి(లు) రుణం తిరిగి చెల్లించుటకు తగిన విధంగా సెక్యూరిటీగా తనఖా పెట్టబడినవి. సెక్యూర్డ్ ఆస్తి/లు లను విడిపించుకొనుటకు లభించే సమయానికి సంబంధించి చట్టము యొక్క సెక్షన్ 13 నందలి ఉపసెక్షన్ (8) నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీత(లు)లను కోరడమైనది.

| క్ర. సం. | రుణగ్రహీత(లు)ల పేరు | మొత్తము రుణ బకాయిలు | డిమాండు నోటీసు తేది | సెక్యూర్డ్ ఆస్తి(లు)/స్థిరాస్తి(లు) యొక్క వివరణ |
|---|---|---|---|---|
| (a) | (b) | (C) | (d) | (e) |
| 1 | శ్రీ బురుగు విజయ్ కుమార్ (రుణగ్రహీత) | 31-మార్చి-2026* నాటికి బకాయిలు రూ. 88,92,623/- (రూపాయలు ఎనభై ఎనిమిది లక్షల తొంభై రెండు వేల ఆరు వందల ఇరవై మూడు మాత్రమే) | 15-జూన్-2026 | రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెంట్ మం॥, బండరావిరాల గ్రా॥ మరియు గ్రామపంచాయతీ వద్ద సర్వే నెంలు. 293/2ఎ, 293/2ఎ/1 & 293/2ఎ/2 లలోని "స్వలేన" అను పేరుగల లేఅవుట్‌లో 693 చ॥గ॥లు దానికి సమానమైన 579.43 చ॥మీ॥ల విస్తీర్ణము కలిగిన నెం. 101 గల ప్లాట్ యావదాస్తి. **సరిహద్దులు: ఉత్తరం:** 30' వెడల్పు రోడ్డు, **దక్షిణం:** 100' వెడల్పు రోడ్డు, **తూర్పు:** ప్లాట్ నెం. 100, **పడమర:** ప్లాట్ నెం. 102. |
| 2 | శ్రీ బద్దం విజయ్ (రుణగ్రహీత) | 30-ఏప్రిల్-2026* నాటికి బకాయిలు రూ. 53,07,105/- (రూపాయలు యాభై మూడు లక్షల ఏడు వేల నూట ఐదు మాత్రమే) | 29-మే-2026 | సబ్ జిల్లా మరియు జిల్లా రిజిస్ట్రేషన్ కరీంనగర్ అధికార పరిధి క్రింద, సిటీ మున్సిపల్ కార్పొరేషన్ కరీంనగర్ పరిధిలోని కరీంనగర్ జిల్లా మరియు టౌన్ లోకాలిటీలోని ఆరేపల్లి రెవెన్యూ గ్రా॥, ఆరేపల్లి వద్ద సర్వే నెం. 7/డిలో ప్లాట్ నెం. 12లోని మొత్తం 162.46 చ॥గ॥లు లేదా 135.83 చ॥మీ॥ల ఏరియాలోని 943.70 చ॥అ॥ల గ్రౌండ్ ఫ్లోర్ ప్లింత్ ఏరియా కలిగిన ఆర్‌సిసి భవనము ఇంటి నెం. 2-93/1/16/12/ఎ/1 (అసెస్‌మెంట్ నెం. 1102201096) యావదాస్తి. **సరిహద్దులు: తూర్పు:** ఇతరుల ప్లాటు, **పడమర:** ప్రస్తుత 28'-0" వెడల్పు రోడ్డు ప్రతిపాదిత 30-0" వెడల్పు రోడ్డు, **ఉత్తరం:** ప్లాట్ నెం. 11లోని నిర్మాణంలో ఉన్న ఇతరుల ఇల్లు, **దక్షిణం:** ప్లాట్ నెం. 13లోని నిర్మాణంలో ఉన్న ఇతరుల యొక్క ఇల్లు. |
| 3 | శ్రీమతి కాశి కవిత (రుణగ్రహీత) శ్రీ శోభన్‌బాబు కాశిమల్ల (సహ-రుణగ్రహీత) | 28-ఫిబ్రవరి-2026* నాటికి బకాయిలు రూ. 83,80,759/- (రూపాయలు ఎనభై మూడు లక్షల ఎనభై వేల ఏడు వందల యాభై తొమ్మిది మాత్రమే) | 20-ఏప్రిల్-2026 | రంగారెడ్డి జిల్లా, రిజిస్ట్రేషన్ వనస్థలిపురం, తుర్కయాంజల్ మున్సిపాలిటీ క్రింద, రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ మం॥, తుర్కయాంజల్ గ్రా॥ వద్ద సర్వే నెం. 473/ఎలోని 126 చ॥గ॥ల విస్తీర్ణము గల ప్లాట్ నెం. 20 ఉత్తర భాగము మరియు 61 చ॥గ॥ల విస్తీర్ణము గల ప్లాట్ నెం. 20 దక్షిణ భాగము, మొత్తం విస్తీర్ణము 187 చ॥గ॥లు లేదా దానికి సమానమైన 156.35 చ॥మీ॥లు, గ్రౌండ్ ఫ్లోర్‌లో 999 చ॥అ॥ల ప్లింత్ ఏరియా కలిగిన గృహము యావదాస్తి. **సరిహద్దులు: ఉత్తరం:** ప్లాట్ నెం. 19, **దక్షిణం:** ప్రస్తుత ఇల్లు, **తూర్పు:** 25' వెడల్పు రోడ్డు, **పడమర:** ప్లాట్ నెం. 11. |
| 4 | శ్రీ గౌరవ్ గుప్త (రుణగ్రహీత) శ్రీ పియూష్ గుప్త (సహ-రుణగ్రహీత) | 31-డిసెంబర్-2025* నాటికి బకాయిలు రూ. 55,20,433/- (రూపాయలు యాభై ఐదు లక్షల ఇరవై వేల నాలుగు వందల ముప్పై మూడు మాత్రమే) | 10-మార్చి-2026 | తెలంగాణ రాష్ట్రం (గతంలో రంగారెడ్డి జిల్లా, కుత్బుల్లాపూర్ మండలంగా పిలువబడేది), మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, దుండిగల్ గండిమైసమ్మ మం॥, కొంపల్లి గ్రా॥ మరియు గ్రామపంచాయతీ వద్ద సర్వే నెం. 116 భాగములో ఎ. 5-00 గుంటల విస్తీర్ణము గల వ్యవసాయ మెట్ట భూమి యావదాస్తి. **సరిహద్దులు: ఉత్తరం:** 40' వెడల్పు రోడ్డు, **దక్షిణం:** సర్వే నెం. 116 భాగములోని వ్యవసాయ భూమి, **తూర్పు:** సర్వే నెం. 116 భాగములోని వ్యవసాయ భూమి, **పడమర:** సర్వే నెం. 115 భాగములోని వ్యవసాయ భూమి. **ఆస్తి యొక్క షెడ్యూల్ (ఫ్లాట్ నెం. 103):** తెలంగాణ రాష్ట్రం (గతంలో రంగారెడ్డి జిల్లా, కుత్బుల్లాపూర్ మండలంగా పిలువబడేది), మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, దుండిగల్ గండిమైసమ్మ మం॥, కొంపల్లి గ్రా॥ మరియు గ్రామపంచాయతీ వద్ద సర్వే నెం. 116 భాగములో 24.200 చ॥గ॥లలో 47.03 చ॥గ॥ల భూమి అవిభాజ్యవాటాతోపాటు "హై విజన్ రెసిడెన్సీ" భవనంలో స్టిల్ట్ ఫ్లోర్, కార్ పార్కింగ్ + ఐదు పై అంతస్తులు కలిగి ఉన్న 1040 చ॥అ॥ల ప్లింత్ ఏరియా (కామన్ ఏరియా కలుపుకొని) మరియు ప్రత్యేక కార్ పార్కింగ్ స్థలంతో మొదటి అంతస్తులోని పి-బ్లాక్‌లో ఉన్న ఫ్లాట్ నెం. 103 (ఇంటి నెం. 3-50/పి/103). యావదాస్తి. **సరిహద్దులు: ఉత్తరం:** ఫ్లాట్ నెం. 104, **దక్షిణం:** ఖాళీ ప్రదేశం, **తూర్పు:** ఫ్లాట్ నెం. 102, **పడమర:** ఖాళీ ప్రదేశం. |
| 5 | శ్రీ ఎర్ర శ్రీనివాస్ రావు రుణగ్రహీత) శ్రీ ఎర్ర చంద్రశేఖర్ (సహ-రుణగ్రహీత) | 31-ఆగస్టు-2025* నాటికి బకాయిలు రూ. 1,07,93,897/- (రూపాయలు ఒక కోటి ఏడు లక్షల తొంభై మూడు వేల ఎనిమిది వందల తొంభై ఏడు మాత్రమే) | 07-నవంబర్-2025 | సూర్యాపేట జిల్లా, కోదాడ రెవెన్యూ, కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని కోదాడ గ్రా॥ వద్ద సర్వే నెం. 152, ప్లాట్ 14, గృహము 12-134 గల ఆస్తి. పాత బ్లాక్ నెం. 11, కొత్త బ్లాక్ నెం. 12లోని సర్వే నెం. 1052, ప్లాట్ నెం. 14లో 208 చ॥మీ॥ల విస్తీర్ణము గల ఇంటి నెం. 12-134, 50 చ॥మీ॥ల విస్తీర్ణము, ప్లాట్ నెం. 11లో 150 చ॥మీ॥ల విస్తీర్ణము, మొత్తం 408 చ॥మీ॥లు విస్తీర్ణము మరియు గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు కలిగిన గృహము డోర్ నెం. 12-1-33/2, విద్యుత్ మీటర్, విద్యుత్ ఫిట్టింగ్ మొ॥గు॥ల ఈ ఇంటికి సంబంధించిన అన్ని సౌకర్యాలు కలిగిన ఇంటి యావదాస్తి. **సరిహద్దులు: ఉత్తరం:** మున్సిపాలిటీ రోడ్డు, **దక్షిణం:** మాణిక్యరావు, తోట రంగారావు యొక్క స్థలం, **తూర్పు:** మున్సిపాలిటీ రోడ్డు, **పడమర:** 30 అడుగుల వెడల్పు మున్సిపాలిటీ రోడ్డు. |

*చెల్లింపు మరియు/లేదా రాబట్టుకొనే తేదీ వరకు అయిన వర్తించే విధంగా తదుపరి వడ్డీ, అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు మొదలైన వాటితో.
సదరు రుణగ్రహీతలు ఒకవేళ పైన తెలిపిన విధంగా హెచ్‌డిఎఫ్‌సికి మొత్తమును చెల్లించుటలో విఫలమైనట్లయితే అప్పుడు హెచ్‌డిఎఫ్‌సి సదరు చట్టంలోని సెక్షన్ 13(4) మరియు వర్తించు రూల్స్ క్రింద రుణగ్రహీత(లు)/చట్టబద్ధవారసుడు(లు)/ చట్టబద్ధప్రతినిధి(లు) వారి సెక్యూర్డ్ ఆస్తి(లు)/స్థిరాస్తి(లు) పై వారి స్వంత బాధ్యతపై నష్టాలతో కూడిన పర్యసానము ఎదుర్కొనవలెను.
కావున సదరు రుణగ్రహీత(లు)/చట్టబద్ధ వారసుడు(లు)/చట్టబద్ధ ప్రతినిధి(లు) వారు సదరు చట్టం క్రింద పైన తెలిపిన సెక్యూర్డ్ ఆస్తి(లు)/స్థిరాస్తి(లు) హెచ్‌డిఎఫ్‌సి వారి ముందస్తు వ్రాత పూర్వక అనుమతి లేకుండా ఏవిధమైన అమ్మకము లేదా లీజు లేదా మరే ఇతరములైన బదిలీలు చేయుటకు నిషేధించడమైనది. ఎవరైనా వ్యక్తి సదరు చట్టములోని నిబంధనలు లేదా దాని క్రింద చేయబడిన రూల్స్‌ను ఉల్లంఘించినట్లయితే అట్టివారు చట్టం క్రింద కారాగారము మరియు/లేదా జరిమానాకు శిక్షార్హులు.

తేది: 22-జులై-2026
ప్రదేశం: హైదరాబాద్
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తరపున
సం/- అధీకృత అధికారి
రిజిస్టర్డ్ ఆఫీస్: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ పరేల్ (వెస్ట్), ముంబై -400020.


# యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో.. "షాప్ టూ షాప్ " వినియోగదారుల సేవా కార్యక్రమం



**మహబూబ్‌నగర్, జూలై 22 (నినాదం):** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మహబూబ్‌నగర్ ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని అన్ని శాఖలు కస్టమర్ సర్వీస్ ఎక్సలెన్స్ కార్యక్రమంలో భాగంగా "షాప్ టూ షాప్" వినియోగదారుల అవగాహన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమం ద్వారా వినియోగదారుల అవసరాలను ప్రత్యక్షంగా తెలుసుకొని, వారికి అవసరమైన బ్యాంకింగ్ సేవలు మరియు ఆర్థిక పరిష్కారాలను అందించడం ప్రధాన లక్ష్యంగా చేపట్టబడింది. ఈ కార్యక్రమంలో శాఖలలోని అన్ని కేడర్లకు చెందిన ఉద్యోగులు--- శాఖ మేనేజర్లు, అధికారులు, క్లరికల్ సిబ్బంది, సబార్డినేట్ సిబ్బంది--- ఉత్సాహంగా పాల్గొన్నారు. వ్యాపార సంస్థలు, దుకాణాలను ప్రత్యక్షంగా సందర్శించి, వినియోగదారులతో ముఖాముఖి వారి అవసరాలను తెలుసుకొని తగిన బ్యాంకింగ్ ఉత్పత్తులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా పొదుపు, కరెంట్ ఖాతాలు, వ్యక్తిగత రుణాలు, గృహ రుణాలు, ఎంఎస్ఎంఈ రుణాలు, వ్యవసాయ రుణాలు, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, బీమా, పెట్టుబడి పథకాలు మరియు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వినియోగదారులకు అవగాహన కల్పించారు. అలాగే సురక్షితమైన, సులభమైన డిజిటల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలని ప్రోత్సహించారు. మహబూబ్‌నగర్ ప్రాంతీయ కార్యాలయం వినియోగదారులకు అత్యుత్తమ సేవలను అందించాలనే తన నిబద్ధతను మరోసారి పునరుద్ఘాటించింది. ఈ కార్యక్రమానికి విశేష స్పందన తెలిపిన వినియోగదారులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, అన్ని కేడర్ల ఉద్యోగులు అంకితభావంతో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రాంతీయ కార్యాలయం అభినందనలు తెలిపింది.

# కేంద్ర ప్రభుత్వం యువత భవిష్యత్‌ను అంధకారం చేస్తోంది

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**
**రాహుల్ గాంధీ అరెస్టు**
**ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటు**
**నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే దిగిపోవాలని డిమాండ్**



**హనుమకొండ, జూలై 22, (నినాదం):** ఏఐసీసీ, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపులో భాగంగా మేరకు బుధవారం హనుమకొండ డీసీసీ భవన్ వద్ద కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసనగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ నిరసన, ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహన కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రతిపక్ష నాయకుల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తూ, దేశవ్యాప్తంగా కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసిన 'నీట్' పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ భారీ నిరసన చేపట్టారు. డీసీసీ భవన్ వద్ద దిష్టిబొమ్మ దహనం అనంతరం, నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా తరలివెళ్లి అంబేద్కర్ సెంటర్ వద్ద కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖ పాల్గొని కేంద్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక, ప్రజావ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వీరితో పాటు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె. ఆర్. నాగరాజు, టీపీసీసీ సభ్యులు కూచన రవలి, ఇవి శ్రీనివాస్ రావు, భట్టి శ్రీనివాస్ రావు, గ్రంధాలయ చైర్మన్ అజీజ్ ఖాన్, మాజీ మేయర్ గుండు సుధారాణి, ఏనుమాముల మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక, కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ పింగిలి వెంకట్రామ్ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ నసీర్ అహ్మద్, జిల్లా కమిటీ సభ్యులు, డివిజన్, మండలాధ్యక్షులు, హనుమకొండ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, అధ్యక్షురాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఈ కేంద్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక, అప్రజాస్వామిక విధానాలపైతీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశంలో సామాన్యులు, విద్యార్థుల తరపున ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రతిపక్ష నాయకులను అక్రమంగా అరెస్టులు చేయించడం బీజేపీ అహంకారానికి పరాకాష్ట అని ఆయన మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం ఎన్ని అణచివేత చర్యలకు పాల్పడినా కాంగ్రెస్ పార్టీ భయపడదని, ప్రజల తరపున పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న 'నీట్' పరీక్ష పేపర్ లీకేజీ కావడం ఈ కేంద్ర ప్రభుత్వచేతగానితనానికి నిదర్శనమని, ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు అన్యాయం చేస్తూ పేపర్లు అమ్ముకుంటున్న విద్యా మాఫియాకు ఈ ప్రభుత్వం కొమ్ముకాస్తోందని ఆయన విమర్శించారు. విద్యావ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవిలో కొనసాగే అర్హత కోల్పోయారని, నీట్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ ఆయన తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



నిలకడలేని,అవినీతిమయమైన నేషనల్... టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టీ ఏ ) ని కేంద్రం తక్షణమే రద్దు చేసి, పారదర్శకమైన పరీక్షా విధానాన్నితీసుకురావాలని, నిరుద్యోగులను మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని భట్టి విక్రమార్క హెచ్చరించారు.

**డిప్యూటీ సీఎం, మంత్రి కొండా సురేఖకు ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు..**

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖలకు ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, వరంగల్ పశ్చిమ, పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కెఆర్ నాగరాజు, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న, తదితరులు పుష్ప గుచ్ఛాలు, పూలమొక్కలను అందించి ఘన స్వాగతం పలికారు. అక్కడే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. కొద్దిసేపు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, జిల్లా ఉన్నతాధికారులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సెంట్రల్ జోన్ డిసీపీ దార కవిత, జిల్లా అదనపు కలెక్టర్ రవి, డీఆర్వో శ్రీనివాస్, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


KBNBFC
**క్రేజీబీ సర్వీసెస్ లిమిటెడ్**
(పూర్వము క్రేజీబీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ గా పిలువబడేది)
KrazyBee Services Limited రిజిస్టర్డ్ ఆఫీస్ : 3వ అంతస్తు, నెం. 128/9, మారుతి సఫైర్, 35, హెచ్‌ఎఎల్ ఓల్డ్ ఎయిర్ పోర్ట్ రోడ్, మురుగేష్‌పాల్య, బెంగళూరు, కర్ణాటక - 560017

**స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన**
ఇందుమూలముగా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇక మీదట చట్టం గా రెఫర్ చేయబడును) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 రూల్ 8(6) & 9(1) (ఇక మీదట రూల్స్ గా రెఫర్ చేయబడును) తో చదువబడుతూ స్థిరాస్తుల అమ్మకం కొరకు వేలం అమ్మకం ప్రకటన.
ఇందుమూలంగా ఈ నోటీసు ద్వారా సాధారణ ప్రజానీకానికి మరియు ప్రదానంగా రుణగ్రహీత(లు) సహరుణగ్రహీత (లు) మరియు హామీదారు(లు) లేదా వారి చట్టబద్ధ వాలసుడు (లు) లేదా ప్రతినిధి (ల) కు తెలియజేయునది ఏమనగా **క్రేజీబీ సర్వీసెస్ లిమిటెడ్.,** (ఇక మీదట సెక్యూర్డ్ క్రెడిటార్ గా రెఫర్ చేయబడును) కు తనఖా / చార్జ్ చేయబడిన దిగువ వివరించిన స్థిరాస్తులు **క్రేజీబీ సర్వీసెస్ లిమిటెడ్.,** (ఇక మీదట సెక్యూర్డ్ క్రెడిటార్ గా రెఫర్ చేయబడును) రిజిస్టర్డ్ కార్యాలయము - 3వ అంతస్తు, నం. 128/9, మారుతి సఫైర్, హెచ్ఎఎల్ ఓల్డ్ ఎయిర్ పోర్ట్ రోడ్, మురుగేష్‌పాల్యా, బెంగళూరు, కర్ణాటక-560017. మరియు బ్రాంచ్ ఆఫీస్ - **క్రేజీబీ సర్వీసెస్ లిమిటెడ్.,** వైట్‌హౌస్ బిల్డింగ్, 2వ బ్లాక్, 5వ అంతస్తు, నం. 505, 507, బేగంపేట్, హైదరాబాద్-500016 వారిచే స్వాధీనము చేసుకోబడినది. రుణగ్రహీతలు, సహరుణగ్రహీతలు మరియు హామీదారుల నుండి సెక్యూర్డ్ క్రెడిటార్‌కు రావలసిన బకాయి మొత్తం వసూలు చేసుకొనుటకు దిగువ తెలిపిన తేదీలలో **'ఎక్కడ ఎలా ఉందో" మరియు "ఏది ఎలా ఉందో" "అది అలానే" "అక్కడ ఏమున్నదో అదే" మరియు రికోర్స్ లేని ప్రాతిపదికన సదరు ఆస్తి అమ్మబడును. దిగువ తెలిపిన ప్రదేశంలో అధీకృత అధికారిచే అమ్మకం నిర్వహించబడును.**

| రుణఖాతా నం, మరియు రుణగ్రహీతలు, సహ రుణ గ్రహీతలు, హామీదారుల పేరు | సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు తేదీ మరియు మొత్తం | స్వాధీనత తేదీ, రకం, మరియు రావలసిన మొత్తం |
|---|---|---|
| BL241128KBGXC 1. మట్ట మధు, 2. మట్ట మాధవి, పైన 1 & 2ల నివాసం- 12-1/170/ఏపి/187, ప్లాట్ నం. 187, ఆప్కో కాలనీ, నాగోల్ హయత్ నగర్, కె.వి. రంగారెడ్డి, మేడ్చల్- మల్కాజ్‌గిరి తెలంగాణ-500068. | 23.01.2026 18.12.2025 నాటికి రూ. 95,62,967/- (రూపాయలు తొంభై ఐదు లక్షల అరవై రెండు వేల తొమ్మిది వందల అరవై ఏడు మాత్రమే) ----- బిడ్ పెంపుదల మొత్తం రూ. 50,000/- గుణిజాలలో (యాభై వేల రూపాయలు గుణిజాలలో) | 17.04.2026 భౌతిక స్వాధీనత; 18.12.2025 నాటికి రూ.95,62,967/- (రూపాయలు తొంభై ఐదు లక్షల అరవై రెండు వేల తొమ్మిది వందల అరవై ఏడు మాత్రమే) |
| రిజర్వు ధర రూ. 97,68,195/-, బయానా (ఇఎండి) 10% రిజర్వు ధరలో / ఇఎండి డిపాజిట్ చివరి తేది 18.08.2026 | | |
| ఆస్తి తనిఖీ తేది మరియు సమయం 10.08.2026 / వేలం తేది మరియు సమయం 19.08.2026 ఉ.10 గం.ల నుండి సా. 5 గం.ల వరకు. | | |
| స్థిరాస్తి / సెక్యూర్డ్ ఆస్తి వివరణ ఎల్‌బినగర్, ఎస్ఆర్‌ఓ రిజిస్ట్రేషన్ పరిధిలో బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ క్రింద రంగారెడ్డి జిల్లా, బాలాపూర్ రెవెన్యూ మండలం అల్మాస్‌గూడ గ్రామం వద్దగల సర్వే నం. 118, 119 లో ఆర్‌సిసి రూఫ్ తో గ్రౌండ్ ఫ్లోర్ లో 1141.74 చ.అ.లు., మొదటి అంతస్తులో 1141.74 చఅ.లు. ప్లింత్ ఏరియా మొత్తం ప్లింత్ ఏరియా 2283.48 చ.అ.లు. కలిగి యుండి, 200 చ.గ.లు లేదా 167.23 చ.మీ.ల.కు సమానమైన విస్తీర్ణం, ప్లాట్ నం. 238 దక్షిణ భాగముపై నిర్మించిన సగం పూర్తయిన నివాస గృహము యావత్తు. **సరిహద్దులు: ఉత్తరం:** ప్లాట్ నం. 238 ఉత్తర భాగము, **దక్షిణం:** ప్లాట్ నం.లు 239 & 232 **తూర్పు:** ప్లాట్ నం. 233, **పడమర:** రోడ్డు. (25') | | |
| తదుపరి వివరాల కోసం సంప్రదించండి శ్రీనుబాబు మొబైల్ నం. 9100163325, మంజునాథ్ మొబైల్ నం. 9980219262. | | |
| వేలం/బిడ్డింగ్: https://www.foreclosureindia.com or https://www.Bankauction.in. ద్వారా ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ బిడ్డింగ్ ద్వారా మాత్రమే నిర్వహించబడుతుంది. బిడ్డర్లు ఇ-వేలం అమ్మకం ప్రొసీడింగ్స్‌లో పాల్గొనే ముందు వివరమైన నియమనిబంధనల కొరకు వెబ్‌సైట్ చూడవలెను. | | |
| చెల్లింపు విధానము : అన్ని చెల్లింపులను RTGS/ NEFT/ ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా క్రేజీబీ సర్వీసెస్ లిమిటెడ్., ఖాతా నం. 00228130003756, IFSC Code: YESB0000022, బ్యాంక్ పేరు యస్ బ్యాంక్ కస్తూరిబా రోడ్ బ్రాంచ్, బెంగుళూరు-560001. కు చెల్లించవలెను. | | |

తేది: 23.07.2026, ప్రదేశం: హైదరాబాద్
సం/- అధీకృత అధికారి, క్రేజీబీ సర్వీసెస్ లిమిటెడ్


# ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు కేంద్రం కుట్ర

**నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలి**
**మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ నీలం మధు**




**పటాన్చెరు, జూలై 23 (నినాదం):** దేశంలో ప్రజాస్వామ్యాన్ని పూడ్చిపెట్టి, ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్ర కుట్రలు చేస్తోందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ నీలం మధు ముదిరాజ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజల తరఫున నిలబడి కేంద్రాన్ని నిలదీస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రజాదరణను చూసి కేంద్ర ప్రభుత్వం భయపడుతోందని, అందులో భాగంగానే ఆయనతో పాటు ప్రతిపక్ష నేతలను అక్రమంగా అరెస్ట్ చేయిస్తోందని మండిపడ్డారు. రాహుల్ గాంధీ తో పాటు ప్రతిపక్ష నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ, నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో ఏఐసీసీ పిలుపు మేరకు, టీపీసీసీ అధ్యక్షులు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన 'చలో లోక్ భవన్' నిరసన కార్యక్రమంలో నీలం మధు ముదిరాజ్ పాల్గొని మాట్లాడారు. నెక్లెస్ రోడ్‌లోని ఇందిరమ్మ విగ్రహం వద్దకు వేలాదిగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు యువతతో కలిసి ఆయన రాజ్ భవన్ వైపు భారీ ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ.. రాత్రింబవళ్లు కష్టపడి చదివిన లక్షలాది మంది నిరుపేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తుతో బీజేపీ ప్రభుత్వం దారుణంగా చెలగాటమాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా నీట్ పేపర్ లీకేజీ కుంభకోణంతో విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టారని విమర్శించారు. ఈ దారుణమైన వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కక్షసాధింపు చర్యలతో ప్రతిపక్ష నాయకులను జైలుకు పంపినంత మాత్రాన కాంగ్రెస్ పోరాటాలను ఆపలేరని స్పష్టం చేశారు. విద్యార్థుల, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్న బీజేపీ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో దేశ ప్రజలు, యువత తగిన బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, వీర్లపల్లి శంకర్, అంబర్ పేట్ ఇంచార్జీ డాక్టర్ సి రోహిన్ రెడ్డి, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్, డీసీసీ అధ్యక్షులు మోత రోహిత్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ , ఎన్ఎస్ యుఐ శ్రేణులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు భారీగా పాల్గొన్నారు.

# కోదాడలో మాంగళ్య షాపింగ్ మాల్ 33వ శాఖ ప్రారంభం

- సినీ హీరోయిన్ ఆషికా రంగనాథ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- హైదరాబాద్‌కు దీటుగా కోదాడలో ఆధునిక ఫ్యామిలీ షాపింగ్ గమ్యం




**కోదాడ, జూలై 22 (నినాదం):** 2012లో తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్‌లో ప్రారంభమైన మాంగళ్య షాపింగ్ మాల్, వస్త్ర వ్యాపార రంగంలో నూతన ఒరవడిని సృష్టిస్తూ వేగంగా విస్తరిస్తోంది. నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందిస్తూ ప్రజల ఆదరణను పొందిన మాంగళ్య, ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో తన ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. ఈ క్రమంలో కోదాడలో తన 33వ శాఖను బుధవారం ఘనంగా ప్రారంభించింది. ఈ ప్రారంభోత్సవానికి ప్రముఖ సినీ హీరోయిన్ ఆషికా రంగనాథ్ ముఖ్య అతిథిగా హాజరై దీపప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేసి మాల్‌ను ప్రారంభించారు. అనంతరం మాల్‌లోని వివిధ విభాగాలను సందర్శించి అభిమానులతో మమేకమయ్యారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో అభిమానులు తరలిరావడంతో మాల్ ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా ఆషికా రంగనాథ్ మాట్లాడుతూ, "కోదాడ ప్రజలు మాంగళ్య షాపింగ్ మాల్‌కు మంచి ఆదరణ అందిస్తారని నమ్ముతున్నాను. వారి ఆశీర్వాదాలతో ఈ మాల్ మరింత విజయవంతమవుతుంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి ఉత్తమ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మాంగళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు కాసం నమశివాయ, కాసం మల్లికార్జున, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రతి వర్గానికి, ప్రతి సందర్భానికి అనువైన నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో అందించడమే తమ విజయ రహస్యమని తెలిపారు. తమ స్వంత హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఆధునిక మార్కెట్ ధోరణులకు అనుగుణంగా రూపొందిస్తూ వస్త్ర వ్యాపారంలో ముందంజలో కొనసాగుతున్నామని పేర్కొన్నారు. మాంగళ్య షాపింగ్ మాల్‌లో మహిళలు, పురుషులు, యువత, చిన్నారుల కోసం తాజా ఫ్యాషన్ కలెక్షన్లతో పాటు వివాహాలు, శుభకార్యాలకు ప్రత్యేక వెడ్డింగ్ కలెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. ఈ మాల్ ప్రారంభంతో కోదాడ ప్రజలు పెళ్లి షాపింగ్ కోసం ఇతర పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, తమ ప్రాంతంలోనే నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు కొనుగోలు చేసే అవకాశం కలిగిందని తెలిపారు. రూ. 99 నుంచి రూ. 1 లక్ష వరకు ధరల శ్రేణిలో వస్త్రాలు అందుబాటులో ఉండటంతో పాటు, మాంగళ్య పూర్తి స్థాయి ఫ్యామిలీ షాపింగ్ మాల్‌గా ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో విజయవంతంగా కొనసాగుతున్న మాంగళ్య షాపింగ్ మాల్, త్వరలోనే ఈ మూడు రాష్ట్రాల్లో మరో 10 కొత్త శాఖలను ప్రారంభించనున్నట్లు, భవిష్యత్తులో తమిళనాడుకు కూడా విస్తరించనున్నట్లు డైరెక్టర్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా వినియోగదారుల విశ్వాసాన్ని సంపాదించిన మాంగళ్య షాపింగ్ మాల్ పాన్ ఇండియా స్థాయిలో అగ్రగామి సంస్థగా ఎదుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కోదాడ ప్రజలు తమ కుటుంబ సభ్యులతో కలిసి మాల్‌ను సందర్శించి నూతన షాపింగ్ అనుభూతిని పొందాలని డైరెక్టర్లు కోరారు.

# ఓటు హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి పునాది

- మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్, జూలై 22 (నినాదం):** కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ అధ్యక్షతన బుధవారం షాపూర్ నగర్‌లోని వారి నివాసంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులకు 'సర్ ఓట్ మ్యాపింగ్' కార్యక్రమానికి సంబంధించిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'సర్ ఓట్ మ్యాపింగ్'



కార్యక్రమం లక్ష్యాలు, అమలు విధానం, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, బూత్ స్థాయి కార్యకలాపాలపై నాయకులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతి కార్యకర్త ప్రజలకు చేరువై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. బిఎల్వోలతో సమన్వయ పరుచుకుంటూ నూతన ఓట్లను నమోదు చేయుటతో పాటు నకిలీ ఓట్ల తొలగింపునకు కార్యకర్తలు నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda
**భగత్‌నగర్ బ్రాంచ్**
నీరజ కాంప్లెక్స్, 8 3 743, అంబేద్కర్ స్టేడియం రోడ్, Lic ఆఫీస్ వెనుక, ముకరంపుర, కరీంనగర్, తెలంగాణ 505001

**వాహన ఇ-వేలము సంక్షిప్త ప్రకటన**
దిగువ తెలియజేయబడిన రుణగ్రహీతల వైఫల్యము కారణముగా పార్టీలచే అమలు చేయబడిన కుదువ ఒప్పందం క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ, దిగువ తెలియజేసిన కుదువపెట్టబడిన మోటార్ వాహనమును బ్యాంక్ వారు తిరిగి పొందడమైనది/ జప్తు చేయడమైనది మరియు వాటిని **"ఏది ఎక్కడ ఏలా ఉన్నది అది అక్కడ అలా మరియు ఏది ఎలా ఉన్నది అది అలా"** ప్రాతిపదికన వేలము వేయబడును.
**రుణగ్రహీత పేరు & చిరునామా: శ్రీ మ్యాదరం వేణుమాధవ చారి తండ్రి కిషన్,** ఇం.నెం.6-1-27, అశోక్ నగర్, కరీంనగర్, 505001. **మొత్తం బకాయిలు తేది.05.07.2026 నాటికి ఒప్పంద బకాయిలు రూ.5,95,055/- (రూపాయలు ఐదు లక్షల తొంభై ఐదు వేల యాభై ఐదు మాత్రమే)** దానిపై ఒప్పంద రేటు వంతున తదుపరి వడ్డీ + లీగల్ వ్యయములు (వసూలైన మొత్తం ఉంటే అది తీసివేసి)

| క్ర.సం. | వాహనము వివరణ | రిజర్వు ధర | బయానా |
|---|---|---|---|
| 1 | Four-Wheeler – Four-Wheeler Vehicle M/S RENAULT INDIA PRIVATE LIMITED TRIBER RXZ PETROL MT 1.0L ECE BSVI Color: METAL MUSTARD BODY WITH MYSTERY BLACK ROOF Engine No:B4DA417E163060 Chassis No: MEERBC007N6138609 Registration No: TS02FH4020, Mfg. 06-06-2022 | Rs. 4,50,000/- | Rs. 45,000/- |
| | | కనీస బిడ్డు పెంపుదల మొత్తం రూ.5,000/- (రూపాయలు ఐదు వేలు మాత్రమే) | |


ఖాతా పేరు : SARFAESI వేలం ప్రక్రియ ఖాతా నెం.75730015181869, IFSC Code: BARB0VJKMNG (Fifth letter ZERO), బ్యాంక్ మరియు బ్రాంచ్ పేరు: బ్యాంక్ ఆఫ్ బరోడా, భగత్‌నగర్.
ఆన్‌లైన్ విధానము ద్వారా వాహనము వేలం https://www.baanknet.com/ఇ-వేలం తేది/రోజు/సమయం: 28.08.2026 ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 5.00 గం॥ల వరకు (అమ్మకం పూర్తి అయ్యేంత వరకు ప్రతి 5 నిమిషముల ఆటో పొడిగింపుతో) బిడ్డు దాఖలుకు ఆఖరి తేది: 28.08.2026 న సా. 5.00 గం॥ల లోగా. కాగోరు కొనుగోలుదారు/బిడ్డర్లు వాహనాన్ని తేది: 27.08.2026 న లేదా ఆలోగా ఉ.10.00 గం॥ల నుండి సా.5.00 గం॥ల వరకు (శ్రీరామ్ ఆటో మాల్, అలుగునూర్ గ్రామం, కరీంనగర్) వద్ద తనిఖీ చేసుకోవచ్చును. MOB బ్రాంచ్ నెం. 8367788547.

| ఇ-వేలం తేదీ : 28/08/2026 | బ్యాంక్‌నెట్ ప్రాపర్టీ ఐడి : BARBVENUMADHAVA | వేలం ఐడి : 330473 |
|---|---|---|

**ఇ-వేలము అమ్మకము యొక్క నియమ నిబంధనలు**
1. ఎటువంటి ముందస్తు కారణము తెలుపకుండా అందిన అన్ని లేదా కొన్ని ఆఫర్(లు) లేదా బిడ్(లు)లను స్వీకరించవచ్చు లేదా నిరాకరించుటకు బ్యాంక్ ఆఫ్ బరోడా వారికి పూర్తి హక్కులు కలవు. 2. ఎటువంటి కారణము తెలుపకుండా ఇ-వేలమును స్వీకరించుట/నిరాకరించుట/వాయిదా/రద్దు చేయుటకు బ్యాంక్ ఆఫ్ బరోడా వారికి పూర్తి హక్కులు కలవు. 3. అధీకృత అధికారి పరిజ్ఞానం మరియు తెలిసిన సమాచారం మేరకు వాహనముపై ఎటువంటి తాకట్టు రుణ భారములు లేవు అయినప్పటికీ ఔత్సాహిక బిడ్డర్లు వాహనముపై తాకట్టు రుణ భారములు, టైటిల్ సంబంధించి వారంతట వారే క్షుణ్ణంగా విచారించుకొని & తనిఖీ చేసుకొని & తృప్తి చెందవలెను (వివరణాత్మక నియమ నిబంధనల కొరకు **https://baanknet.com** కు రిఫర్ చేయవలెను). 4. **పార్కింగ్ :** డెలివరీ అయ్యేంత వరకు వేలం తేదీనుండి అన్ని యార్డ్/ పార్కింగ్ ఛార్జీలను కొనుగోలుదారు భరించవలెను. 5. **రిజిస్ట్రేషన్ :** తాజా ఆర్టీవో రిజిస్ట్రేషన్ మరియు బదిలీ ఛార్జీల కొరకు కొనుగోలుదారు అన్ని ఖర్చులను భరించవలెను.
అమ్మకం యొక్క సవివరణమైన నియమ నిబంధనల కొరకు వెబ్‌సైట్ లింక్ **https://www.baanknet.com** ను రిఫర్ / దర్శించగలరు. ఔత్సాహిక బిడ్డర్లు **8367788547** ను సంప్రదించగలరు.
తేది : 22.07.2026, ప్రదేశం : కరీంనగర్
సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా


# ఎస్ఐఆర్ పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలు చొరవ తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి విజ్ఞప్తి**




**వనపర్తి ప్రతినిధి, జూలై 22 (నినాదం):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలు తమ బూత్ లెవల్ ఏజెంట్లు ఎన్నికల అధికారులతో సమన్వయంతో పని చేసేలా చొరవ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి విజ్ఞప్తి చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో ఎస్ఐఆర్ పురోగతిపై జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు ఎస్ఐఆర్ ప్రక్రియ డిజిటైజేషన్ 77.49% పూర్తయిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో చురుగ్గానే కొనసాగుతున్నప్పటికీ, వనపర్తి, పెబ్బేరు వంటి పట్టణ ప్రాంతాల్లో కొంత నెమ్మదిగా కొనసాగుతోందని చెప్పారు. కాబట్టి పట్టణ ప్రాంతాల్లో ఆయా రాజకీయ పార్టీల బీఎల్ఏలు స్థానికంగా పని చేస్తున్న బూత్ లెవల్ అధికారులతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని కోరారు. బిఎల్ఓలతో సహకరిస్తూ ఓటర్లందరూ తమ ఎన్యుమరేషన్ ఫారంలను సమర్పించే విధంగా బిఎల్ఏ లు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియకు కూడా ఇదే సరైన సమయమని, ఇందుకు సంబంధించి రాజకీయ పార్టీలు ఏవైనా సూచనలు చేయదలుచుకుంటే అధికారులకు తెలియజేయాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పనిచేయని అధికారులు తప్పుకోండి

## హెచ్చరించిన కలెక్టర్ ప్రియాంక

**సెప్టెంబర్ నెలాఖరు నాటికి భూ సేకరణ పూర్తి చేయాలి.. సాకులు చెప్పకుండా లక్షసాధనతో పని చేయాలి**



**నారాయణపేట ప్రతినిధి, జులై 22, (నినాదం)**

మక్తల్–నారాయణపేట–కొడంగల్ఎ త్తిపోతల పథకం లో భాగంగా చేపడుతున్న భూ సేకరణ ప్రక్రియ ను సెప్టెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో ఎం ఎస్ కే ఎల్ భూసేకరణపై రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను తో కలిసి రెవెన్యూ అధికారు లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..భూ సేకరణ ప్రక్రియ కు సంబంధించి రెవెన్యూ అదనపు కలెక్టర్, ఆర్డీవో, ప్రత్యేక అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరగా పరిష్క రించాలన్నారు. కాన్సెంట్ లు తీసుకుని అవార్డులు త్వరగా పూర్తి చేయాలన్నారు. సెప్టెంబర్ 30 లోపు భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసు కోవాలని ఆమె స్పష్టం చేశారు. సాకులు చెప్పకుండా లక్ష్యాల ప్రకారం పని చేయాలన్నారు. అవసరమైతే ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని,లక్ష్మీపూర్ ట్యాంక్ ప్రాంతానికి సంబంధిం చిన పనులను ప్రాధాన్యంగా పూర్తి చేయాలని సూచించారు. ఆర్. ఐ లు తమ తమ పరిధిలో పట్టాల పరిశీలన చేసి,నాలుగు రోజుల్లో సర్వే పూర్తి చేయా లన్నారు.నాలుగు సర్వే టీంలను ఏర్పాటు చేయాలన్నారు. స్పీడ్ పెంచి టేబుల్ వర్క్ పూర్తి చేస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రతిరోజూ ఆయా మండలాల పరిధిలోని నిర్దేశించిన గ్రామాలలో ఎన్ని ఎకరాలు సేకరణ పూర్తి అయిందనే ప్రోగ్రెస్‌ను తానే ఫాలోఅప్ చేస్తానని కలెక్టర్ వెల్లడించారు. పని చేయలేని వారు తప్పుకోవాలని సున్నితంగా హెచ్చరించారు. దామర గిద్ద మండలంలోని గడప, వితలాపూర్, అన్నాసాగర్ తదితర గ్రామాల పనులను వేగవంతం చేయాలన్నారు. పీ ఎన్ సూచనల ప్రకారం ప్రతిరోజూ ప్రోగ్రెస్‌ను సమీక్షి స్తామని తెలిపారు. గుండు మల్, కోస్గి మండలాలలో భూ సేకరణ ప్రక్రియ వేగిరం చేయాలని ఆయా మండలాల తహసిల్దార్ల ను ఆదేశించారు. మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల పథకానికి జిల్లాలోని ఆయా గ్రామాల్లో సేకరించాల్సిన భూ సేకరణ ను సెప్టెంబర్ నెలాఖరు లోపు పూర్తి చేయాలని ఆమె పునరుద్ఘాటించారు. ఈ సమీక్షలో డీ ఆర్ వో రాజ్యలక్ష్మి, ఆర్ డి ఓ రమేష్, ఎస్. డీ.సీ. రాజేందర్ గౌడ్, ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

# శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు



**గద్వాల బ్యూరో జూలై 22 (నినాదం )**

విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాల పైనే ఆధారపడకుండా స్వయం ఉపాధి పొందేందుకు వివిధ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే పలు శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయని, సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. బుధవారం గద్వాలలోని ప్రభుత్వ ఎంఏఎల్డి డిగ్రీ కళాశాలలో ఆర్ సెటీ (రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్) ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకంపై విద్యార్థులకు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని యువత ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. పుట్టగొడుగుల పెంపకం తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని అందించే ఉపాధి మార్గమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ షేక్ కలందర్, ఎల్‌డీఎం శ్రీనివాస రావు, డైరెక్టర్ శ్రీనివాస్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



# మిల్లర్లు సిఎంఆర్ వడ్ల బకాయిలు చెల్లించాలి

## అదనపు కలెక్టర్ మధుమోహన్

**గద్వాల బ్యూరో జూలై 22( నినాదం )**

జిల్లాలోని రైస్ మిల్లర్లు 2022-23 రబీ సీజన్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి సేకరించిన వడ్లకు సంబంధించిన బకాయిలను చెల్లించాల్సి ఉందని అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారు. బుధవారం ఐడిఓసిలోని తన ఛాంబర్ లో అదనపు కలెక్టర్ రైస్ మిల్లర్లతో సమావేశమై మాట్లాడారు. మూడేళ్ల కిందట 36,814.800 మెట్రిక్ టన్నుల వడ్లను రైతుల నుంచి సేకరించి జిల్లాకు చెందిన 33 మంది మిల్లర్లకు అప్పగించడం జరిగిందన్నారు. ఇందులో ఒక మిల్లర్ మాత్రమే పూర్తిగా ధాన్యానికి సంబంధించిన పూర్తి డబ్బులు చెల్లించారని, మిగతావారు పూర్తిస్థాయిలో ఇవ్వలేదన్నారు. ఆ సీజన్ లో రైతుల నుంచి సేకరించిన వరి ధాన్యం చాలా వరకు నాణ్యత బాగోలేదనే విమర్శలు రావడంతో ప్రభుత్వం కొంతకాలానికి వేలంపాట ద్వారా అమ్మేందుకు నిర్ణయించిందన్నారు. వేలంపాటలో హక్కులు దక్కించుకున్న వ్యక్తి కొంత ధాన్యం మాత్రమే తీసుకోవడంతో మిగిలిన ధాన్యముకు సంబంధించిన బకాయిలను మిల్లర్లు ప్రభుత్వానికి చెల్లించాలని ఆదేశాలు ఇవ్వగా చాలామంది మిల్లర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించారన్నారు. ప్రభుత్వం క్వింటాల్ కు రూ.2236 చొప్పున వడ్ల డబ్బులు చెల్లించాలని ఆదేశించగా, మిల్లర్లు రూ.1830 మాత్రమే చెల్లిస్తామనడం సరికాదన్నారు. మిల్లర్ల వద్ద ఉన్న ధాన్యానికి సంబంధించిన బకాయిలను చెల్లించాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి స్వామి కుమార్, మేనేజర్ విమల, ఎన్ ఫోర్స్ మెంట్ డిటి ప్రశాంత్, రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రామలింగేశ్వర కామ్లే, తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీపై పోలీసు చర్య ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం

## వైరాలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో నిరసన







**వైరా, జూలై 22 (నినాదం):**

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, ఆ హక్కును వినియోగిస్తున్న ప్రతిపక్ష నాయకులపై బల ప్రయోగం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై ఢిల్లీలో జరిగిన పోలీసు చర్యను నిరసిస్తూ వైరా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేసి రాస్తారోకో చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్మించే విద్యార్థుల సమస్యలు, పరీక్షల పారదర్శకత, నిరుద్యోగ యువత ఆవేదన వంటి కీలక అంశాలపై సమాధానం కోరడం ప్రతిపక్ష బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల తరపున ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీపై పోలీసు చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆందోళన కలిగించే పరిణామమని అన్నారు.దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ వంటి నాయకులు ప్రజల సంక్షేమాన్ని పరమ లక్ష్యంగా పెట్టుకుని పనిచేశారని గుర్తుచేశారు. అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ యువత,విద్యార్థులు, రైతులు, కార్మికుల సమస్యలను రాహుల్ గాంధీ ప్రస్తావిస్తున్నారని, అలాంటి నాయకుడిపై దాడి జరగడం ప్రజాస్వామ్యానికి, పార్లమెంటరీ వ్యవస్థకు, విభిన్న అభిప్రాయాల గౌరవానికి భంగం కలిగించే చర్యగా అభివర్ణించారు.విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న లోపాలపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో, త్యాగాలతో విద్యను అభ్యసిస్తుంటే, వ్యవస్థలో ఏర్పడుతున్న లోపాలు వారి ఆశయాలను దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై సమాధానం కోరిన వారిపై కేసులు,అరెస్టులు, అణచివేత చర్యలు చేపట్టడం సమస్యలకు పరిష్కారం కాదని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్యంలో అధికార పక్షం విమర్శలను స్వీకరించి సమాధానం చెప్పాల్సిన బాధ్యత కలిగి ఉంటుందని, కానీ ప్రస్తుతం ప్రశ్నించే స్వరాలను అణగదొక్కడానికి ప్రయత్నించడం దురదృష్టకరమని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. ప్రజల సమస్యలను ప్రస్తావించే ప్రతిపక్ష నాయకులపై చర్యలు తీసుకోవడం కంటే, ఆ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు.దేశ యువత, విద్యార్థుల భవిష్యత్తు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని, ప్రజల తరఫున ప్రశ్నించే హక్కును ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోబోదని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ స్పష్టం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, విద్యార్థి నాయకులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రాహుల్ గాంధీపై జరిగిన పోలీసు చర్యను ఖండించారు.



# పంతంగి నివాసంలో తేనేటి విందుకు హాజరైన మంత్రి తుమ్మల

**ఖమ్మం, జులై 22(నినాదం ):**

ఖమ్మం నగర పరిధిలోని 5 డివిజన్లో ఉన్న జిల్లా కాంగ్రెస్ నాయకుడు పంతంగి వెంకటేశ్వర్లు ఇచ్చిన తేనేటివిందుకు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. బుధవారం డివిజన్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డివిజన్ లో ఉన్న నాయకులందరూ కలిసి కట్టుగా ఉండి వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ దుర్గాప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, ఖమ్మం కార్పొరేషన్ మాజీ చైర్మన్ నీరజ, నాయకులు ఏలూరు శ్రీనివాసరావు, పల్లెబోయిన చంద్రం, కూరపాటి మంజుల, గుత్తా వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ కమిషనర్ కి బీజేపీ కౌన్సిలర్ల డిసెంట్ నోట్

కామారెడ్డిప్రతినిధి, జూలై22 (నినాదం) కామారెడ్డి పట్టణంలోని 49 వార్డులలో నెలకొన్న సమస్యలు పరిష్కారం చేయాలని, గురువారం నిర్వహించబోయే మున్సిపల్ సర్వసభ్య సమావేశం ఎజెండాలోని అంశాలు ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసేలా ఉన్నాయని వాటిపై అభ్యంతరం తెలియజేస్తూ...బుధవారం మున్సిపల్ కమిషనర్ కి బీజేపీ కౌన్సిలర్ లు డిసెంట్ నోట్ (అభ్యంతర పత్రం) అందజేయటం జరిగింది.





# ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్న మోదీ ప్రభుత్వం

## ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు, కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్

**కామారెడ్డి రూరల్,జూలై 22 (నినాదం)**

ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన సమయం వచ్చిందని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. కామారెడ్డి ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన సమయం వచ్చిందని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు.నీట్ పరీక్షల వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధాని నివాసం ముందు ధర్నా చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని అరెస్ట్ చేసిన చర్యను ఖండిస్తూ బుధవారం కామారెడ్డి పట్టణంలోని గంజ్ మార్కెట్ యార్డులోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

**గుండాలకు పోలీస్ యూనిఫామ్ వేయించి..**

అంతకుముందు పట్టణంలోని రైల్వే కమాన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా లక్ష్మీకాంత్ రావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా గుండాలకు పోలీస్ యూనిఫామ్ వేయించి రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం అన్యాయమని విమర్శించారు.ప్రతిపక్ష నాయకుడికి ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వలేని ఈ ప్రభుత్వం ఈ ప్రజాస్వామ్య దేశంలో కొనసాగడానికి వీల్లేదని,ఈ విషయాన్ని ప్రతి పౌరుడు గమనించాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పాత్ర ఘనీయమైనదని,కానీ మోదీ ప్రభుత్వం లీకుల ప్రభుత్వంలా మారిందని ఆరోపించారు.నీట్ పరీక్ష పత్రాల లీక్‌తో విద్యార్థులు ఆందోళనకు గురై తమ బాధను ప్రజాస్వామిక పద్ధతిలో నిరసన రూపంలో తెలియజేసినా దానిని సరిగా అర్థం చేసుకోకుండా టియర్ గ్యాస్ ప్రయోగించడం,లాఠీచార్జి చేయడం సరికాదన్నారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి,మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి,పట్టణ అధ్యక్షుడు సందీప్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసిన జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్



**కల్వకుర్తి జులై 22 (నినాదం)**

వెల్దండ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బొల్లంపల్లి, వెల్దండ బాలురు జిల్ల పరిషత్ బాలికల మరియు మండల పరిధిలోని బండోనిపల్లి పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీచేశారు. పాఠశాలలకు చేరుకున్న వెంటనే విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, తరగతుల నిర్వహణ, బోధన విధానం, విద్యార్థుల అభ్యాస స్థాయి, పాఠశాల నిర్వహణ వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారు చదువుతున్న పాఠాలు, పుస్తకాల వినియోగం, ఉపాధ్యాయుల బోధన, ప్రతిరోజూ తరగతులు సక్రమంగా జరుగుతున్నాయా అనే విషయాలను కూడా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించి ఎలాంటి వివిధ అంశాలపై ప్రశ్నించారు. విద్యార్థుల హాజరు శాతం, ప్రతిరోజూ నిర్వహిస్తున్న తరగతులు, సబ్జెక్టుల బోధన, విద్యార్థుల అభ్యాస స్థాయి, మధ్యాహ్న భోజన పథకం అమలు, నిర్వహణ, పాఠశాల నిర్వహణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి విద్యార్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఎన్రోల్మెంట్ పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలనీ ఎన్రోల్మెంట్ పెరగకపోవడానికి గల కారణాలు ఏమిటి అని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఎన్రోల్మెంట్ పెంచేందుకు ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించాలని చేయాలనీ అదేశించారు. ఈ కార్యక్రమంలో, మండల విద్యాధికారి చంద్రుడు ప్రధానోపాధ్యాయులు రవీందర్, సుగుణ మరియు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రైతులు ఆరుతడి పంటల సాగుకు మొగ్గు చూపాలి

**బోధన్ ప్రతినిధి, జులై 22:(నినాదం )**



వర్షా భావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని బోధన్ ఏ డి ఏ శ్రీనివాసరావు అన్నారు. బోధన్ పట్టణంలోని రైతు వేదికలో ఆరుతడి పంటలు, ఉద్యానవన పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ ని నో కారణంగా ప్రస్తుతం ఎదురవుతున్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వరికి ప్రత్యామ్నయంగా తక్కువ నీటితో, తక్కువ కాలంలో పండే ఆరుతడి పంటలైన కంది, జొన్న, పెసర, మినుము, ఇతర ఉద్యాన పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో సంతోష్ ఉద్యానవన శాఖ అధికారి వహీద్ జుమ్మా, హెచ్ఈఓ అస్సర్, ఏఈఓ లు, రైతులు పాల్గొన్నారు.

# జాతీయ పతాకం దేశ ఐక్యతకు ప్రతీక: ప్రొ. అపర్ణ

**భిక్కనూర్, జూలై 22 (నినాదం)**



తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్–I ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆమోద దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొ. అపర్ణ మాట్లాడుతూ జాతీయ పతాకం దేశ ఐక్యత, సమగ్రతకు ప్రతీక అని అన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి భావనను పెంపొందించడం, జాతీయ జెండాపై గౌరవాన్ని పెంచడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అనంతరం విద్యార్థులతో జాతీయ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. రాంబాబు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలే భవిష్యత్‌కు భరోసా..

**రైతులకు మంత్రి తుమ్మల పిలుపు... త్రాగునీటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ**

**రాజీవ్ కాలువ ద్వారా గోదావరి జలాలను ఖమ్మం వైపు మళ్లించే వినూత్న ప్రయోగం.. రూ.1.75 కోట్లతో సీసీ రోడ్లు, కాలువల పనులకు శంకుస్థాపన**

**ఖమ్మం ప్రతినిధి , జులై 22 (నినాదం )**





ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న నీటి కొరత పరిస్థితుల దృష్ట్యా రైతులు అధిక నీటి అవసరమున్న వరి, మిర్చి పంటలకు బదులుగా ఆయిల్‌పామ్, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మళ్లాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. త్రాగునీటిని సంరక్షించడమే ప్రస్తుతం అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి వి. వెంకటాయపాలెం డీప్‌కట్ వద్ద గోదావరి జలాల పరిస్థితిని పరిశీలించిన మంత్రి, అనంతరం ఇంజినీర్లు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత నీటి లభ్యత, త్రాగునీటి పరిరక్షణ, గోదావరి జలాలను రాజీవ్ కాలువ ద్వారా తిరిగి ఖమ్మం వైపు మళ్లించే ప్రయోగంపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు పరిమితంగా ఉన్నందున ప్రతి చుక్క నీటిని పొదుపుగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. ఏప్రిల్ నుంచే అధికారులు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ రైతులు వరి సాగుపైనే మొగ్గు చూపితే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరించారు. 1977 కరువు కంటే ప్రస్తుతం వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న సూపర్ ఎల్‌నినో ప్రభావం మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో భూగర్భ జలాలు మరింత తగ్గే ప్రమాదం ఉన్నందున త్రాగునీటి పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను అందించాలన్న లక్ష్యంతో గతంలో సీతారామ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించామని, ప్రస్తుతం ఆ ప్రాజెక్టు ద్వారా జిల్లాకు నీరు అందుతోందని తెలిపారు. వైరాకు తరలించిన గోదావరి జలాలను రాజీవ్ కాలువ షట్టర్లు మూసివేసి తిరిగి ఖమ్మం వైపు మళ్లించే వినూత్న ప్రయోగం కొనసాగుతోందని చెప్పారు. మంచుకొండ, ఇతర ఎత్తిపోతల వ్యవస్థల ద్వారా చెరువులు నింపి, మున్నేరులోకి నీటిని మళ్లించడం ద్వారా ఖమ్మం నగర త్రాగునీటి అవసరాలను తీర్చే ప్రయత్నాలు జరుగుతు న్నాయని వెల్లడించారు. సుమారు రూ.90 కోట్ల వ్యయంతో నిర్మించిన రాజీవ్ కాలువ ద్వారా రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఏర్పడిందని, ఈ ప్రాజెక్టు విజయవంతం కావడంలో కీలకపాత్ర పోషించిన ఇంజినీర్లను మంత్రి అభినందించారు. పశ్చిమాసియా యుద్ధాల ప్రభావంతో విద్యుత్, యూరియా సరఫరాపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్న మంత్రి, రైతులకు పారదర్శకంగా యూరియా అందించేందుకు ప్రభుత్వం యూరియా బుకింగ్ యాప్‌ను ప్రవేశపెట్టిందని తెలిపారు. రాజకీయ ప్రచారాలను నమ్మవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని అత్యంత పొదుపుగా వినియోగిస్తూ వచ్చే జూన్–2027 వరకు త్రాగునీటి అవసరాలు తీరేలా సమగ్ర కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు. గోదావరి జలాలను రాజీవ్ కాలువ ద్వారా తిరిగి ఖమ్మం వైపు మళ్లించి పాలేరు రిజర్వాయర్‌ను నింపే అవకాశాలను ఇంజినీర్లు పరిశీలిస్తున్నారని, ఈ ప్రక్రియను మంత్రి తుమ్మల స్వయంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. వర్షాలు కురవకపోతే వరి, మిర్చి వంటి అధిక నీటి అవసరమున్న పంటల సాగు కష్టసాధ్యమవు తుందని, రైతులు తప్పనిసరిగా ప్రత్యామ్నాయ పంటలనే ఎంచుకోవాలని కలెక్టర్ సూచించారు.అనంతరం ఖమ్మం నగరంలోని 3, 4, 5 డివిజన్లలో యూఐడీఎఫ్ నిధులతో రూ.1.75 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ కాలువల నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఇరిగేషన్ సీఈ శ్రీనివాసరెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, డీపీఓ రాంబాబు, వి. వెంకటాయ పాలెం సర్పంచ్ కాపా ఆది నారాయణ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మంగళగిరి కోసం బాబుతో గొడవ పడ్డా

**నిధులకు కొరత ఉన్నా, అభివృద్ధిలో వెనకడుగు లేదు**

**నియోజకవర్గంలో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీలో లోకేశ్**

**గుంటూరు,జులై22 ( నినాదం):** మంగళగిరి నియోజకవర్గంలో రెండో రోజు పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. 'మన ఇల్లు – మన లోకేశ్' పేరిట మంత్రి నారా లోకేశ్.. ఇళ్ల పట్టాల పంపిణీ చేపట్టారు. రెండు రోజుల్లో 3,000 మందికి పట్టాలను పంపిణీ చేయనున్నారు. కొండవాలు ప్రాంతాలు, అటవీ భూములు, దేవాలయ భూముల్లో ఇల్లు నిర్మించుకొని దశాబ్దాలుగా ప్రజలు నివసిస్తున్నారు. దీంతో అర్హులైన పేద కుటుంబాలకు మంత్రి బట్టలు పెట్టి.. పసుపు, కుంకుమలతో పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రానికి నిధుల కొరత ఉన్నా మంగళగిరిలో అభివృద్ధి ఆగట్లేదని తెలిపారు. మంగళగిరి అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబుతో కూడా గొడవ పెట్టుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రభుత్వ నిధులతో ఇబ్బంది ఉంటే సీఎస్సార్ నిధులు, వివిధ ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుని అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ఎక్కడా ఎలాంటి ఆరోపణలు లేకుండా పారదర్శకంగా ఇళ్లపట్టాల పంపిణీ చేపట్టామన్నారు. ఇచ్చిన హామీ మేరకు బొట్టు పెట్టి ఇళ్ల పట్టాలను అందజేస్తున్నట్లు చెప్పారు. దేశం మొత్తం నిడమర్రు పాఠశాల గురించి మాట్లాడుకోవడం గర్వంగా ఉందన్నారు. ఇంటి పట్టాలతో పాటు భూగర్భ డ్రైనేజీ, 100 పడకల ఆసుపత్రి, నీటి సమస్య.. ఇలా అన్నింటికీ రెండేళ్లలోనే పరిష్కారం చూపిస్తున్నామని తెలిపారు. మంగళగిరి ప్రజలు ఓడించారనే కసితో ఇంకా బాగా పనిచేశానని చెప్పుకొచ్చారు. ప్రతిపక్షంలో ఉండగా 29 సంక్షేమ పథకాలను సొంత నిధులతో అమలు చేసి.. అధికారం ఇస్తే ఇంకెలా చేస్తానో అనే భరోసా కల్పించానని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

# భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి రండి

**ప్రధాని మోడీని ఆహ్వానించిన సిఎం చంద్రబాబు**

**సుమారు 30 నిముషాల పాటు వివిధ అంశాలపై చర్చ**

**పలువురు కేంద్రమంత్రులతోనూ బాబు వరుస భేటీలు**

**గోదావరి, కావేరీ అనుసంధానంపై పాటిల్‌తో చర్చలు**



**న్యూఢిల్లీ, జులై 22 ( నినాదం):** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆగస్టు 1న భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధానిని ఆహ్వానించారు. ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి వచ్చేందుకు ప్రధాని మోదీ అంగీకరించినట్లు తెలుస్తోంది. సుమారు 30 నిమిషాలకు పైగా చంద్రబాబు, మోదీ ముఖాముఖీ భేటీ అయ్యారు. దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై ఇరువురి మధ్య సుదీర్ఘ చర్చలు జరిగినట్లు సమాచారం. ఈరోజు(బుధవారం) చంద్రబాబుతో పాటు కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాసవర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు కూడా ప్రధానిని కలిశారు. ప్రధానితో చంద్రబాబు భేటీ సందర్భంగా ఆసక్తికర సన్నివేశం జరిగింది. టీడీపీ ఎంపీ అప్పలనాయుడిని భోగాపురం విమానాశ్రయం ఉన్న స్థానిక ఎంపీ అంటూ ప్రధాని మోదీకి ఆత్మీయంగా పరిచయం చేశారు. అప్పలనాయుడు నాకు తెలుసు... ఆయన ప్రతిరోజూ సైకిల్‌పై పార్లమెంటుకు వస్తున్నారు' అంటూ ఎంపీని ప్రధాని అభినందించారు. చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో భేటీ అనంతరం పలువురు కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు నిర్వహించారు. ప్రధానితో భేటీ అనంతరం కేంద్ర మంత్రి పీయుష్ గోయల్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. సుమారు 50 నిమిషాలు పాటు జరిగిన సమావేశంలో ఏపీకి కొత్త పారిశ్రామిక ప్రాజెక్టులు, పొగాకు, ఆక్వా రైతుల సమస్యలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఆపై కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ఇందులో భాగంగా కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. గోదావరి – కావేరీ నదుల అనుసంధానంపై కీలక చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. గోదావరి – కావేరీ అనుసంధానంపై భాగస్వామ్య రాష్ట్రాల సీఎంలతో సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం విజ్ఞప్తి చేశారు. శ్రీశైలం నుంచి కావేరీ అనుసంధానం కన్నా బనకచర్ల నుంచి కావేరీ అనుసంధానం మంచిదని కేంద్ర జల్‌శక్తి శాఖ సూచించినట్లు తెలుస్తోంది. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని జల్‌శక్తి శాఖ.. అన్ని రాష్ట్రాలు భాగస్వామ్య పక్షాలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని చంద్రబాబు కోరారు. సముద్రంలోకి నీరు పోవడం కంటే.. ఉపయోగంలోకి వస్తే బాగుంటుందని కేంద్ర జల్‌శక్తి మంత్రికి సీఎం సూచించారు. అన్ని రాష్ట్రాలను ఒప్పిస్తే కేంద్ర ప్రతిపాదనతో తనకు అభ్యంతరం లేదని.. అందుకోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని చంద్రబాబు కోరగా.. ఇందుకు కేంద్ర జల్‌శక్తి శాఖ అంగీకరించినట్లు తెలుస్తోంది.


**BRANCH SHIFTING**

మా విలువైన కస్టమర్ల కోసం, మా T. SUNDUPALLI బ్రాంచ్ నూతన ప్రాంగణం లోనికి 23.10.2026 నుండి మార్చబడుతుంది. నూతన చిరునామా క్రింద ఇవ్వబడినది;

Muthoot Finance Ltd
Ground Floor, 2-754/4,
Near Register Office, Rayavaram Road,
T. Sundupalli, Kadapa District,
Andhra Pradesh State, Pin - 516130.
Phone No : 09188903967, 08138910030.
Email id : mgsun3532@muthootgroup.com

"ఏదైనా ఫిర్యాదు ఉంటే దయచేసి 0484 4804074 కు కాల్ చేయండి".

మీ నిరంతర చేయూత మరియు మద్దతును కోరుతున్నాము.

Muthoot Finance
A Muthoot M George Enterprise



Altum Credo Home Finance
**ఆల్టమ్ క్రెడో హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్**
రిజిస్టర్డ్ ఆఫీస్: అంతస్తు నెం. 7, కల్పతరు ఇన్క్విరియా, వాక్డేవాడి, శివాజీనగర్, పూణే - 411005. మహారాష్ట్ర (ఇండియా).

**అనుబంధం IV – స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)**

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ("SARFAESI యాక్ట్, 2002") క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ("ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్") లోని రూల్ 3తో చదవబడు చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ ఆల్టమ్ క్రెడో హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎసిహెచ్ఎఫ్ఎల్) వారి అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు జారీ చేసిన డిమాండ్ నోటీసుల ప్రకారము రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు)/హామీదారు (లు) (ఇకమీదట "రుణగ్రహీతలు"గా వ్యవహరించబడతారు) నోటీసులో తెలిపిన మొత్తమును సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించమని కోరుతూ డిమాండ్ నోటీసు(లు) జారీ చేసినారు. కానీ రుణగ్రహీతలు సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8తో చదవబడు విధంగా సదరు చట్టంలోని సెక్షన్ 13 ఉప సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారములను వినియోగించుకొనుచూ దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకముదారు లాంఛనప్రాయంగా స్వాధీనము చేసుకోవడమైనదని రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించే సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లోని ఉప సెక్షన్ (8)లోని నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలను కోరడమైనది. సదరు ఆస్తితో ఎటువంటి వ్యవహారములు జరుపరాదని మరియు ఆస్తితో జరిపే ఏవేని వ్యవహారములు దిగువ తెలిపిన మొత్తాన్ని మరియు దానిపై వడ్డీకి సంబంధించి ఎసిహెచ్ఎఫ్ఎల్ ఛార్జికి లోబడి ఉంటాయని ముఖ్యంగా రుణగ్రహీతలను మరియు సాధారణ ప్రజానీకాన్ని హెచ్చరించడమైనది.

| రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు) & హామీదారు(లు) పేరు, రుణ ఖాతా నెం. | డిమాండ్ నోటీసు తేదీ & మొత్తం (రూ. లలో) | స్వాధీనతా తేది |
|---|---|---|
| మల్లారపు లక్ష్మమ్మ (దరఖాస్తుదారు) మల్లారపు ఈశ్వరయ్య (సహ-దరఖాస్తుదారు 01) రుణ ఖాతా నెం. S160202000003 | 9-ఫిబ్రవరి-2026 రూ. 6,11,208/- (రూపాయలు ఆరు లక్షల పదకొండు వేల రెండు వందల ఎనిమిది మాత్రమే) ఎన్‌పిఏ: 29-జనవరి-2026 | 20-07-2026 |
| **సెక్యూర్డ్ ఆస్తి వివరణ:** సబ్ రిజిస్ట్రార్ గుంటూరు కార్యాలయ అధికార పరిధిలోని ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా మరియు గూడూరు సబ్ రిజిస్ట్రేషన్, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు, సైదాపురం మం॥, సైదాపురం గ్రా॥, అరుంధతీయ వాడ వద్ద బ్లాక్ నెం. 03 పిటిఐ/అసెస్‌మెంట్ నెం. 1424, సర్వే నెం. 480లో 64 చ॥గ॥లు విస్తీర్ణములో 342 చ॥అ॥ల ప్లింత్ ఏరియా కలుపుకొని ఆర్.సి.సి. రూఫ్ నివాస భవనము యావదాస్తి. **సరిహద్దులు: తూర్పు:** వీధి, **పడమర:** వీధి, **దక్షిణం:** అడసనపల్లి అంకయ్య యొక్క ఇల్లు, **ఉత్తరం:** చింతగుంట బుజ్జయ్య యొక్క ఇల్లు. | | |
| మునెమ్మ గూడూరు (దరఖాస్తుదారు) పరిచెర్ల సుబ్రహ్మణ్యం (సహ-దరఖాస్తుదారు 01) రుణ ఖాతా నెం. S160204000012 | 7-ఏప్రిల్-2026 రూ. 5,43,598/- (రూపాయలు ఐదు లక్షల నలభై మూడు వేల ఐదు వందల తొంభై ఎనిమిది మాత్రమే) ఎన్‌పిఏ: 31-మార్చి-2026 | 20-07-2026 |
| **సెక్యూర్డ్ ఆస్తి వివరణ:** సబ్ రిజిస్ట్రార్ గూడూరు కార్యాలయ అధికార పరిధిలోని ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా మరియు గూడూరు సబ్ రిజిస్ట్రేషన్, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా, సైదాపురం మం॥, బ్లాక్ నెం. 3, అరుంధతీయ వాడ ఏరియా, సైదాపురం గ్రా॥, గ్రామకంఠం, మొలకలపుండ్ల గ్రామ పంచాయతీ మరియు మజర, సైదాపురం మం॥ వద్ద పిటిఐ/అసెస్‌మెంట్ నెం. 1187, సర్వే నెం. 480లో 77.04 చ॥గ॥లు లేదా 694 చ॥అ॥ల విస్తీర్ణములో 388 చ॥అ॥ల ప్లింత్ ఏరియా కలుపుకొని ఆర్.సి.సి. రూఫ్ నివాస భవనము యావదాస్తి. **సరిహద్దులు: తూర్పు:** వీధి, **పడమర:** చింతగుంట కృష్ణయ్య యొక్క ఇల్లు, **దక్షిణం:** చింతగుంట బుజ్జయ్య యొక్క ఇల్లు, **ఉత్తరం:** పిట్టి వెంకయ్య కు చెందిన గార్డెన్. | | |
| నెల్లటూరు రమణమ్మ (దరఖాస్తుదారు) నెల్లటూరు దామోదర్ (సహ-దరఖాస్తుదారు 01) రుణ ఖాతా నెం. S160202000223 | 7-ఏప్రిల్-2026 రూ. 4,13,111/- (రూపాయలు నాలుగు లక్షల పదమూడు వేల నూట పదకొండు మాత్రమే) ఎన్‌పిఏ: 10-మార్చి-2026 | 19-07-2026 |
| **సెక్యూర్డ్ ఆస్తి వివరణ:** సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా కోట పరిధిలోని తిరుపతి జిల్లా, వాకాడు తాలూకా, వాకాడు గ్రా॥లోని సర్వే నెం(లు). 116-1ఏ4లో ఉన్న ఇంటి నెం./అసెస్‌మెంట్ నెం. 1671 గల 337.68 చ॥అ॥ల ఆర్‌సిసి మరియు 89.12 చ॥గ॥ల విస్తీర్ణము గల ఆస్తి యావదాస్తి. సరిహద్దులు: తూర్పు: కాకి రవి యొక్క ఇల్లు, పడమర: పుచ్చాలపల్లి లక్ష్మి దేవి యొక్క ఇల్లు, దక్షిణం: సిసి రోడ్డు, ఉత్తరం: గద్దం బాల గురవయ్య యొక్క ఇల్లు. | | |

**రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలు మరియు హామీదారులకు చట్టబద్ధమైన నోటీసు**
రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు)/హామీదారు(లు)ను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా ఆస్తి బహిరంగ వేలం/టెండర్ల ద్వారా ఇక మీదట ఎప్పుడైన విక్రయించవచ్చును మరియు అందువలన సెక్యూరిటీ (ఇంటరెస్ట్) ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 6, 8 & 9 క్రింద దీనిని నోటీసుగా కూడా పరిగణించవలెను.

తేది: 23.07.2026 సం/- అధీకృత అధికారి
ప్రదేశం: నెల్లూరు/తిరుపతి ఆల్టమ్ క్రెడో హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎసిహెచ్ఎఫ్ఎల్)


# ఏనుగుల గుంపు రాకతో రైతుల్లో ఆందోళన

**విజయనగరం,జులై 22 (నినాదం):** విజయనగరం జిల్లా బాడంగి మండలం రేజేరు గ్రామ సమీపంలో రేవడి చెరువు, నల్లోడు పొలాల్లో ఏనుగుల గుంపు బుధవారం ఉదయం సంచరించింది. బాడంగి మండలం పినపెంకి వైపు మార్గం మళ్లించాయి. గత వారం రోజులుగా తెర్లాం, బాడంగి పరిసర ప్రాంతాల్లో ఏనుగులు స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. మొక్కజొన్న, పశువులు గడ్డి, వరి నారుమడుల్లో సంచరిస్తూ పంట నష్టం కలిగిస్తు న్నాయి. ఏనుగుల సంచారంతో పంటపొలాలు నష్టమవుతున్నాయని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## కర్నూలులో పికిల్ బాల్ కోర్టు ప్రారంభం

**రూ.2.5 కోట్లతో సింథటిక్ వాకింగ్ ట్రాక్: భరత్**

**కర్నూలు, జులై 22 (నినాదం):** అవుట్ డోర్ స్టేడియంలో రూ. 2.5 కోట్లతో సింథటిక్ వాకింగ్ ట్రాక్, వాలీబాల్ కోర్ట్ నిర్మిస్తున్నామని మంత్రి టీజీ భరత్ గుప్తా వ్యాఖ్యానించారు. క్రీడాకారుల కోసం ప్రపంచస్థాయి ప్రమాణాలతో సింథటిక్ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. బుధవారం కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో పికిల్ బాల్ కోర్టును మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విడియాతో మాట్లాడారు. అవుట్ డోర్ స్టేడియంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రత్యేక నిధులు సమకూర్చి ఈ స్టేడియాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి వెల్లడించారు. ఏపీలో క్రీడలపై సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారని తెలిపారు. ఎస్టీ, బీసీ కళాశాల మైదానంలో ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పుకొచ్చారు. మంచి చేసే ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని మంత్రి టీజీ భరత్ కోరారు.

## విజయవాడ బిజెపి ర్యాలీలో ఉద్రిక్తత

**విజయవాడ, జులై 22 ( నినాదం):** భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆధ్వర్యంలో విజయవాడలో ఆ పార్టీ శ్రేణులు నిర్వహించిన ర్యాలీ ఉద్రిక్తతకు దారితీసింది. విజయ టాకీస్ నుంచి ర్యాలీగా భాజపా కార్యకర్తలు కాంగ్రెస్ కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌కు చేరుకుని ప్రతిపక్షనేత రాహుల్, ప్రియాంకకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అందుకు.. ప్రతిగా కాంగ్రెస్ కార్యకర్తలు భాజపాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఇరు పార్టీల కార్యకర్తలు జెండా కర్రలు, నీళ్ల బాటిళ్లు, చెప్పులతో పరస్పరం దాడులకు దిగారు. పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితి అదుపు చేశారు. ఈ ఘటనతో విజయవాడ పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.



# పిల్లలను చదివించే ప్రతి తల్లికి వందనం

**తల్లికి వందనం నిధుల విడుదలపై లోకేశ్**

**అమరావతి, జులై 22 ( నినాదం):** రాష్ట్రవ్యాప్తంగా 'తల్లికి వందనం' నిధులను కూటమి ప్రభుత్వం బుధవారం విడుదలకు రంగం సిద్ధం చేసింది. అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ. 13 వేలు జమ చేయనుంది. తల్లికి వందనం నిధుల విడుదల సందర్భంగా మంత్రి నారా లోకేశ్ సోషల్ విడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ఏ ఒక్క చిన్నారీ విద్యకు దూరం కాకూడదనేది కూటమి ప్రభుత్వం లక్ష్యమని స్పష్టం చేశారు. 'పిల్లలే మన సంపద. వారి చదువులే మనకు తరగని ఆస్తి. విద్యే మన రాష్ట్రానికి వెలకట్టలేని పెట్టుబడి' అని చెప్పుకొచ్చారు. ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు చదివితే అంతమందికి ఎటువంటి ఆంక్షలు లేకుండా ఇచ్చేలా తల్లికి వందనం పథకాన్ని రూపొందించినట్లు మంత్రి తెలిపారు. వరుసగా రెండో ఏడాది తల్లికి వందనం నిధులను విద్యా సంవత్సరం ఆరంభంలోనే విడుదల చేశామన్నారు. తల్లికి వందనం ద్వారా ఈ ఏడాది 67.47 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుందని తెలిపారు. 42.70 లక్షల మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ. 10,120.78 కోట్లు జమ చేస్తున్నామన్నారు. నేటి నుంచి ఈనెల 24 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. 'పిల్లలను చదివించే ప్రతి తల్లికీ నా వందనం' అని ఎక్స్‌లో మంత్రి లోకేశ్ పోస్ట్ చేశారు.

# రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ ఆందోళన

**నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్**

**చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం**



**కరీంనగర్, జులై 22(నినాదం) :** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ప్రతిపక్ష నాయకుల అరెస్టును ఖండిస్తూ, నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్, నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గాంధీ చౌక్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద శాంతియుత నిరసన చేపట్టారు. చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నిరసన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, హుజూరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఒడితెల ప్రణవ్ బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్యతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసిన నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. ఈ ఘటనపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ నిర్వహించి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం కోరుతూ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ప్రతిపక్ష నాయకులు చేపట్టిన నిరసనను అణచివేస్తూ అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుతో రాజీ పడే చర్యలను కాంగ్రెస్ సహించదని, వారికి న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ గొంతు నొక్కినా కాంగ్రెస్ వెనక్కి తగ్గదని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. నీట్ లీకేజీ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు ఉప్పుల అంజనీ ప్రసాద్, ఎండి తాజ్,ముత్యం శంకర్ గౌడ్, గడ్డం విలాస్ రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, కొరివి అరుణ్ కుమార్, మడుపు మోహన్, వెన్నం రజిత రెడ్డి,కల్లపల్లి బాలరాజు, గంట శ్రీనివాస్ కళ్యాణి, చాడ గొండ బుచ్చిరెడ్డి, నునావత్ భాస్కర్ నాయక్, పర్వత మల్లేశం, ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, వరాల నర్సింగం, కాంతల జగన్ రెడ్డి, పడాల అజయ్ గౌడ్,బండారు రమేష్‌గౌడ్, ముస్తాక్ హైమద్, కామ్‌రెడ్డి రామ్ రెడ్డి, కిమ్ ఫహద్, మూల రవీందర్ రెడ్డి, ఇమ్రాన్, మాదాసు శ్రీనివాస్, కిరణ్ రెడ్డి, నిహాల్, సామ్రాట్, కుంభాల రాజు కుమార్, మంద మహేష్, గడప శ్రీనివాస్, మామిడి సత్యనారాయణ రెడ్డి, ముక్క భాస్కర్, మార్కరాజు, పొన్నం మధు, వేముల శ్రీనివాస్, హర్ష మల్లేశం, మూల కృష్ణారెడ్డి, సురేందర్ రెడ్డి, కోడూరి రవీందర్ గౌడ్, జువ్వాడి అమరేందర్ రావు, ఉప్పరి రవి, జల్లోజు శ్రీనివాస్, సత్తినేని శ్రీకాంత్, కర్రె పావని, గద్దం శ్రీరామ్, జువ్వాడి అమరేందర్రావు, తదితరులు పాల్గొన్నారు.



# ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు గల్లీ నుంచి ఉద్యమిద్దాం

**కేంద్ర విద్యా శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి**

**విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్రశ్రీ**

**నీట్ పేపర్ లీకేజీ నిందితుల వెంటనే అరెస్టు చేయాలి**

**కోరుట్ల పట్టణమండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో**

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు**



**కోరుట్ల, జూలై 22(నినాదం) :** ఢిల్లీ లో కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు గల్లీ నుంచి ఉద్యమాన్ని ఉధృతం చేద్దాం అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతం గా నిరసన తెలియజేస్తున్న విద్యార్థులపై లాఠీ చార్జి చేయడానికి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ కోరుట్ల పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గాజెంగి నందయ్య, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగారావు ఆదేశాల మేరకు కోరుట్ల కొత్త బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధమైన హక్కులను వినియోగించుకుంటూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీ చార్జీ బల ప్రయోగం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం అన్నారు. జాతీయ స్థాయిలో జరుగుతున్న పరీక్షల నిర్వహణలో వరుస వైఫల్యాల వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీకేజీ పై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు తోపాటు కోరుట్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పన్నాల అంజి రెడ్డి,కోరుట్ల మున్సిపల్ వైస్ చైర్మన్ షాహిద్ ధర్మారం సర్పంచ్ దొడ రంజిత్ రెడ్డి, అయిలాపూర్ సర్పంచ్ ద్యావనపల్లి రామకృష్ణ, చిన్న మెట్ పల్లి గ్రామ సర్పంచ్ రహీం, కోరుట్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు కో- ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఐఐఐటి విద్యార్థులకు ఉపాధి కల్పన లక్ష్యంగా నాణ్యమైన విద్యాబోధన సాగాలి

**నైపుణ్యాల పెంపుతో అంతర్జాతీయ స్థాయి ఉద్యోగ అవకాశాలపై దృష్టికలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్ ప్రతినిధి, బాసర: జూలై 22 ( నినాదం):** బుధవారం కలెక్టర్ బాసర ఐఐఐటి క్యాంపస్‌ను సందర్శించి, విశ్వవిద్యాలయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, పరిశ్రమలకు అవసరమైన సామర్థ్యాలను పెంపొందించేలా విద్యా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను సమర్థంగా వినియోగించి, విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో ఉద్యోగాలకు పోటీపడే స్థాయికి తీర్చిదిద్దాలని తెలిపారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల సమస్యలు ఏవైనా దృష్టికి వచ్చిన వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు. అలాగే అధ్యాపకులు, ఉద్యోగులు, సిబ్బందికి కూడా మెరుగైన పని వాతావరణం, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అన్నారు. క్యాంపస్‌లో నిరంతర విద్యుత్ సరఫరా, సురక్షితమైన తాగునీరు, నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అకాడమిక్, డిజిటల్, క్రీడా సదుపాయాల విస్తరణతో పాటు విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. క్యాంపస్‌కు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ ఇచ్చారు. అనంతరం బాసరలో ప్రతిపాదిత నూతన తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించి, అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఐఐఐటి ఉపకులపతి గోవర్ధన్, ఓఎస్డీ మురళీ దర్శన్, తహసీల్దార్ పవన్ చంద్ర, విశ్వవిద్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేదవారికి మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలి

**భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**



**భూపాలపల్లి ప్రతినిధి, జూలై 22(నినాదం):** పేదోనికి మెరుగైన వైద్య సేవలు అందించాలని అందుకు అవసరమైన ఆధునిక పరికరాలు కొరకు ప్రతిపాదనలు పంపాలని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖాళీ పోస్టులు నింపాలని, డిప్యుటేషన్ పై వెళ్లిన సిబ్బందిని తిరిగి రప్పించాలని కమిటీ సమావేశం తీర్మానం చేసినట్లు తెలిపారు. ఆసుపత్రిలో ఉన్న లోపాలను సరిచేయాలని స్పష్టం చేశారు. జిల్లా ప్రధాన ఆసుపత్రిని 100 నుండి 200 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయుటకు ప్రతిపాదనలు పంపినున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో ప్రసూతి, ఆర్థో, ఆప్త మాలజీ, అనస్థీషియో, డెంటల్, రేడియాలజీ, అత్యవసర సేవలు, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్ సేవలకు అవసరమైన పరికరాలు, సెంట్రల్ ఆక్సిజన్, రక్త నిల్వలు గది, సిబ్బంది కొరత తదితర అంశాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అనస్థీషియో 8 పోస్టులకు ఇద్దరు మాత్రమే ఉన్నారని, వైద్యులు కొరత వల్ల సేవలకు ఇబ్బందులు వస్తున్నాయని వైద్యులు తెలిపారు. అలాగే గైనకాలజీ సిబ్బంది 8 మంది ఉండాల్సి ఉండగా ఇద్దరు ఉండటం వల్ల సేవలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి నెల ఎన్ని ప్రసవాలు, ఆపరేషన్లు జరుగుతున్నాయని వైద్యులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. 2022 నుండి 2026 వరకు సంవత్సరం వారిగా ఎన్ని ప్రసవాలు, సర్జరీలు జరిగాయి అలాగే ఓపి సేవల నివేదికలు ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో తీర్మానాలు వ్రాయాలని ఆ ప్రకారం అవసరమైన పరికరాలు మంజూరు చేస్తామని తెలిపారు. రక్త నిధి భద్రపరచు ఫ్రిజ్ చెడిపోతే ఎందుకు మరమ్మతులు చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. చిన్న పిల్లలను ఆసుపత్రిలో చేర్చినపుడు పరికరాలు ఉండాలని సూచించారు. వ్యాధిగ్రస్తులకు అవసరమైన రక్తాన్ని ఎక్కించడానికి టెక్నీషియన్ లేకపోతే యంత్రాన్ని ప్రక్కన పెడుతున్నారని మిషన్, టెక్నీషియన్ కొరకు ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. ఆసుపత్రి సేవలకు బ్లడ్ బ్యాంక్ సేవలు చాలా కీలకమని ఎమ్మెల్యే తెలిపారు. బ్లడ్ బ్యాంక్ 24 గంటలు నడుస్తూనే ఉండాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ అంబులెన్స్ లుమరమ్మతులు చేపించాలని సూచించారు. అలాగే అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎం ఆర్ ఐ సేవలకు టెక్నీషియన్ నియామకానికి ప్రతిపాదనలు పంపాలని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో యూడిఐడి రూము ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఆయా విభాగాల సేవలకు అవసరమైన పరికరాలు కొరకు ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ప్రధాన వైద్యశాల పర్యవేక్షకులు డా రాజేంద్రప్రసాద్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధు సూదన్, జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, ఆసుపత్రి ఉప పర్యవేక్షకులు డా వెంకట రత్నం అన్ని విభాగాల వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎజెండాలో నీట్‌పై చర్చ ఎందుకు లేదు!

సంపాదకీయం

తప్పు జరిగినప్పుడు ప్రభుత్వంలో ఎవరు ఉంటే వారినే నిందిస్తారు. వారిమీదే విమర్శలు గుప్పిస్తారు. పాలన బ్రహ్మాండంగా చేస్తుంటే..పకడ్బందీగా చర్యలు తీసుకుని ఉంటే నీట్ పేపర్ ఎందుకు లీక్ అవుతుంది. ఎందుకు దుర్మార్గులు పేపర్ అమ్ముకునేందుకు సాహసిస్తారు. ఇలా చేయడం వల్ల ఎందరో విద్యార్థుల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయి. కొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇదంతా కూడా ప్రభుత్వ వైఫల్యంగానే చూడాలి. అన్ని రాష్ట్రాలు తమంత తాముగా ఎంసెట్ నిర్వహించుకుని, పక్కగా ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తే, దానిని కాదని నీట్‌ను ప్రవేశ పెట్టారు. కేంద్రం ఆంధీనంలోని ఎన్‌టిఏ నీట్ నిర్వహణలో ఎందుకు తప్పుచేసింది. ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నిజానికి పేపర్లు లీక్ చేసిన వారిని, అమ్ముకున్న వారిని బహిరం గంగా ఉరితీయాలి. ఇకపోతే ప్రస్తుతానికి వస్తే...పేపర్ లీక్‌లో విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సోనమ్ వాంగ్‌చుక్ డిమాండ్ చేస్తూ వచ్చారు. దీక్షకు దిగారు, కాక్రోచ్ పార్టీ మొదటి డిమాండ్ ఇదే తమ డిమాండ్ అని ప్రకటించింది. ఢిల్లీలో ఆందోళనకు పిలుపును ఇచ్చింది. అయినా ప్రభుత్వం మొద్దునిద్ర వీడలేదు. దీనిపై ప్రధాని స్పందించలేదు. నిరంతరం విదేశీ పర్యటనలతో గడుపుతున్న ప్రధాని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి మాట్లాడడం లేదు. పార్లమెంట్ సమావేశాలకు ముందే ప్రధాని స్పందించి, సిజెపి నేతలను పిలిచి మాట్లాడడం, నీట్‌పై తీసుకుంటున్న చర్యలను వివరించడం జరిగివుంటే బాగుండేది. నిజానికి సమస్యలను పరిష్కరించడం అన్నది ప్రజల కోసమే కదా. మరి ఎందుకు పెద్దగా స్పందించలేదన్నదే సమస్య. ఇకపోతే కాక్రోచ్ పార్టీ చేస్తున్న ఆందోళనలను హైజాక్ చేసేందుకు కాంగ్రెస్ , రాహుల్ గాంధీ యత్నించారనే చెప్పాలి. విద్యార్థుల ఆందోళనలో దూరడం ద్వారా సమస్యకు రాజకీయం పులిమారు. రాహుల్‌కు సమస్యల పట్ల చిత్తశుద్ధి కనిపించడం లేదు. పార్లమెంటులో చర్చించి, ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన పెద్దమనిషి రాజకీయ డ్రామాకు తెరతీసారు. ఇకపోతే అధికార పార్టీ నేతలు చేస్తున్న వాదనలో పసలేదు. నీట్ పేపర్ లీక్ అంశంపై కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేస్తోందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం పార్లమెంట్‌లో చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ రాజకీయ ప్రదర్శనకే ప్రాధాన్యత ఇచ్చిందని ఆరోపించారు. ప్రధాని నివాసం ఎదుట రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన నిరసనపై స్పందించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, ఇది భారత రాజకీయ చరిత్రలో ఒక చీకటి రోజని పేర్కొంటూ ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాంగ్రెస్ ఉల్లంఘించిందని విమర్శించారు. విమర్శించ డానికి ఎన్నయినా చెప్పవచ్చు. నిజానికి నీట్ అంశంపై చర్చను ఎజెండాలో పెట్టివుంటే సమస్య వచ్చి ఉండేది కాదు. ఎందుకు అజెండాలో పెట్టలేదో ముందుగా కేంద్రం వివరణ ఇవ్వాలి. మొత్తంగా ఇప్పుడు తప్పెవరిదంటే..అధికార పార్టీదే అని చెప్పాలి. సమస్యపై చిత్తశుద్ధి లేకపోవడం వల్లనే దేశ రాజధాని ఢిల్లీ ఆందోళనలతో అట్టుడుకుతోంది. సీజేపీ, కాంగ్రెస్ ధర్నాలతో హైటెన్షన్ నెలకొంది. విద్యార్థులపై లాఠీచార్జ్‌కు నిరసనగా.. ప్రధాని నివాసం దగ్గర 3 గంటలపాటు కాంగ్రెస్ మెరుపుధర్నా నిర్వహించింది. పార్లమెంటు వాయిదా తర్వాత పాదయాత్ర చేసిన కాంగ్రెస్ ఎంపీలు.. నేరుగా ప్రధాని నివాస దగ్గరకు వెళ్లి ధర్నా నిర్వహిచారు. నీట్ పేపర్ లీక్‌పై ప్రధాని, హోంమంత్రి, విద్యాశాఖ మంత్రి రాజీనామాకు రాహుల్ డిమాండ్ చేశారు. కాగా.. రాహుల్, ప్రియాంక సహా.. ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఆ తర్వాత రాత్రి విడుదల చేశారు. 'చలో సంసద' మార్చ్ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ నిరసనకారులపై పోలీసుల చర్యలు, కాంగ్రెస్ ధర్నా.. తర్వాత కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళ వారం తొలిసారిగా స్పందించారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ విద్యార్థు లను రాజకీయ సాధనంగా వాడుకుంటున్నాయని ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ వివాదానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయకుండా, పార్లమెంట్ వర్షాకాల సమా వేశాల్లో కాంగ్రెస్ గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని ప్రధాన్ ఆరోపించారు. పార్ల మెంటులో నీట్ అంశంపై సవివరంగా చర్చించడానికి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసినప్పటికీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం వెలుపల నిరసన చేపట్టారని కేంద్ర మంత్రి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సమగ్ర చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం తెలియజేసినప్పటికీ, కాంగ్రెస్ ప్రజాస్వామ్య చర్చ కన్నా రాజకీయ ప్రదర్శనకే ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రాహుల్ గాంధీకి విద్యార్థులు అవసరం లేదు.. గొడవలు సృష్టించ డమే లక్ష్యమంటూ పేర్కొన్నారు.. విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ రాజకీయం చేస్తుందని ఆరో పించారు. విద్యార్థులకు సమాధానాలు, సంస్కరణలు, జవాబుదారీతనం అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అంటున్న ధర్మేంద్ర ప్రధాన్ ఇంతకాలం ఎందుకు స్పందించ లేదో చెప్పాలి. విపక్షంలో ఉన్నవారు ఎవ్వరైనా రాజకీయం చేస్తారు. బిజెపి కూడా అదే చేసేది. ప్రజాస్వామ్య నియమాలను, పార్లమెంటరీ సంప్రదాయాలను పాటిస్తే మంచిది. సమస్య ఏదైనా చర్చకు అవకావం రావాలి. ఎందుకంటే ఈ మధ్య కాలంలో పార్లమెంటులో సమర్థవంతంగా చర్చలు సాగడం లేదు. సమస్యలపై ప్రస్తావన జరగడం లేదు.ఇందుకు అధికార పక్షానిదే ప్రధాన బాధ్యత. విద్యార్థులు లేవనెత్తుతున్న సమస్యలపై ప్రభుత్వం చర్చించాలనుకుంటే ఎందుకు ఎజెండాలో పెట్టలేదో చెప్పాలి. ప్రజాస్వామ్యంలోప్రతిపక్ష పార్టీకి నిరసన తెలిపే హక్కు ఉంటుంది. పార్లమెంటులో చర్చలకు అవకాశం రానప్పుడు ఎవ్వరైనా వీధుల్లోనే నిరసనలు తెలుపుతారు. తాము అనుకున్నట్లుగానే పార్లమెంట్ నడవాలని పాలకపక్షం కోరుకోవడం సరికాదు. ప్రజలకు ఏది అవసరమో అది గుర్తించి, చర్చించి, పరిష్కరిస్తే మంచిది. నీట్‌పై చర్చించి, లీకులు లేకుండా, అన్ని రాష్ట్రాలకు ఆమోదయోగ్యంగా నిర్ణయం తీసుకుంటే మంచిది.

# యువత ఆగ్రహం..
## రాజకీయాల బలిపీఠంపై భవిష్యత్

అంతర్మథనం
వార్త వెనుక వాస్తవం... (కొనసాగింపు)



✍ బిజిగిరి శ్రీనివాస్
సంపాదకులు – నినాదం

### పేపర్ లీకుల సంక్షోభం.. పరిష్కారాల కంటే పరస్పర ఆరోపణలకే ప్రాధాన్యమా?

**దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకులపై మొదలైన ఆందోళనలు ఇప్పుడు కేవలం పరీక్షల సమస్యగా మిగలలేదు. అవి దేశ రాజకీయాలను కుదిపే అంశంగా మారాయి. ఉద్యోగాలు, విద్య, భవిష్యత్తు కోసం సంవత్సరాల పాటు శ్రమించిన లక్షలాది మంది యువతలో పేరుకుపోయిన అసంతృప్తి ఇప్పుడు వీధుల్లోకి వచ్చింది. విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు, పలు పౌర సంఘాలు ఈ ఉద్యమాలకు మద్దతు తెలుపుతున్నాయి. వివిధ ప్రతిపక్ష పార్టీలు కూడా దీనిని ప్రధాన రాజకీయ అంశంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాయి.**




ఈ పరిణామం కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీకి రాజకీయంగా సవాలుగా మారిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎందుకంటే ప్రశ్నాపత్రాల లీకులు ఒక్క రాష్ట్రానికో, ఒక్క పరీక్షకో పరిమితం కాలేదు. దేశంలోని పలు నియామక పరీక్షల విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తాయి. ఒకసారి నియామక వ్యవస్థపై ప్రజల విశ్వాసం దెబ్బతింటే, దాన్ని తిరిగి నెలకొల్పడం అంత సులభం కాదు.

మరోవైపు కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు ఈ అంశాన్ని ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనంగా చూపిస్తూ ఉద్యమాలకు రాజకీయ మద్దతు ఇస్తున్నాయి. అధికార పార్టీపై ఒత్తిడి పెంచేందుకు పార్లమెంట్ నుంచి వీధుల వరకు నిరసనలు కొనసాగిస్తున్నాయి. అధికార పక్షం, ప్రతిపక్షం రెండూ ఈ అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నాయనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. అయితే ఈ రాజకీయ పోరాటం మధ్య అసలు బాధితుడు మాత్రం ఉద్యోగార్థి యువకుడే.

ఆందోళనలపై అధికార పక్షానికి అనుబంధంగా భావించే కొన్ని వర్గాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఉద్యమాల్లో కొందరు అరాచక శక్తులు లేదా ఇతర ప్రయోజనాల కోసం పనిచేసే వ్యక్తులు చొరబడుతున్నారనే వాదనను ముందుకు తెస్తున్నాయి. అదే సమయంలో ఉద్యమకారులు మాత్రం తమ డిమాండ్ చాలా స్పష్టమని—పారదర్శక నియామకాలు, లీకుల నివారణ, బాధ్యులపై కఠిన చర్యలేనని చెబుతున్నారు. ఈ రెండు కథనాల మధ్య అసలు సమస్య వెనుకబడిపోకూడదన్న ఆందోళన కూడా వ్యక్తమవుతోంది.

ప్రభుత్వాలు సాధారణంగా ఇలాంటి సందర్భాల్లో ఉద్యమం వెనుక రాజకీయాలను వెతుకుతాయి. ప్రతిపక్షాలు మాత్రం ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తిచూపుతాయి. కానీ లక్షలాది మంది యువత రోడ్డెక్కే పరిస్థితి ఎందుకు వచ్చింది? పరీక్షా వ్యవస్థలో లీకులు ఎందుకు పునరావృతమవుతున్నాయి? మధ్యవర్తుల ముఠాలు ఎలా పెరుగుతున్నాయి? సాంకేతిక భద్రత ఎందుకు విఫలమవుతోంది? అనే అసలు ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సిన బాధ్యత మాత్రం ప్రభుత్వానిదే.

దేశ చరిత్ర చెబుతున్న పాఠం ఒక్కటే. యువత ఆవేదనను ఎక్కువకాలం నిర్లక్ష్యం చేయడం ఏ ప్రభుత్వానికీ మంచిది కాదు. ఉద్యోగం కోసం చదివిన యువకుడు తన కష్టానికి విలువ లేదని భావించే పరిస్థితి వస్తే, అది కేవలం ఒక పరీక్ష వైఫల్యం కాదు; మొత్తం పాలనా వ్యవస్థపై విశ్వాస సంక్షోభానికి సంకేతం.



ఈ సంక్షోభం నుంచి బయటపడాలంటే కేవలం ప్రకటనలు సరిపోవు. ప్రశ్నాపత్రాల ముద్రణ నుంచి పంపిణీ వరకు పూర్తిగా డిజిటల్ భద్రత, స్వతంత్ర దర్యాప్తు, లీకులపై వేగవంతమైన ప్రత్యేక న్యాయస్థానాలు, బాధ్యుల ఆస్తుల జప్తు, అభ్యర్థులకు నష్టపరిహారం, సమయ బద్ధ నియామకాలు వంటి నిర్మాణాత్మక సంస్కరణలు అవసరం. యువతకు న్యాయం జరిగిందనే నమ్మకం కల్పించడమే ప్రభుత్వానికి అతిపెద్ద రాజకీయ విజయం.

**పేపర్ లీక్ సమస్యను రాజకీయ అవకాశంగా చూసినా, రాజకీయ కుట్రగా కొట్టిపారేసినా దేశానికి ప్రయోజనం లేదు. అధికార పక్షం బాధ్యతతో స్పందించాలి. ప్రతిపక్షం పరిష్కారాలను కూడా సూచించాలి. ముఖ్యంగా యువత విశ్వాసాన్ని తిరిగి గెలుచుకోవడం భారత ప్రజాస్వామ్యం ముందున్న అత్యవసర కర్తవ్యంగా మారింది.**

---

### బాసర ఆలయంలో
# వరుణయాగం
**వర్షాలు కురవాలని యాగ నిర్వహణ**

బాసర : చదువుల తల్లి కొలువైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారి సన్నిధిలో బుధవారం వరుణయాగం నిర్వహించారు. ఎల్‌నినో ప్రృభావంతో వర్షాలు కురియక పోవడంతో వరుణ యాగం చేపట్టారు. ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాటక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి ఆధ్వర్యంలో వరుణయాగాన్ని మంగళ వాయిద్యాలతో బాలలయం నుండి వైదిక శాల ప్రవేశం అనంతరం గురు ప్రార్థన, వరుణయాగ సంకల్పం, గణపతి పూజ, పుణ్యహవాచణం, నాంది ముఖం, నవగ్రహ మండప వరుణ కళశస్థాపన, అగ్ని ప్రతిష్ట, వరుణ జపములు స్థాపిత దేవతా పూజ హోమములు, నిర్వహించారు.

# సిసిఐ పునరుద్ధరణపై మీ వైఖరి ఏంటి

**జిల్లా అభివృద్ధికి సిమెంట్ ఫ్యాక్టరీ అతి ముఖ్యం**
**సిఎం రేవంత్‌కు బిఆరఎస్ నేత కెటిఆర్ లేఖ**

హైదరాబాద్: ఆదిలాబాద్ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ పునరుద్ధరణపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఆదిలాబాద్ అభివృద్ధికి సీసీఐ పునరుద్ధరణ కీలకమని.. రూ.250 కోట్ల రాష్ట్ర వాటాతో పునరుద్ధరణ సాధ్యమేనని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపకపోవడమే జాప్యానికి కారణమన్న కేటీఆర్ సీసీఐ పునరుద్ధరణపై రేవంత్ ఇచ్చిన హామీ లను గుర్తు చేశారు. గతంలో బీఆరఎస్ హయాంలో చేసిన ప్రతిపాదనలను ప్రస్తావించారు. ఆదిలాబాద్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. రెండున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ చిత్త శుద్ధి లోపం వల్లే జాప్యం జరిగిందని.. సీసీఐపై ఆరు కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇటీవలే సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీసీఐ సాధన సమితి బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర భారీ పరిశ్రమలు / ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసిందని తెలిసిందే. ఈ సందర్భంగా కేటీఆర్ వి డియాతో మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి మాజీ మంత్రి జోగురామన్న, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతోపాటు సీసీఐ సాధన సమితి సభ్యులను అందరినీ తీసుకొని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామిని కలిశాం. 1980వ దశకంలో ఏర్పాటు చేయబడ్డ సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ప `లాంట్ ఒకదశలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 6 వేల మందికి ఉద్యోగాలు కల్పించిందని అన్నారు. రాబోయే 100 సంవత్సరాల వరకు మీకు మైన్ స్టోన్ రిజర్వ్‌లు కూడా వి కు ఉన్నాయి. 4 లక్షల మెట్రిక్ టన్నుల కెపాసిటీతో ఉన్న ఈ ప `లాంట్‌ను నడిపేందుకు అవకాశాలు సంపూర్ణంగా ఉన్నాయన్నారు. గతంలో 2019లో కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా మాటిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఈ ప్లాంట్‌ను తప్పకుండా తెరిపిస్తామని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చెప్పారు. ప్లాంట్‌ను తెరిపిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం కూడా మాటిచ్చారు. కానీ ఈ రోజు ఆదిలాబాద్ సీసీఐని తుక్కు కింద అమ్మేస్తున్నరని వారికి వివరంగా చెప్పడం జరిగిందన్నారు.

---

## భారత మజ్దూర్ సంఘ్ వ్యవస్థాపకం..
# దేశీయ కార్మిక శక్తి సంఘటితం

**జూలై 23...భారత మజ్దూర్ సంఘ్ వ్యవస్థాపక దినోత్సవం**

**జూలై 23వ తేదీ భారత కార్మిక ఉద్యమ చరిత్రలో ఒక మైలురాయి. ఈ రోజే 1955లో ఢిల్లీలో డాక్టర్ దత్తోపంత్ ఠేంగడీ ఆధ్వర్యంలో భారత మజ్దూర్ సంఘ్ స్థాపించ బడింది. సంఘం స్థాపనకు ప్రధాన ప్రేరకులు దత్తోపంత్ ఠేంగడి. ఆయన ఒక గొప్ప తత్త్వవేత్త, సంఘ్ సిద్ధాంత వేత్త మాత్రమే కాక, దేశ భవిష్యత్తును కార్మికుల ద్వారా మలిచేందుకు కృషి చేసిన దార్శనికుడు. ఆయన నేతృత్వంలో జూలై 23, 1955న భోపాల్‌లో భారత మజ్దూర్ సంఘ్ కు శ్రీకారం చుట్ట బడింది. ఇది దేశీయ ఆర్థిక వ్యవస్థ, స్వదేశీ పరిశ్రమల ఎదుగుదలకు కేంద్ర బిందువుగా రూపుదిద్దుకుంది.**

స్వతంత్ర భారతంలో కార్మిక ఉద్యమాలు ఎక్కువగా కమ్యూనిస్టు భావజాలం ఆధారంగా కొనసాగుతున్న నేపథ్యంలో, పూర్తిగా భిన్నమైన దృక్కోణంతో – దేశభక్తి, ధర్మపరమైన శ్రామిక న్యాయ బద్ధత, ఆధ్యాత్మికతతో కూడిన దిశానిర్దేశం చేయడమే లక్ష్యంగా స్టాపించ బడింది.

హిందూ ధార్మిక పంథాలకు లోనైన సామాజిక దృక్కోణంతో కూడిన బీఎంఎస్ ఒక ప్రత్యామ్నాయ కార్మిక ఉద్యమంగా ప్రారంభమైంది. డాక్టర్ ఠేంగడీ, బీజేపీ, ఆరెస్సెస్ సంస్థాగత అనుబంధంతో ఉన్నప్పటికీ, బీఎంఎస్‌ను రాజకీయాలకు అతీతంగా, స్వతంత్రంగా నడిపించాడు. బీఎంఎస్ కేవలం పారిశ్రామిక కార్మికులకే కాదు, వ్యవసాయ కూలీలు, అంగన్ వాడీ కార్యకర్తలు, గిరిజన శ్రామికులు, నిరుద్యోగ యువత, అసంఘటిత రంగ ఉద్యోగులు, ప్రభుత్వం మరియు ప్రైవేటు రంగాల కార్మికుల వరకు విస్తరించిన ఒక సమగ్ర శ్రామిక వేదికగా ఎదిగింది. ఇది ఏ రాజకీయ పార్టీకీ అనుబంధంగా లేదు. ఇది రాజకీయాలకు దూరంగా ఉంటూ, స్వేచ్ఛతో పని చేసే అతిపెద్ద స్వతంత్ర కార్మిక సంఘంగా గుర్తింపు పొందింది. అనేక సందర్భాల్లో నియంత్రిత సంస్కరణలు, మోదీ ప్రభుత్వ కార్మిక కోడ్ బిల్లులపై విమర్శలు, కార్మిక హక్కుల పరిరక్షణలో పోరాట ధోరణి – బి ఎం ఎస్ కార్యకలాపాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. ఉద్యోగ భద్రత, కనీస వేతనం, మహిళా కార్మికుల రక్షణ, అసంఘటిత రంగ అభివృద్ధి తదితర అంశాలలో ఈ సంఘం సుదీర్ఘ కాలంగా పోరాడుతోంది. దేశవ్యాప్తంగా ఒకటిన్నర కోట్ల పైగా సభ్యత్వం కలిగి ఉన్న సంఘం – వ్యవసాయ కార్మికులు, ఆటో, ట్రాన్స్‌పోర్ట్, మైనింగ్, ఫ్యాక్టరీలు, ప్రభుత్వ ఉద్యోగులు, నిర్మాణ రంగ కార్మికులు వంటి అనేక వర్గాలలో శ్రామికుల ఆకాంక్షలకు ప్రతినిధిగా నిలుస్తోంది.

భారత మజ్దూర్ సంఘ్ వ్యాపకత గణాంక పరంగా పరిశీలిస్తే, 2024 నాటికి ఇది 1.71 కోట్ల మంది సభ్యులతో దేశంలోనే అతిపెద్ద కార్మిక సంఘంగా నిలిచింది. ఇది దేశం లోని అన్ని రాష్ట్రాల్లో విస్తరించి, పదివేలకు పైగా యూనియన్లను కలిగి ఉంది. నేషనల్ ట్రేడ్ యూనియన్ ఇంటర్ ఫెడరేషన్‌లో ఇది అనుబంధ సభ్య సంఘంగా ఉన్నప్పటికీ, అంతర్జాతీయ కార్మిక సంఘటితాలుగా పేరు గాంచిన వామపక్ష ప్రభావిత సంఘాల కన్నా భిన్నమైన మార్గాన్ని అనుసరించింది. స్వదేశీ ఆర్థిక దృక్కోణం, శ్రామికుడికి మానవ గౌరవం, కుటుంబ విలువలు, ఆధ్యాత్మికత మీద ఆధారపడిన సంఘర్షణాత్మక కార్యక్రమాలు బీఎంఎస్ ప్రత్యేకతగా నిలిచాయి.

బీఎంఎస్ కార్యకలాపాల పూర్వాపరాలు విశ్లేషిస్తే, ఇది 1970లలో ఎమర్జెన్సీ సమయంలో వ్యతిరేక స్వరంగా నిలబడిన ఘట్టం ముఖ్యమైనది. కార్మిక హక్కులను కాదని పెట్టే ప్రభుత్వ విధానాలపై నిరంతరం పోరాట ధోరణితో స్పందించింది. 1991 తర్వాత నూతన ఆర్థిక విధానాలపై తీవ్రంగా విమర్శలు చేసింది. లైబరలైజేషన్, ప్రైవటైజేషన్, గ్లోబలైజేషన్ అనే ఎల్ పి జి విధానాలు దేశీయ పరిశ్రమలను నాశనం చేస్తున్నాయని, అసంఘటిత రంగాల ఉద్యోగులను అసురక్షిత స్థితి లోకి నెట్టుతున్నాయని బీఎంఎస్ స్పష్టంగా నిరసన తెలియజేసింది. అప్పటి నుండి నేటి వరకు కార్మికుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వాలతో చర్చలు జరిపే, అప్పుడప్పుడు ఆందోళనలకు దిగే బీఎంఎస్ తన ప్రజాస్వామిక పోరాట పద్ధతిని నిరంతరంగా ప్రదర్శిస్తోంది.

డాక్టర్ దత్తోపంత్ ఠేంగడీ రచనలు, ఆలోచనలు, 'శ్రామిక సమాజ్' సిద్ధాంతం ఆధారంగా బీఎంఎస్ మౌలిక సిద్ధాంతాలు ఏర్పడ్డాయి. ఆయన చెప్పిన 'రాష్ట్రాధిష్టిత ఉద్యమం కాదు – సమాజాధిష్టిత ఉద్యమం కావాలి' అనే వాఖ్యానికి అనుగుణంగా బీఎంఎస్ కార్యాచరణ సాగింది. కార్మికుడికి కేవలం జీతం, ఉద్యోగ భద్రత కల్పించడమే కాదు – అతడి ఆత్మ గౌరవాన్ని, కుటుంబ స్థిరతను, సామాజిక విలువలను కాపాడటం కూడా ముఖ్యమన్నది బీఎంఎస్ సిద్ధాంతం. బీఎంఎస్ కార్యచరణలో భాగంగా కార్మికులకు అవగాహన శిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, న్యాయ సహాయం వంటి అనేక రంగాల్లో విస్తరించిన సేవలు అందిస్తున్నది.

ప్రతి సంవత్సరం జూలై 23న నిర్వహించే వ్యవస్థాపక దినోత్సవం ద్వారా బీఎంఎస్ తన చరిత్రను స్మరించుకుంటూ, సంస్థ స్థాపకుని త్యాగాలను గుర్తు చేసుకుంటూ శ్రామిక శక్తికి నూతన ఉత్సాహాన్ని పంచుతుంది. ఆ రోజు దేశ వ్యాప్తంగా కార్యాలయాల్లో పతాక ఆవిష్కరణ, శ్రద్ధాంజలి సభలు, ఉపన్యాసాలు, ప్రదర్శనలు నిర్వహిస్తారు. ఇది కేవలం ఒక సంఘటనా కార్యక్రమం మాత్రమే కాకుండా శ్రామిక చైతన్యానికి నూతన సంకేతంగా మారింది.

బీఎంఎస్ కేవలం గత ఘట్టాలను గర్వంగా చెప్పుకునే ఉద్యమంగా కాదు – ప్రస్తుతం పెరుగుతున్న కార్మిక విపత్తులను గమనించి, నిరంతరం స్పందించే ఒక శక్తివంతమైన శ్రామిక వేదిక. నూతన కార్మిక కోడ్ చట్టాలు, ఇ ఎస్ ఐ, ఇ పి ఎఫ్, ఉచిత ఆరోగ్య సేవలు, కనీస వేతనాలు, పించన్ విధానాల మార్పుల్లో బీఎంఎస్ జోక్యం ప్రత్యేకంగా నిలిచింది. కార్మికుల పక్షాన నిఖార్సయిన వాదనలు చేస్తూ, ప్రభుత్వాలను ఒప్పించి అనేక రకాల ప్రయోజనాలు సాధించింది.

ఈ నేపథ్యంలో బీఎంఎస్ స్థాపన దినోత్సవం అంటే కేవలం ఒక జ్ఞాపకార్థ దినమే కాదు – అది శ్రమజీవుల గౌరవానికి, సమాజ నిర్మాణానికి, శ్రామికుల హక్కుల పరిరక్షణకు అంకితమైన ఉద్యమ ఆవిర్భావ దినం. శ్రమించే వాడు సృష్టికర్త అనే తత్త్వంతో దేశాభివృద్ధికి దోహదపడే ప్రతి కార్మికుని శక్తిని మేల్కొలిపే శక్తిగా బీఎంఎస్ ఉద్యమం నిలుస్తోంది. ఇది నిజంగా శ్రామిక సమాజానికి ఒక సాంస్కృతిక ప్రేరణా శక్తిగా మారిన సంఘటిత పథం.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్టు,**
**కాలమిస్ట్...**
**9440595494**

# ఆల్ ఇండియా రేడియోకు 99 ఏండ్లు !

**(23 జూలై "జాతీయ బ్రాడ్‌కాస్టింగ్ దినోత్సవం" సందర్భంగా)**

23 జూలై 1927 రోజున తొలిసారి భారత దేశవ్యాప్తంగా "ఆల్ ఇండియా రేడియో" ప్రసారాలు ప్రారంభం అయ్యాయి. ఈ చారిత్రాత్మక ఘట్టానికి గుర్తుగా ప్రతి ఏట 23 జూలై రోజున "జాతీయ బ్రాడ్‌కాస్టింగ్ దినోత్సవం (నేషనల్ బ్రాడకాస్టింగ్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. రేడియో ప్రసారాలతో మానవాళికి జరిగిన ప్రయోజనాలు, బ్రాడ్‌కాస్టింగ్ రంగాన్ని సుసంపన్నం చేసిన శాస్త్రవేత్తలను గుర్తు చేసుకోవడానికి ఈ వేదికలు ఉపయోగపడుతున్నాయి. భావ ప్రకటన స్వేచ్ఛ, భావ వ్యక్తీకరణలకు గొంతుకలుగా రేడియోలు, టివీలు, ఆన్‌లైన్ మీడియాలు బహుళ ప్రయోజనాలను కల్పిస్తున్నాయి. బ్రాడ్‌కాస్టింగ్ వ్యవస్థలో టెక్నీషియన్లు, బ్రాడ్‌కాస్టర్లు, ఆర్టిస్టులు, శ్రోతలు సమన్వయంతో పని చేస్తేనే ప్రజలు మెచ్చే ప్రసారాలు సుసాధ్యం అవుతాయని గమనించాలి.

భారత జాతీయ బ్రాడ్‌కాస్టింగ్ ఘన చరిత్ర:
1927లో ఏర్పడిన ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ కొన్ని ఏండ్లు సేవలు అందించినప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో 1930లో మూసి వేయబడింది. తర్వాత ఈ సంస్థను భారత ప్రభుత్వం తీసుకొని తొలుత రేడియో ప్రసారాలను చేయడం, దేశ నలుమూల నుంచి ప్రజలు రేడియో ప్రసారాలను వింటూ పలు అంశాల్లో అవగాహన పెంచుకోవడం జరిగిందని మన అనుభవం స్పష్టం చేస్తున్నది. అందరికీ అందుబాటులో ఉన్న సరళ, చవకైన ఎలక్ట్రానిక్ ఉపకరణంగా రేడియోకు మానవాళి మనసుల్లో సుస్థిర స్థానం కలిగి ఉన్నది. రేడియో ప్రసారాల్లో వ్యవసాయం, విద్య వితరణ, వినోదం పంచడం, సంగీతం వినిపించడం, అవగాహన కార్యక్రమాలు, వాతావరణ ముందస్తు హెచ్చరికలు లాంటి అనేక అంశాలను సామాన్య ప్రజలకు అందుతున్నాయి. నేటి డిజిటల్ యుగంలో ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థలు సహితం ఎఫ్‌ఎం రేడియో ప్రసారాలు, ఇంట్లో 24 గంటలు టివీ ప్రసారాలు, ఆన్‌లైన్ మీడియా సునామీలో ఏఐ యుగపు యువత కొట్టుకుపోతున్నది. మానవ జాతి విషయ పరిజ్ఞానాన్ని కల్పించడంలో నేటి బ్రాడ్‌కాస్టింగ్ ప్రసారాలు విజయవంతం కావడమే కాదు ఆ ప్రసారాలను చూడడం ఒక దురలవాటుగా కూడా మారడం విచారకరం.

రేడియోకు పూర్వ వైభవం వస్తుందా !
నూతన టెక్నాలజీ అవతరణ, మీడియా విప్లవాలు పలు సవాళ్లను, అవకాశాలను కల్పిస్తున్నాయి. నేటి డిజిటల్ యుగంలో యువత కోరికలకు అనుగుణంగా రేడియో ప్రసారాలను చేయడం జరుగుతోంది. సామాజిక బాధ్యతగా దేశాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని రేడియో జర్నలిజమ్‌లో నైతికత పాటించడం కనీస అవసరంగా మారింది. వాతావరణ ప్రతికూల మార్పులు హెచ్చరిస్తున్న వేళ బ్రాడ్‌కాస్టింగ్ వ్యవస్థలు నడుం బిగించి ముందుకు సాగడం అనివార్యం అయ్యింది. నేటి డిజిటల్ వేదికల వరదల్లో రేడియో ప్రసారాల ఆదరణ కొట్టుకుపోతున్నది.

రానున్న రోజుల్లో భారత్‌లో బ్రాడ్‌కాస్టింగ్ రంగం మళ్లీ పూర్వ వైభవాన్ని పొందాలని, రేడియో మళ్లీ మన ఆత్మీయ నేస్తం కావాలని కోరుకుందాం. రేడియో ప్రసారాలను నిత్యం వింటూ విద్యావంతులు అవుతూ ముందుకు సాగుదాం.

**ఆచార్య : బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**

# మేకిన్... లీకేజీ..!

## రణరంగమైన విద్యార్థుల నిరసన

**లాఠీ విరిగింది.. రక్తం చిందింది**
**దేశం పరువు తీస్తున్న పరీక్ష లీకేజీలు**
**రక్తసిక్తమైన ఢిల్లీ పుర వీధులు**
**దారి తప్పిన నిరసన**





**జగిత్యాల ప్రతినిధి జులై 21, నినాదం**

భద్రంగా ఉండాల్సిన క్వశ్చన్ పేపర్ పరీక్షకు ముందే సోషల్ మీడియాలో చెక్కర్లు కొడితే ఎవరిని నిందించాలి. ఇది వ్యవస్థ సంక్షోభం కాదా..? మన దేశంలో ప్రతి ఏటా లక్షలాది మంది విద్యార్థులు సిస్టం మీద నమ్మకంతో పోటీ పరీక్షలు రాస్తారు. ఇప్పుడా వ్యవస్థ మీద నమ్మకం పోతుందని పరీక్ష రాసిన 22 లక్షల మంది విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.

**దీనికి ఎవరు సమాధానం చెప్పాలి.**

మూడేళ్లలో రెండు సార్లు పేపర్ లీక్ అయితే సిస్టం పనిచేస్తున్నట్లా పడుకున్నట్లా..?
డాక్టర్ కావడం కోసం ఒక కలగా పెట్టుకుని పేద మధ్యతరగతి కుటుంబం అహర్నిశలు కష్టపడి ఆ విద్యార్థిని తయారుచేసి పోటీ పరీక్షలకు పంపిస్తే సిస్టం సావు దెబ్బ కొడుతుంది.
గడిచిన పదేళ్లలో 60 నుంచి 80 సార్లు పోటీ పరీక్షల ఎగ్జామ్స్ పేపర్ లీక్ అయిందంటే నేషనల్ టెస్టింగ్ అథారిటీ ఏం చేస్తున్నట్లని విద్యార్థుల తల్లిదండ్రులు నిలదీస్తున్నారు. నిజాయితీగా చదివే విద్యార్థి భయంతో బతుకుతుంటే చీటింగ్ నెట్వర్క్ లు విద్యార్థుల జీవితాలతో ఫుట్బాల్ ఆడుకుంటున్నాయి. సాల్వర్ గ్యాంగులు కోచింగ్ మాఫియా తో చేతులు కలిపి అధికారం అడ్డుపెట్టుకొని విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయి . దేశం నడిపే పెద్దలు ఈ సంక్షోభానికి సమాధానం చెప్పాలని విద్యార్థులు మద్దతు దారులు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద చేపట్టిన నిరసన రక్తసిక్తమైంది.

**విద్యార్థులు ఏం అడిగారు..?**

విద్యార్థులు ఈజీ ప్రశ్న పత్రాలు కావాలని అడగ లేదు.. తక్కువ మార్కులు వస్తే సీట్లు కావాలనే డిమాండ్ కాదు.. తమకు ప్రత్యేక సదుపాయాలు కావాలనే కోరలేదు .. విద్యార్థులు అడుగుతున్నదల్లా ఒక్కటే.. ఒక న్యాయమైన అవకాశం సమానమైన వేదిక నమ్మగలిగే సిస్టం, పారదర్శకమైన ఫలితాలు అడుగుతున్నారు.ఎంట్రన్స్ పరీక్షల్లో ఎప్పటికీ జరగకూడని తప్పులు పదే పదే జరుగుతున్నందుకు పరీక్ష రాసిన 12 లక్షల మంది విద్యార్థుల కడుపు మండిపోయి పాలకులను నిలదీసే ప్రయత్నం చేశారు. కష్టపడి చదువుకునే విద్యార్థుల జీవితాలతో ఆడుకునే చీటింగ్ గ్యాంగ్ నుంచి తమ భవిష్యత్తును కాపాడాలని దేశ పాలకుల ముందు నిరసన తెలిపే కార్యక్రమాన్ని పోలీస్ లు రక్తంతో తడిపేశారు. పాలకుల బాధ్యతను గుర్తు చేసినందుకు చితక బాది పంపిన ప్రభుత్వంపై సర్వోత్ర నిరసన వ్యక్తం అవుతుంది. నీటి పరీక్ష లీకేజీ కేవలం పరిపాలన సమస్య ఒకటే కాదు విద్యార్థుల మానసిక ఆరోగ్యం పై తీవ్రమైన ప్రభావం చూపిందని తల్లిదండ్రులు చెప్తున్నారు.

**17 మంది నీట్ విద్యార్థుల ఆత్మహత్య..!**

03 మే 2026 న నిర్వహించిన నీట్ ఎగ్జామ్ కు 20 లక్షల పైగా విద్యార్థులు ఎంట్రన్స్ పరీక్ష రాశారు. ప్రశ్న పత్రం లీక్ కావడంతో వందల పదిమంది విద్యార్థులు డిప్రెషన్ లోకి పోగా రితిక్ మిశ్రా యు పి, హన్సిక పాండే ఢిల్లీ, ప్రదీప్ మేఘల్ రాజస్థాన్, సిద్ధార్థ హెగ్డే గోవా, ఆకాంక్ష చతుర్వేది మధ్యప్రదేశ్, భాగ్యశ్రీ కర్ణాటక, రేణు మీనా రాజస్థాన్, ప్రియ కుమారి ఉత్తర ప్రదేశ్, ఉమేష్ మాలి రాజస్థాన్, అను కీర్తన తమిళనాడు, శివాని యాదవ్ ఉత్తర ప్రదేశ్, కహన్ పటేల్ గుజరాత్, రీమా బేగం అస్సాం, అవంతిక మధ్యప్రదేశ్, మైథిలి మహారాష్ట్ర, జతిన్ ఉత్తర ప్రదేశ్, గోపిక తమిళనాడు లీకేజీ 17 మంది విద్యార్థుల ప్రాణాలు తీసింది.

**ప్రకటనలకే పరిమితమైన ఎన్. ఈ. పి!**

నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ పదే పదే చెబుతున్న మాట ఒకటే.. విద్యార్థులపై పరీక్షల టెన్షన్ పూర్తిగా తగ్గిస్తామని విద్యార్థులకు ఈజీగా ఉండే ఎడ్యుకేషన్ సిస్టంలో తీసుకొస్తామని అరిగిపోయిన రికార్డుల ఇంకా చెబుతూనే ఉంది. పిల్లలపై ర్యాంకులో ప్రజలు పెట్టకుండా అన్ని రంగాల్లో చూస్తామని చెప్పిన మాటలు చేసిన ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయి. దేశ చరిత్రలో ఎప్పుడూ లేనంత భారీ సెక్యూరిటీ గన్మెన్ ల ను దాటుకుంటూ విద్యార్థులు పరీక్ష కేంద్రంలోకి వెళ్లాల్సి వస్తుంది. పరీక్ష అనేది దేశవ్యాప్తంగా ఒక సమస్యగా మారింది. ఎన్ ఈ పి చెప్పిన దాని ప్రకారం పరీక్షల టెన్షన్ తగ్గించడమే అయినప్పుడు పరీక్ష నిర్వహణ మిలిటరీ ఆపరేషన్ తలపించే విధంగా ఎందుకు మారింది.? సగటు భారతీయుడు అడుగుతున్న ప్రశ్నఇది.

**లీకేజీ వెనుక ఆర్గనైజ్డ్ మాఫియా.!**

ఎంట్రన్స్ పరీక్షల పేపర్ లీకేజ్ అనేది అక్కడక్కడ జరిగే చిన్న చిన్న తప్పులు కాదు దీని వెనకాల పెద్ద ప్లానింగ్ తో పని చేసే ఆర్గనైసేడ్ మాఫియా నెట్వర్క్ ఉంటుంది. సిస్టంలో ఎక్కడ లూ పోల్స్ ఉన్నాయో చూసి విద్యార్థుల ఆందోళనను తల్లిదండ్రుల ఆరాటాన్ని క్రిమినల్స్ క్యాష్ చేసుకుంటున్నారు. ఒక పరీక్ష విద్యార్థి జీవితాన్ని తన కుటుంబ పరిస్థితులను మార్చుతుందన్నప్పుడు అక్కడ డిమాండ్ డబ్బు



ప్రాధాన్యత అధికంగా ఉంటుంది. భారీ ప్రయోజనాలు ఉన్న చోటికి నేరగాళ్ల ముఠాలు తిష్టవేస్తాయి. ప్రస్తుతం ఎంట్రన్స్ పరీక్ష నిర్వహణ లా అండ్ ఆర్డర్ సమస్యగా మారింది. పదేపదే జరిగే పేపర్ లీకేజీ మన దేశ పరువును సిస్టమును బజారున పడేస్తుంది. పక్క దేశాల ముందు పలుచన చేస్తుంది. పోయిన పరువును విద్యార్థుల నమ్మకాన్ని తిరిగి తీసుకురావడం ఏ ప్రభుత్వానికైనా అత్యంత కష్టమైన పని అవుతుంది.

**ఏడంచల భద్రత నడుమ రి ఎంట్రెన్స్!**

2026 జూన్ 21న నిర్వహించిన నీటి ఎగ్జామినేషన్ మిలిటరీ ఆపరేషన్ తలపించింది. దేశ చరిత్రలో ఒక మెడికల్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ హై లెవెల్ సెక్యూరిటీ మధ్య జరగడం ఇదే ప్రథమం. ప్రశ్నపత్రాలను సరైన సమయానికి పరీక్షా కేంద్రాలకు పంపడం కోసం ఎయిర్ ఫోర్స్ హెలికాప్టర్లను వాడారు. విమానాల ద్వారా ప్రశ్నోపత్రాలను సెంటర్లకు చేర్చారు. ప్రశ్నపత్రాల రక్షణ కోసం సిఆర్పిఎఫ్ సిఐఎస్ఎఫ్ డబుల్ లెవెల్ సెక్యూరిటీ ఏర్పాటు చేశారు. దేశంలోని 16 నగరాల్లో లోకల్ పోలీస్ తో పాటు కేంద్ర బలగాలను కూడా కాపలా పెట్టారు. పరీక్ష కేంద్రాలన్నీ పూర్తి నిగాలోకి వెళ్లిపోయాయి. విద్యార్థులు లోపలికి వెళ్లే ముందే బయోమెట్రిక్ క్ ఫేస్ రికగ్నేషన్ చేశారు. హై క్వాలిటీ సీసీ కెమెరాలను ప్రతి మూల కవర్ చేసే విధంగా మార్చారు తప్పులు జరగకుండా చూడటానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కెమెరాలతో పాటు నిఘా ఏర్పాటు చేశారు. ఎన్నో తనిఖీలు అడుగడుగున పర్యవేక్షణ చేశారు ఒక ఎగ్జామ్ నిర్వహణ కోసం దేశమంతా హై సెక్యూరిటీ ప్లాన్ చేశారు. మెడికల్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ కోసం ఇంతటి భద్రత ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఎందుకు దాపరించాయి అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సిస్టం మీద పూర్తిగా నమ్మకం పోవడం వల్లనే ఇవన్నీ చేయాల్సి వచ్చిందని మేధావులు చెప్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం మీ కఠినమైన రూల్స్ను అందరూ హర్షిస్తారు. న్యాయంగా ఎగ్జామ్ రాయాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుకుంటారు.

**ఢిల్లీ వీధుల్లోదారి తప్పిన నిరసన..!**

కాక్రో జనతా పార్టీ ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీకేజీ నిరసిస్తూ చేసిన ధర్నా దారి తప్పిందని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. వేదిక పైన ఉన్న వక్తలు నీట్ పేపర్ అంశాన్ని పక్కన పెట్టి మతపరమైన అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ ఒక మతానికి చెందిన దేవుని ప్రార్థించడం పట్ల నిజమైన విద్యార్థులు నిరసన మధ్యలో నుంచే నిష్కరించారు. అక్షర జ్ఞానం లేని కనీసం 5వ తరగతి వరకు కూడా చదువుకోలేని వ్యక్తులు కూడా నీట్ పేపర్ లీకేజీ అంశానికి మద్దతు తెలపడం కోసం వందలాదిగా జంతర్ మంతర్ వద్దకు చేరుకున్నారు. వీరికి నీటి గురించి తెలియదు ఎంట్రెన్స్ పరీక్ష ఏంటో అవగాహన ఉండదు . ఒక్క మాటలో చెప్పాలంటే గోల చేసి అరవడమే అయ్యో వీళ్ళు ఎరుగుదురు అనే శ్రీ మాటను నిజం చేశారు. కొందరు విచక్షణ కూలిపోయి పోలీసుల పైకి విరుచుకుపడ్డారు. ఈ నేపథ్యంలో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులు నిరసన కార్యక్రమాన్ని దారిమళ్లించి ప్రభుత్వం పనిని సులభం చేశారనే చర్చ నడుస్తుంది. కాక్రోచ్ జనతా పార్టీకి చెందిన ముఖ్యులు ధర్నా సమయంలో వేదిక వద్ద లేకపోవడం ఉద్రిక్త పరిస్థితులను చూసి చల్లగా జారుకుని ఎక్కడో పిచ్చపాటి మాట్లాడుకుంటూ రెస్టారెంట్లో కూర్చోవడం సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారాయి. విద్యార్థులకు మద్దతు తెలపాలని వచ్చిన మద్దతు దారుల వీపులపై లాఠీలు విరిగాయి క్షతగాత్రులను చేశాయి. వీటన్నింటికీ పాలకులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.




## మూడో రోజూ నష్టాల్లోనే...

### మళ్లీ 24 వేల దిగువకు నిఫ్టీ




ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాలతో ముగిశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా క్రూడాయిల్ ధరలు భారీగా పెరగడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ముఖ్యంగా పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. దీంతో వరుసగా మూడో రోజూ సూచీలు నష్టాలు చవి చూశాయి. నిఫ్టీ 24 వేల మార్కు దిగువకు చేరింది. మూడు ట్రేడింగ్ సెషన్లలో కలిపి సెన్సెక్స్ 1400, నిఫ్టీ 300 పాయింట్లు చొప్పున నష్టపోయాయి. సెన్సెక్స్ ఉదయం 77,384.95 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,470.11) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. ఆపై మరింత నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 76,641.19 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 715.06 పాయింట్ల నష్టంతో 76,755.05 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 191.45 పాయింట్ల నష్టంతో 23,996.25 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.57గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండిగో, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. హిందుస్థాన్ యూనిలీవర్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, టైటాన్, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 94.74 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ధర ఔన్సు 4117.15 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

### విదేశీ పెట్టుబడుల

## నిబంధనలు సరళతరం



ముంబై: విదేశాల్లో భారతీయ కంపెనీల లిస్టింగ్‌తో పాటు విదేశీ పెట్టుబడుల నిబంధనలను మరింత సరళతరం చేసేలా రిజర్వ్ బ్యాంకు ముసాయిదాను రూపొందించింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విధానాలకు అనుగుణంగా రెగ్యులేటరీపరమైన సంక్లిష్టతను తగ్గించి, స్పష్టతనిచ్చేలా వివిధ ప్రొవిజన్లను క్రమబద్ధీకరించడం, వ్యాపారాల నిర్వహణను మరింత సులభతరం చేయడం, భవిష్యత్ పరిస్థితులకు తగ్గట్లుగా నియంత్రణ వ్యవస్థను తీర్చిదిద్దడం దీని లక్ష్యం. పీఎఫ్ఆర్‌డీఏ చట్ట నిబంధనలకు లోబడి ఎన్నారైలు కూడా నేషనల్ పెన్షన్ సిస్టమ్‌లో చేరవచ్చని పేర్కొంది. వీటిపై ఆగస్టు 31లోగా సంబంధిత వర్గాలు తమ అభిప్రాయాలను ఆర్‌బీఐకి సమర్పించాల్సి ఉంటుంది. విదేశీ మారక నిర్వహణ చట్ట నిబంధనలను సమీక్షిస్తామంటూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో ప్రకటించిన నేపథ్యంలో ఏర్పాటైన కమిటీ సిఫార్సుల మేరకు ఆర్‌బీఐ ఈ ముసాయిదా నిబంధనలను రూపొందించింది.

## భగ్గుమన్న చమురు ధరలు.. మళ్లీ 95 డాలర్ల పైకి



అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్ మళ్లీ 95 డాలర్లు దాటింది. గడిచిన ఆరు వారాల్లో ఈ మార్కు దాటడం ఇదే తొలిసారి. పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తడంతో ఈ పరిస్థితి నెలకొంది. అటు వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియేట్ రకం కూడా 88 డాలర్ల స్థాయికి చేరింది. ఇరాన్ మిలిటరీ స్థావరాలపై అమెరికా తన వైమానిక దాడులు కొనసాగిస్తుండడం.. ప్రతిగా ఇరాన్ కూడా బహ్రెయిన్, కువైట్, జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై దాడులకు పాల్పడుతోంది. దీనికి తోడు యెమెన్‌కు చెందిన హూతీ తిరుగుబాటుదారులు సౌదీకి సంబంధించిన నౌకలను దిగ్బంధనం చేస్తామని హెచ్చరించడంతో ఆయిల్ ట్యాంకర్లు తమ మార్గాలను మార్చుకుంటున్నాయి. దీంతో పశ్చిమాసియాలో ముడి చమురు రవాణాకు మరోసారి అంతరాయం ఏర్పడడంతో పాటు ద్రవ్యోల్బణ భయాలు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే మన మార్కెట్ సూచీలు నేడు భారీగా పతనమయ్యాయి.

## ద్రవ్యోల్బణ భయాలతో బంగారానికి మళ్లీ రెక్కలు

### రూ.1.50లక్షలకు చేరువ



దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. ఇరాన్‌పై అమెరికా దాడులు, ద్రవ్యోల్బణ భయాలతో ఈ లోహాలకు గిరాకీ ఏర్పడింది. దీంతో వీటి ధరలు పెరుగుతున్నాయి. హైదరాబాద్ విపణిలో బుధవారం ఉదయం 10 గ్రాముల మేలిమి 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,49,400కు చేరింది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.2వేలు పెరగింది. ఇక, కేజీ వెండి ధర రూ.2.32లక్షలు పలికింది.
మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో బంగారం ఆగస్టు ఫ్యూచర్స్ ధర 1.06శాతం పెరిగి రూ.1.44లక్షలుగా కొనసాగుతోంది. వెండి సెప్టెంబరు ఫ్యూచర్స్ ధర కూడా ఒక శాతం పెరిగి రూ.2.26లక్షలుగా కొనసాగుతోంది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు పుత్తడి ధర 4,129 డాలర్లు పలికింది. ఔన్సు వెండి ధర 60 డాలర్లు వద్ద ట్రేడ్ అవుతోంది.

**పేటీఎం.. బోనస్ షేర్ల జారీ లేదు**

ఇరాన్‌తో ఇప్పట్లో చర్చలు ఉండవని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. మరోవైపు, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో చమురు ధరలు భగ్గుమంటున్నాయి. ఫలితంగా ద్రవ్యోల్బణ భయాలు నెలకొన్నాయి. ఈ అనిశ్చిత పరిస్థితుల్లో బంగారం, వెండిలో పెట్టుబడులు శ్రేయస్కరమని మదుపర్లు భావిస్తున్నారు. దీంతో వీటికి డిమాండ్ ఏర్పడింది.

### వచ్చే ఏడాది స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్ ధరలు

## మరింత పైకి!



మెమొరీ చిప్‌ల కొరత, విడిభాగాల తయారీ ఖర్చు కారణంగా గ్లోబల్ టెక్ కంపెనీలు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమంలోనే యాపిల్, శాంసంగ్ వంటి పలు కంపెనీలు స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్ ధరలను పెంచాయి. ఈ నేపథ్యంలోనే ప్రపంచంలోనే నంబర్‌వన్ చిప్ తయారీ సంస్థ తైవాన్ సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ (టీఎస్ఎంసీ) చిప్ ధరలను పెంచేందుకు సిద్ధమవుతోంది. వచ్చే ఏడాదిలో వీటి ధరలను 10 శాతం మేర పెంచే యోచనలో ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. దీంతో రానున్న రోజుల్లో స్మార్ట్‌ఫోన్లు, లాప్‌టాప్‌లు, ఏఐ పరికరాల ధరలు ఆకాశన్ని తాకుతాయనడంలో సందేహం లేదు. 6 ఎన్ఎం కంటే తక్కువ ఉండే చిప్‌లతో పాటు 28ఎన్ఎం, 16ఎన్ఎం, 12ఎన్ఎం చిప్‌లు ధరలూ పెరగనున్నాయి. దీంతో వచ్చే ఏడాది కూడా స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు ధరలకు రెక్కలొచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

## ఐఫోన్ ధరల పెంపు

### ఐఫోన్ 17పై ₹12వేలు పెంపు?

యాపిల్ ఐఫోన్ కొందామని చూస్తున్నవారికి చేదువార్త ఐఫోన్ 17పై ధరలు పెంచేందుకు యాపిల్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. మెమొరీ చిప్‌ల ధరల పెరుగుదల వల్ల ఐప్యాడ్స్, మ్యాక్స్, మ్యాక్‌బుక్స్ ధరలను ఇటీవలే భారీగా పెంచింది. ఐఫోన్ ధరల పెంపు మాత్రం చేపట్టలేదు. ఆగస్టు తొలి వారం నుంచి ఐఫోన్ 17 ధరలు భారీగా పెరగనున్నాయని సమాచారం. ఈ మేరకు టిప్‌స్టర్ అభిషేక్ యాదవ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ధరల పెంపు గురించి ఇప్పటికే ఐప్లానెట్ డీలర్లకు యాపిల్ సమాచారం ఇచ్చిందని పేర్కొన్నారు. యాపిల్ ఐఫోన్ 17 ప్రస్తుతం ప్రారంభ ధర రూ.82,990 ఉండగా.. ఆగస్టు తొలివారంలో రూ.94,990కు చేరనుందని సమాచారం. అంటే ఏకంగా రూ.12 వేలు పెరగనుందని అభిషేక్ పేర్కొన్నారు. ఐఫోన్17 ప్రో, 17 ప్రో మాక్స్‌ల ధరలు కూడా పెంచనున్నట్లు తెలుస్తోంది. అయితే, ఎంతమేర పెంచబోయేదీ వెల్లడించలేదు. కాగా, ఇప్పటికే జపాన్‌లో ఐఫోన్ ధరలను 11.3 శాతం మేర యాపిల్ పెంచేసింది. దీంతో భారత్ మార్కెట్‌లోనూ ధరల పెంపు ఉండబోతోందన్న వార్తలకు ఇది బలం చేకూర్చింది.




### అదరగొట్టిన

## ఎటర్నల్

### లాభం నాలుగింతలు..

### ₹20,211 కోట్ల ఆదాయం

జొమాటో, బ్లింకిట్ పేరిట ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ వ్యాపారాలు నిర్వహిస్తున్న ఎటర్నల్ త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో నాలుగింతలకుపైగా నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.25 కోట్లుగా ఉన్న లాభం.. ఈ ఏడాది రూ.92 కోట్లకు పెరిగింది. ఈ మేరకు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. కార్యకలాపాల వల్ల వచ్చే ఆదాయం సైతం గతేడాదితో పోలిస్తే రూ.7,167 కోట్ల నుంచి రూ.20,211 కోట్లకు పెరిగింది. అదే సమయంలో ఖర్చులు రూ. 7,433 కోట్ల నుంచి రూ.20,314 కోట్లకు పెరిగాయి. ఫుడ్ డెలివరీ విభాగం జొమాటో నెట్ ఆర్డర్ వాల్యూ (NOV) ఏడాది ప్రాతిపదికన 20 శాతం వృద్ధి చెంది రూ.10,769 కోట్లకు చేరింది. క్విక్ కామర్స్ బ్లింకిట్ నెట్ ఆర్డర్ వాల్యూ 86 శాతం పెరిగి రూ.17,132 కోట్లకు చేరింది. పేటీఎం నుంచి కొనుగోలు చేసిన టికెటింగ్ ప్లాట్‌ఫామ్ డిస్ట్రిక్ట్ నెట్ ఆర్డర్ వాల్యూ 60 శాతం పెరిగి రూ.3,218 కోట్లుగా ఉంది. ఈ ఏడాది తొలి త్రైమాసిక ఫలితాలు సానుకూలంగానే ఉన్నాయని ఎటర్నల్ సీఈఓ, బ్లింకింట్ వ్యవస్థాపకుడు అల్బిందర్ సింగ్ ధింద్సా అభిప్రాయపడ్డారు. నెట్ ఆర్డర్ వాల్యూ ఆశించిన స్థాయిలో వృద్ధి చెందిందని తెలిపారు. కంపెనీ దీర్ఘకాలిక వృద్ధి, వ్యాపారం, ఉత్పత్తుల విస్తరణపై దృష్టి సారించనున్నామని తెలిపారు. క్విక్ కామర్స్ విభాగంలో గడిచిన నాలుగేళ్లలో రూ.3వేల కోట్ల పెట్టుబడులు పెట్టామని, రాబోయే రోజుల్లో తమ వ్యాపారాన్ని మరింత విస్తరిస్తామన్నారు. అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితుల వల్ల ముడి సరకుల ధరలు పెరిగి, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు ఎదురైనా ఉత్పత్తి, సరఫరాపై ఎలాంటి ప్రభావం చూపలేదని చెప్పారు.



## క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం



**వికారాబాద్, జూలై 22(నినాదం ):** తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, హైదరాబాద్, 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను కుట్టు మిషన్, చిరు వ్యాపారం, ఇ - బైక్, ఇ - స్కూటీ, మోటార్ బైక్ రంగాల కోసం అర్హులైన క్రైస్తవ మైనారిటీల నుండి ఆన్లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి ఎమ్. సుధీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుట్టు మిషన్, చిరు వ్యాపార యూనిట్లకు 21 నుండి 55 సంవత్సరాల వయస్సు, ఇ - బైక్, ఇ - స్కూటీ, మోటార్ బైక్ యూనిట్లకు 21 నుండి 50 సంవత్సరాల వయస్సు ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాలలో రూ. 2 లక్షల లోపు, గ్రామీణ ప్రాంతాలలో రూ. 1,5 లోపు ఉండాలి. ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు పొడిగించబడిన గడువు తేదీ అయిన 19 జూలై 26 నుండి 31 జూలై 2026 సాయంత్రం 5 గంటల వరకు ఉన్నట్లు చెప్పారు. https://tgobmms.cgg.gov.in/ వెబ్సైట్ ద్వారా ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం దరఖాస్తుదారులు 04023391067లో సంప్రదించవచ్చని లేదా https:// tgcmfc.in/వెబ్ సైట్ ను సందర్శించాలని జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన నిజప్రతులను సంబంధిత జిల్లా. మైనారిటీస్ సంక్షేమ శాఖ వికారాబాద్ ఎస్ -16లో గల కార్యాలయంలో అందజేయగలరని తెలిపారు.

## ఎక్వాయిపల్లిలో భూసేకరణ

### పరిశీలించిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి



**ఆమనగల్లు, జూలై 22(నినాదం):** కడ్తాల మండలం ఎక్వాయిపల్లి గ్రామంలో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసం భూసేకరణ సమస్యపై భూస్వాములు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. తమ భూములు, జీవనాధారంపై ప్రభావం పడకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే, కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లికి స్వయంగా వెళ్లి ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలించారు. రైతుల సమస్యలను స్వయంగా తెలుసుకుని, సంబంధిత అధికారులతో మాట్లాడారు. భూస్వాములకు న్యాయం జరిగేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, అభివృద్ధి పనులతో పాటు రైతుల ప్రయోజనాలను కూడా పరిరక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్,బ్లాక్ అధ్యక్షులు యాట నర్సింహా, సర్పంచ్ కరుణాకర్, నాయకులు రవికాంత్, సుమన్, యాదయ్య,తదితరులు పాల్గొన్నారు,

### ఆర్టీసీ అధికారుల పని తీరుపై

## మండిపడుతున్న ప్రయాణికులు




**సిద్ధిపేట బ్యూరో, జూలై 22 (నినాదం):** ప్రజా సౌకర్యమే ఆర్టీసీ లక్ష్యం అంటూ ఆర్భాటాలు తప్ప అమలుకు నోచుకోవడం లేదంటూ ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. వివరాలలోకి వెళితే సిద్ధిపేట, దుబ్బాక డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు వర్గల్ మండలం గౌరారం స్టేజి వద్ద నిలుపకుండా వెళ్ళడం తో ప్రయాణికులు నానా అవస్థలు పడవలసిన దుస్థితి నెలకొందంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గౌరారం స్టేజి వద్ద ఎక్స్ప్రెస్ బస్ స్టాప్ ఉన్నప్పటికీ ఆర్టీసీ సిబ్బంది ఆపకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రజా రవాణా ప్రజా సేవయే లక్ష్యం అనే నినాదంతో సేవలు అందిస్తున్న తెలంగాణ ఆర్టీసీ, ప్రజల అవసరాలకు అనుగుణంగా వ్యవహరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. గౌరారం స్టేజ్ వద్ద బస్సులు నిలపకపోవడంతో ప్రయాణికులు ప్రజ్ఞాపూర్ వద్ద దిగి, అక్కడి నుంచి మరో బస్సు లేదా ప్రైవేట్ వాహనాల్లో వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందంటూ దీంతో అదనపు ఖర్చుతో పాటు విలువైన సమయం వృధా అవుతుందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రజలు ప్రయాణించేందుకు సౌకర్యం కల్పించడమే ఆర్టీసీ ప్రధాన బాధ్యత అని అధికారికంగా ఉన్న స్టేజ్ వద్ద బస్సులు ఆగకుండా ముందుకు వెళ్లడం వల్ల ప్రయాణికులు ప్రైవేట్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారని , ఒకవైపు ప్రజలకు ఇబ్బందులు కలిగించడమే కాకుండా, మరోవైపు ఆర్టీసీకి కూడా ఆదాయ నష్టాన్ని తెచ్చిపెడుతోందని అభిప్రాయపడుతున్నారు. ప్రజా అవసరాలే ప్రాధాన్యంగా భావించి, దుబ్బాక , సిద్దిపేట డిపో అధికారులు వెంటనే స్పందించి గౌరారం స్టేజ్ వద్ద అన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులు తప్పనిసరిగా ఆగేలా డ్రైవర్లు, కండక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రయాణికుల అవసరాలను గుర్తించి గౌరారం స్టేజ్ సమస్యను వెంటనే పరిష్కరిస్తే ప్రజల్లో ఆర్టీసీపై మరింత విశ్వాసం పెరుగుతుందని, ప్రజా సౌకర్యమే నిజమైన ప్రజాసేవ అనే సందేశాన్ని తెలంగాణ ఆర్టీసీ ఆచరణలో చూపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**డిపో మేనేజర్ వివరణ..**
ప్రయాణికుల నుండి వెలువడుతున్న విమర్శలు, అభిప్రాయాలపై వివరణ కోసం సిద్ధిపేట, దుబ్బాక డిపో మేనేజర్ కు నినాదం బ్యూరో ఫోన్ చేయగా ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.

## కార్యకర్తలకు ఎల్లపుడు అండగా ఉంటా..

### ఎమ్మెల్యే కె.పి వివేకానంద్



**కుత్బుల్లాపూర్ జూలై 22 (నినాదం):** చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఎల్ఐసి రాజు చిప్ప రమేష్ అనారోగ్యం తో ఉన్నారని స్థానిక నాయకుల ద్వారా తెలిసిన వెంటనే ఎమ్మెల్యే కేపీ వివేకానంద వారి ఇంటికి వెళ్లి పరామర్శించి వారికీ వారి కుటుంబానికి ఎల్లపుడు మేము అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ రఫీ, సీనియర్ నాయకులు సాంబయ్య, ఉప్పలయ్య,సామ్రాట్,లక్ష్మన్,చందు, శ్రీధర్, ప్రభాకర్,జహంగీర్,బాలు నేత, యాదగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ఫారం నింపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**కొడంగల్, జులై 22(నినాదం):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ పట్టణంలోని తన నివాసంలో ఎస్ ఐ ఆర్ ఫారం పై తన ఓటు వివరాలు నమోదు చేసి, బిఎల్ ఓ కు అందజేశారు. ఈకార్యక్రమంలో ముఖ్యమంత్రి తో మున్సిపల్ ఛైర్మన్ నందారం ప్రశాంత్, పాటు పార్టీ సీనియర్ నాయకులు యూసుఫ్,జగదీశ్వర్ రెడ్డి, ముద్దప్ప,ప్రభుత్వ అధికారులు ఉన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులు కృత్రిమమేధను ఉపయోగించుకోవాలి

- జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్





**మేడ్చల్ కలెక్టరేట్, జూలై 22 (నినాదం):** ప్రభుత్వ ఉద్యోగులు రోజువారి విధులలో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు) ను ఉపయోగించి ప్రభుత్వ పాలనలో ఏఐ సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించడం, పనిని సులభ తరం చేయడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు తక్కువ సమయంలో ఎక్కువ పని చేయడం, పనిలో తప్పులు దొర్లకుండా చూడ డం, పనిని సులభతరం చేయడానికి ఎఐ ఎంతగానో ఉపయోగపడుతుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులకు, కలెక్టరేట్ సిబ్బందికి ఏర్పాటు చేసిన ఎఐ శిక్షణ కార్యకమానికి డిఆర్ఓ మాలతితో కలిసి అదనపు కలెక్టర్ హాజరై నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ టి ఫైబర్ వారి ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న ఈ ఏఐ శిక్షణ కార్యక్రమం అందరికి ఎంతగానో ఉపయోగపడుతుందనే అభిప్రాయంతో జిల్లా కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయించడం చాలా సంతోష కరమన్నారు. మారుతున్న సాంకేతికతకనుగుణంగా అధికారులు సిబ్బంది అందరు తమ తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతోగానో తోడ్పడుతాయన్నారు. మొదటి పారిశ్రామిక విప్లవం స్టీమ్ ఇంజన్, రెండవ పారిశ్రామిక విప్లవం విద్యుత్ ఆవిష్కరణ, మూడవది డిజిటలైజేషన్---అంటే కంప్యూటర్ ఆవిష్కరణ, ఇక నాలుగవది ప్రస్తుత యుగం ఏఐ విప్లవం--- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు), అందులో భాగంగా చాట్‌జీపీటీ (చాట్ జిపిటి) వంటి అల ఏఐ టూల్స్ అన్ని రంగాల్లోనూ విస్తరిస్తున్నాయన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా గతంలో పనులు ఎలా జరిగాయో అధ్యయనం చేసి, తదుపరి చర్యలను ముందుగానే ఊహించి, తదనుగుణంగా ఆఫీస్ ఫైళ్ల నిర్వహణ, ఆఫీసుల్లో ప్రతిరోజూ డ్రాఫ్టింగ్, నోటింగ్ వంటి పనులు, ఫైల్ మూవ్‌మెంట్ వంటి పనులను సులభతరం చేస్తుందన్నారు. డ్రాఫ్టింగ్ లలో జరిగే వ్యాకరణ దోషాల లేదా స్పెల్లింగ్ తప్పులనుఈ ఏఐ ద్వారా సరిచేసుకోవచ్చాన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి పోస్టర్లు, పాంప్లెట్లు, లేదా ఫ్లెక్సీ బ్యానర్లు డిజైన్ చేయడానికి ఈ టూల్స్ అద్భుతంగా పనిచేస్తాయన్నారు. ూ× ఒక సహాయకారి మాత్రమే కాని ప్రత్యామ్నాయం కాదని ఏఐ టూల్స్ ఎంతో ఉపయోగపడినప్పటికీ, వాటిని 100% గుడ్డిగా నమ్మకూడదని తెలిపారు. ఏఐ ఇచ్చిన సమాచారాన్ని మీరు తప్పనిసరిగా ఒకసారి సరిచూసుకోవాలని ఏఐ టూల్స్ ఇంకా అభివృద్ధి చెందుతున్న దశలోనే ఉన్నాయన్నారు. మానవ మేధస్సును మించిన ఆర్టిఫిషియల్ టూల్ కానీ, యంత్రం కానీ ప్రపంచంలో ఏదీ లేదని స్పష్టం చేసారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది పనిని సులభతరం చేసే ఒక సహాయకారి మాత్రమే, ప్రభుత్వంలో తుది నిర్ణయం ఎప్పుడూ ఒక అధికారి లేదా ఉద్యోగి మాత్రమే తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాలనలో ఏఐ సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించడం, పనిని సులభతరం చేయడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం వంటి అంశాలపై వారికి శిక్షణ ఇవ్వడం జరిగింది. డేటా విశ్లేషణ, నివేదికల తయారీ, లేఖల ముసాయిదా, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం మరియు రోజువారీ కార్యాలయ పనుల్లో ఏఐని ఎలా ఉపయోగించాలో శిక్షకులు ప్రత్యక్షంగా ప్రదర్శించారు. అధికారులు మరియు సిబ్బంది అనేక సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన 'సూపర్ టీచర్' బృందానికి, వాసుదేవ్, రాజుకు అదనపు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లోని అన్ని శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడితే సహించేది లేదు

పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
విద్యార్థుల హక్కుల కోసం కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుంది
ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



**ఆమనగల్లు, జూలై 22(నినాదం):** ఢిల్లీలో నిట్ పరీక్ష వివాదం, విద్యార్థులపై జరిగిన పోలీసుల లాఠీచార్జికి వ్యతిరేకంగా, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం భారీ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లి అంబేద్కర్ చౌరస్తా వద్ద కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ధర్నా చేపట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కడ్తాల్ నిరసనలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ నీట్ పరీక్షను సక్రమంగా నిర్వహించలేని కేంద్ర ప్రభుత్వం తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఆందోళన చేస్తున్న విద్యార్థులపై అమానుషంగా వ్యవహరించిందని విమర్శించారు. విద్యార్థినులను రోడ్లపై పరుగెత్తించి రక్తం వచ్చేలా కొట్టడం అత్యంత దారుణమని, ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే భారతదేశానికి ఇది తలవంపులు తెచ్చే ఘటన అని అన్నారు. నీట్ పేపర్ లీక్ కారణంగా సుమారు 25 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, ఈ ఘటనల నేపథ్యంలో 21 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ సంఘటనలకు బాధ్యులు ఎవరో గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై విరిగిన ప్రతి లాఠీకి, చిందిన ప్రతి రక్తపు చుక్కకు దేశ ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు రూపంలో సమాధానం చెబుతారని ఎమ్మెల్యే హెచ్చరించారు. విద్యార్థులపై జరిగిన పోలీసుల దాష్టీకం దేశ ప్రజలను తీవ్రంగా కలచివేసిందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నీట్ పరీక్షలో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీ వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం ఎంతో కష్టపడి పరీక్షలు రాస్తున్నారని, అలాంటి పరీక్షల్లో అక్రమాలు చోటుచేసుకుంటే వారి జీవితాలు తీవ్రంగా ప్రభావితమవుతాయని అన్నారు. విద్యార్థులు తమ న్యాయమైన సమస్యలపై ప్రశాంతంగా నిరసన వ్యక్తం చేస్తే వారిపై లాఠీఛార్జీ చేయడం, పోలీసుల బలప్రయోగానికి పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఎమ్మెల్యే అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిపై అణచివేత చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీ, పరీక్షల నిర్వహణలో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ వారి పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం కల్పించిందని, ఆ హక్కును కాలరాయడానికి ఎవరూ ప్రయత్నించకూడదని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు, పరీక్షా వ్యవస్థలో పారదర్శకతను తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. నీట్ పరీక్షపై విద్యార్థుల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయడంతో పాటు, ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. దేశ యువతకు అండగా కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని, విద్యార్థుల హక్కుల కోసం అవసరమైతే మరిన్ని ప్రజా ఉద్యమాలు చేపడతామని ఆయన తెలిపారు.. ఈ కార్యక్రమం లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులపై లాఠీచార్జి అప్రజాస్వామికం

### మాజీఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



**అల్వాల్, జూలై 22( నినాదం):** ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులు. యువతపై పోలీసులు లాటి చార్జి చేయడం. భాషవాయువు ప్రయోగించడంఅప్రజస్వామికంఅని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పేర్కొన్నారు. ఆందోళన కార్యక్రమంలో లాటి చార్జిని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపుమేరకు గోల్నాక మీసేవ నుండి ఓల్డ్ ఆల్వాల్ ఇందిరా గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగాఆందోళన చేపట్టినమల్కాజిగిరి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు. నీట్ ప్రశ్న పత్రంలీకేజీ,విద్యార్థులపై లాటి చార్జీకి బాధ్యత వహిస్తూకేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాచేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థులపై జరిగిన దాడిని ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు. నీట్ పేపర్ లీకేజీ ఘటనపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరినియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు అల్వాల్ సర్కిల్ ఆరు డివిజన్ల ప్రెసిడెంట్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. మోడీ దిష్టిబొమ్మ తగలబెట్టే ప్రయత్నంలో పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట లక్ష్మీకాంతరెడ్డి, వెంకటేష్ యాదవ్, నిమ్మ అశోక్ రెడ్డి, కేబుల్ శేఖర్, కృష్ణ గౌడ్ సూర్య కిరణ్,మల్లె శివ, సూర్య కిరణ్, దేవేందర్, కృష్ణ గౌడ్ భాస్కర్, భబిత, వీనస్ మేరీ, లావణ్య, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థినులను కొట్టడం అత్యంత దారుణం

- విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భాధ్యత వహిస్తూ తక్షణమే రాజీనామా చేయాలి
- పత్య నాయక్, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అవ్వారి శివలింగం



**ఆమనగల్లు, జూలై 22 (నినాదం):** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ, నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఢిల్లీలో ఆందోళన చేపట్టిన విద్యార్థులపై జరిగిన పోలీసుల లాఠీచార్జ్ ను ఖండిస్తూ ఆమనగల్లు బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ రాహుల్ గాంధీ అరెస్టును తీవ్రంగా ఖండించారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులతో కాంగ్రెస్ నాయకులు ప్రతిఘటించడంతో రాజీవ్ గాంధీ చౌరస్తా వద్ద తోపులాట చోటుచేసుకుని ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. అనంతరం పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. విద్యార్థులపై విరిగిన ప్రతి లాఠీకి, చిందిన ప్రతి రక్తపు చుక్కకు దేశ ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా సమాధానం చెబుతారని మున్సిపల్ ఛైర్మన్ పత్య నాయక్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మున్సిపల్ ఛైర్మన్ పత్య నాయక్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్య విలువలపై దాడి విమర్శించారు. రాజకీయ కక్షసాధింపుతోనే కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకుంటోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీపతి శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ మండ్లి రాములు, కో-ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, మాజీ ఎంపీపీ అనిత విజయ్, ఒగ్గు మహేష్, సీనియర్ నాయకుడు ఖాదర్ ఖాద్రి, కాలే మల్లయ్య, రాగ్య నాయక్, షర్ఫుద్దీన్, శ్రీపాల్, ఎంగలి ప్రసాద్, అబ్దుల్ అలీమ్,సూదిని కొండల్ రెడ్డి, కండె సాయి, శ్రీధర్ నాయక్, వార్డు సభ్యుడు జగన్, రాజు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్యూఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, గౌస్, కృష్ణ యాదవ్, సురేష్ నాయక్, దేవరశెట్టి మహేష్, అంజాత్, నాజర్, శీను నాయక్, రహిమ్, కృష్ణకుమార్ గౌడ్, రఫీ, శివ, గోపాల్, మాల్య, పత్య పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బండబస్తీలోమాజీ కార్పొరేటర్ పాదయాత్ర



**అల్వాల్, జూలై 22(నినాదం):** అల్వాల్ డివిజన్ బండ బస్తీ.రామాలయంలోమాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి కార్యకర్తలతో కలిసిపరిసర ప్రాంతాలు ఇంటింటికి తిరుగుతూ సమస్యలు. సర్ ప్రక్రియను అవగాహన కల్పిస్తూపాదయాత్ర నిర్వహించారు. ప్రతి ఒక్కరూ సర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరు ఓటరు నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అరుణ్, ప్రేమ్ కుమార్, రాజేందర్, లింగారెడ్డి, సాజిద్, గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్కుస్థలాన్ని కాపాడాలి



**అల్వాల్, జూలై 22 (నినాదం) :** అల్వాల్ సర్కిల్ జిహెచ్ఎంసి పరిధిలోనిఓల్డ్ ఆల్వాల్ లోని భీమ్ రావు కాలనీలో కాలనీకి సంబంధించినబావినీ నకిలీ పత్రాలను సృష్టించి భవన నిర్మాణ పనులు చేపడుతున్న సందర్భంగా మైనంపల్లి ఆదేశానుసారం మల్కాజ్గిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్‌తోట లక్ష్మీకాంతరెడ్డి కార్యకర్తలతో కలిసి స్థలము పరిశీలించారు. ఈ స్థలము భూమినీ బస్తీవాసులకు చెందేవిధంగా పనులను ఆపేశారు. కాలనీవారికి అండగాఉంటాననివారికికావలసిన పార్కు కోసం ప్రయత్నాలు చేస్తానని తోట లక్ష్మీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. అధికారులు ఈ స్థలము కాలనీ వాసులకు పార్కుస్థలము కేటాయించేందుకు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నాయకులు పాల్గొన్నారు.

# సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలి

- పీసీఆర్, పీఓఏ చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి బ్యూరో, జూలై 22 (నినాదం):** పీసీఆర్, పీఓఏ చట్టాలను జిల్లాలో మరింత సమర్థవంతంగా అమలు చేసి, బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం, పీసీఆర్, పీఓఏ చట్టాల అమలుపై సమీక్షా సమావేశం బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజంలో చోటుచేసుకునే ఎస్సీ, ఎస్టీలపై వివక్ష, అట్రాసిటీ ఘటనలను అత్యంత బాధ్యతాయుతంగా పరిగణించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వెలుగులోకి రాని వాస్తవ ఘటనలను రెవెన్యూ, పోలీసు అధికారులు గుర్తించి, వాస్తవమైన ప్రతి కేసును నిబంధనల ప్రకారం నమోదు చేయాలని సూచించారు. బాధితులకు చట్టప్రకారం అందాల్సిన రక్షణ, సహాయం, ఆర్థిక ఉపశమనం, న్యాయం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి నెల 30వ తేదీన సివిల్ రైట్స్ డే నిర్వహించాలని, ప్రతి రెవెన్యూ డివిజన్‌లో సబ్ డివిజనల్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆర్డీవోలకు ఆదేశించారు. 2022 నుండి ఇప్పటివరకు జిల్లాలో నమోదైన 144 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు ఆర్థిక ఉపశమనం కింద సుమారు రూ. 2.58 కోట్ల నిధులు అవసరమవగా, ఇప్పటివరకు రూ. 1.74 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అందులో 37 మంది బాధితులకు రూ. 68,87,500/- విడుదల చేసినట్లు, మిగిలిన అర్హులైన బాధితులకు ఆర్థిక ఉపశమనం అందజేసే ప్రక్రియ కొనసాగుతున్నట్లు వివరించారు. సమావేశంలో పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిపై జిల్లా కలెక్టర్ డీఎస్పీలను కేసుల వారీగా వివరాలు అడిగి తెలుసుకుని, దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా అధికారులు పనిచేయాలని సూచించారు. దర్యాప్తును నిర్ణీత గడువులో పూర్తి చేసి చార్జిషీట్లు దాఖలు చేయాలని, గ్రామ, మండల స్థాయి కమిటీల ద్వారా అర్హులైన వారికి కుల ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందజేయాలని అన్నారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, 2026 జూన్ నెలాఖరు వరకు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద 31 కేసులు నమోదయ్యాయని తెలిపారు.

అందులో 12 కేసులు దర్యాప్తు దశలో ఉండగా, 19 కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేసినట్లు తెలిపారు. ప్రతి కేసులో బాధితులకు పూర్తి రక్షణ కల్పిస్తూ, చట్టప్రకారం సత్వర న్యాయం అందేలా పోలీసు శాఖ చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి జగదీష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణ, ఏసీపీలు, డీఎస్పీలు, రెవెన్యూ డివిజనల్ అధికారులు రాజేందర్, దేవుజ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు మంత్రి వివేక్ శంకుస్థాపన



**పటాన్చెరు, జూలై 22 (నినాదం):** నియోజకవర్గంలోని బీరంగూడ, అమీన్‌పూర్ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 16.53 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు డ భూగర్భ శాస్త్ర శాఖల మంత్రి శ్రీ గడ్డం వివేక్ వెంకటస్వామి శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో బీరంగూడ (వార్డు--270), అమీన్‌పూర్ (వార్డు--271) ప్రాంతాల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ), వర్షపు నీటి కాలువలు, స్మశానవాటిక అభివృద్ధి, సెంట్రల్ మీడియన్ నిర్మాణం తదితర మౌలిక సదుపాయాల పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలోని అమీన్‌పూర్ సర్కిల్--47లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీజీ ఐ ఐ సి ఛైర్మన్ డీసీసీ ప్రెసిడెంట్ నిర్మల జగ్గారెడ్డి, పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ మంత్రి గారితో కలిసి పాల్గొన్నారు.

# విద్యార్థులపై లాఠీచార్జి ప్రజాస్వామ్యానికి మచ్చ



## మంత్రి పొన్నం ప్రభాకర్

నీట్ పేపర్ లీకేజీపై పార్లమెంట్‌లో చర్చ జరగాలి..
ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి
హుస్నాబాద్‌లో కాంగ్రెస్ మహాధర్నా..
రాహుల్ గాంధీ సహా అగ్రనేతల అరెస్టులను ఖండించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ జూలై 22 (నినాదం):** హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మహాధర్నా నిర్వహించింది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన లాఠీచార్జిని నిరసిస్తూ లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీతో పాటు కాంగ్రెస్ ఎంపీలు చేపట్టిన శాంతియుత నిరసన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఈ మహాధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసనకారులు చేతుల్లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నీట్ పేపర్ లీకేజీకి బాధ్యులైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, నీట్ అంశంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ నిర్వహించాలని, పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర హోంమంత్రి దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని, నీట్ పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు తక్షణ ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జిపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, విద్యార్థులపై జరిగిన దాడిని ఖండిస్తూ వారికి మద్దతుగా రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీతో పాటు కాంగ్రెస్ ఎంపీలు శాంతియుతంగా నిరసన తెలియజేస్తే వారిని నిరంకుశంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. మొన్న జరిగిన విద్యార్థుల నిరసన స్వాతంత్ర్య ఉద్యమం లోని సత్యాగ్రహాన్ని గుర్తు చేసిందని, ఎలాంటి హింసకు తావులేకుండా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ఈ ఘటనలో అనేక మంది విద్యార్థులు గాయపడినా కేంద్ర ప్రభుత్వం కనీసం సంఘీభావం ప్రకటించలేదని, హోంమంత్రి ఇప్పటివరకు స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా "ధాత్రోకి గుంజ్" కార్యక్రమం ద్వారా రాహుల్ గాంధీ విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటూ వారి గొంతుకగా నిలుస్తున్నారని, విద్యా వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతూ యువతకు అండగా ఉంటున్నారని తెలిపారు. అలాంటి నాయకులు శాంతియుతంగా నిరసన తెలియజేస్తే అక్రమ అరెస్టులు చేయడం కేంద్ర ప్రభుత్వ అహంకార వైఖరికి నిదర్శనమని అన్నారు. నీట్ పేపర్ లీకేజీ దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చిందని, దీనిపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరిపి నిజానిజాలను దేశ ప్రజలకు వెల్లడించాలని, ఈ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, లీకేజీ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే లాఠీ చార్జికి బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేసి గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ప్రజాస్వామ్య హక్కులను అణచివేసే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లో సహించబోదని, స్వాతంత్ర్యం కోసం పోరాడిన పార్టీగా రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను రాజకీయ కోణంలో కాకుండా మానవీయ దృక్పథంతో పరిష్కరించాలని, దేశ యువత భవిష్యత్తును కాపాడే నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహాధర్నాలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగు తుందని స్పష్టం చేశారు.

## జలసిరి విజయమే గ్రామాభివృద్ధికి బాట

వెల్లుల్లలో పనుల పరిశీలన చేసిన డీఆర్‌డీవో రఘువరన్
నీటి సంరక్షణ పనులపై అధికారులకు దిశానిర్దేశం



**మెట్ పల్లి, జూలై 22 (నినాదం):** గ్రామాల్లో జలసిరి కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయ వంతం చేసి, నీటి సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని డీఆర్‌డీవో రఘువరన్ అన్నారు. బుధ వారం మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామపంచాయ తీలో జలసిరి కార్యక్రమంలో భాగంగా చేపడు తున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఇంటింటి ఇంకుడు గుంతల వద్ద మొక్కలు వేయ డం, గ్రామంలోని అంతర్గత రహదారుల వెంట మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయడం, ప్రజలకు మొక్కలను పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామపం చాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావే శంలో పాల్గొని జలసిరి పనుల పురోగతిపై సమీక్షిం చారు. వర్షపు నీటిని ఒడిసిపట్టేలా ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు, గ్రామాల్లో నీటి సంరక్షణ పనులు చేపట్టా లని సూచించారు. అనంతరం మెట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లతో సమావేశం నిర్వహించారు. జలసిరి కార్యక్రమం లక్ష్యాలు, వాటర్ కన్జర్వేషన్ పనుల ప్రాధాన్యం, అమలు విధానంపై సమగ్రంగా వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాల పెంపునకు దోహదపడే పనులను నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వెల్లుల్ల గ్రామ సర్పంచ్ గూడూరు తిరుపతి, పంచాయతీ కార్యదర్శి నారాయణ, ఎంపీడీవో మహేందర్, ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్ సుమన్, ఈజీఎస్ ఈసీ లక్ష్మయ్య, వార్డు సభ్యులు భూమేష్, ముబీన్, వందన, సువర్ణ, ఐకేపీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'ఎల్‌నినో' సన్నాహక సమీక్ష సమావేశం

## ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



**హుస్నాబాద్, జూలై 22( నినాదం):** ఈనెల 23వ తేదీ గురువారం హుస్నాబాద్ ఐఓసీలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాలకు సంబంధించి వానాకాలం--2026లో ఎల్-నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు నిర్వహించనున్న సమీక్ష సమావేశానికి సంబంధించిన ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె. హైమావతి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సమావేశానికి మూడు జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ, ఉద్యానవన, గ్రామపంచాయతీ, గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల, విద్యుత్ తదితర శాఖల అధికారులు హాజరుకానున్నందున ఆయా శాఖలు తమ యాక్షన్ ప్లాన్‌ను వివరించేందుకు ప్రొజెక్టర్ ఏర్పాటు చేయాలని, జిల్లాల వారీగా అధికారులకు ప్రత్యేక సీటింగ్ ఏర్పాటు చేయాలని, మూడు జిల్లాలకు చెందిన అధికారులు హాజరుకానున్న నేపథ్యంలో తగినంత తాగునీటి సౌకర్యం కల్పించాలని కలెక్టర్ సూచించారు. సమావేశం ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగే అవకాశం ఉన్నందున మధ్యాహ్న భోజనం, టీ, స్నాక్స్, డ్రింకింగ్ వాటర్, ఫర్నిచర్, మైక్ వ్యవస్థ, నిరంతర విద్యుత్ సరఫరా తదితర ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆర్డీఓ రామ్మూర్తిని ఆదేశించారు.

రాహుల్ అరెస్టుపై కదంతొక్కిన

## కాంగ్రెస్ పార్టీ శ్రేణులు...

కేంద్ర మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్..
గాంధీ విగ్రహం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ..



**జమ్మికుంట జూలై 22 (నినాదం):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేపర్ లీకులు చేసి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటుందని, శాంతి యుతంగా ర్యాలీ చేస్తున్న విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేసి,విద్యార్థులకు మద్దతుగా లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం దుర్మార్గమని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. బుధవారం రోజున కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,చొప్పదండి శాసన సభ్యుడు మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో కరీంనగర్ పట్టణంలోని గాంధీనగర్ కార్ఖానా గడ్డ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ,గ్రంథాలయ ఛైర్మెన్ సత్తు మల్లేశం,సుడా మాజీ ఛైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,నగర అధ్యక్షుడు అంజన్ కుమార్, కరీంనగర్ అసెంబ్లీ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశానికి యువత ప్రధాన బలమని చెప్పిన ప్రధాని మోదీ ఆ యువతపై దాడి చేయించడం సమంజసం కాదని,వారి పక్షాన కోట్లాడుతున్న ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయడం ఏంటని ప్రశ్నించారు. భేషరతుగా నీట్ ఎగ్జామ్ పేపర్ లేకు సంబంధించి వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని, విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని అన్నారు. అనంతరం గాంధీ విగ్రహం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ తీయగా,పార్టీ శ్రేణులు భారీగా పాల్గొని బీజేపీ అవలం భిస్తున్న తీరుపై వ్యతిరేక నినాదాలు చేశారు. స్థానికంగా ఉన్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఈ విషయంపై పార్లమెంట్ లో చర్చ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అధ్వానంగా వెల్గటూర్ ఆర్టీసీ బస్టాండ్



**వెల్గటూర్,జూలై22(నినాదం న్యూస్):** నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులతో కిటకిట లాడే వెల్గటూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ సమస్యల వలయంలో కొట్టు మిట్టాడుతోంది. ఎండొస్తే దుమ్ము ధూళి,వానొస్తే బురదతో గుంతల మయంగా మారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షానికే గుంతలు ఏర్పడడంతో నీరు నిల్వ ఉండి బస్సుల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. బస్టాండ్ వెనకాల చెత్తా చెదారం పేరుకు పోవడంతో మురుగు నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. బస్సులు బస్టాండ్ లోపలికి వెళ్ళి వచ్చే దారి,కోటిలింగాల ఆర్ అండ్ ఆర్ కాలనీ కి వెళ్ళే దారి ఒకటే కావడంతో ఇరుకుగా మారి ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంది. దీనిపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఆర్టీసీ అధికారులు ఏటా మరమ్మతుల పేరిట నిధులు ఖర్చు చేసి తూతూ మంత్రంగా పనులు చేయిస్తుండడంతో సమస్యలు పునరావృతం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు,ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నీట్-యూజీ పేపర్ లీక్‌తో

# మోడీ సర్కార్‌కు మూడింది..!

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

విద్యార్థులపై లాఠీచార్జికి బాధ్యత వహిస్తూ ప్రధాని, హోంమంత్రి పదవులకు తప్పుకోవాలి



**జగిత్యాల ప్రతినిధి, జూలై 22 (నినాదం):** దేశవ్యా ప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే నీట్-యూజీ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం కేంద్రంలోని మోడీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రశ్నాపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీ నామా చేయాలని, విద్యార్థులపై జరిగిన లాఠీచార్జికి బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు జగిత్యాల జిల్లా కేంద్రంలో బుధ వారం నిర్వహించిన ధర్నాలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మంత్రి మాట్లాడుతూ, ప్రతి ఏడాది నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) నిర్వహించే నీట్-యూజీ పరీక్షకు దేశవ్యాప్తంగా 20 లక్షలకు పైగా విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ఈ ఏడాది 22,79,743 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, దాదాపు 19,99,895 మంది పరీక్షకు హాజరయ్యారని, తెలంగాణ నుంచి 73,084 మంది విద్యార్థులు పరీక్ష రాశారని చెప్పారు. ప్రశ్నాపత్రం లీకేజీతో దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని, ఈ ఘటనల నేపథ్యంలో పలువురు విద్యార్థులు ఆత్మ హత్యలకు పాల్పడినట్లు వార్తలు వచ్చాయని పేర్కొంటూ, అలాంటి పరిస్థితులు ఏర్పడటం అత్యంత బాధాకరమన్నారు. లక్షలాది కుటుంబాల ఆశలు, విద్యార్థుల భవిష్యత్తు ముడిపడి ఉన్న పరీక్ష లను అత్యంత పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని, కానీ బీజేపీ ప్రభుత్వం ఆ బాధ్యతను విస్మరించిందని ఆరోపించారు. ప్రశ్నాపత్రాలను సామాన్య వస్తువుల్లా విక్రయించారని ఆరోపించిన మంత్రి, సోషల్ మీడియా, టెలిగ్రామ్, వాట్సాప్ వంటి వేదికల ద్వారా లీకైన ప్రశ్నాపత్రాల PDFలను రూ. 5లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు విక్రయించినట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ దర్యాప్తులో వెల్లడైందని పేర్కొన్నారు. పరీక్ష రూపకల్పన, అనువాదం, కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు, సబ్జెక్ట్ నిపుణులు, దళారులు ఈ కుట్రలో భాగమైనట్లు దర్యాప్తులో తేలిందని, ఢిల్లీ, జైపూర్, పుణే, లాతూర్, గురుగ్రామ్ తదితర ప్రాంతాల్లో పలువురిని అరెస్టు చేయడం నిజం కాదా అని ప్రశ్నించారు. సీబీఐ దర్యాప్తులో లీకేజీకి సంబంధించిన ఆధారాలు వెలుగులోకి వచ్చినప్పటికీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ఇప్పటికీ ఎందుకు రాజీనామా చేయడం లేదని ప్రశ్నించారు. పరీక్షా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసిన ఘటనకు బాధ్యత వహించే ధైర్యం కేంద్ర ప్రభుత్వానికి లేదా అని నిలదీశారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు ప్రశ్నాపత్రం లీకేజీపై నిరసనలు తెలుపుతుంటే, వారిపై లాఠీలు ఎత్తడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని విమర్శించారు. నీట్-యూజీ లీకేజీ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరపాలని కాంగ్రెస్, ప్రతిపక్షాలు డిమాండ్ చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం చర్చకు అంగీకరించకుండా పార్లమెంట్‌ను వరుసగా వాయిదా వేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష నాయకులపై, విద్యార్థులపై పోలీసులను ప్రయోగించడం దురదృష్టకరమని, రాహుల్ గాంధీపై జరిగిన దాడి కూడా ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న గొంతులను అణిచివేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. సంవత్సరాల తరబడి కష్టపడి చదివే విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవస్థ నాశనం చేస్తోందని, అలాంటి ఘటనలతో నష్టపోయిన కుటుంబాలకు ఎవరు సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఎన్టీఏ పరీక్షా విధానంలో సమూల సంస్కరణలు తీసుకురావాలని, పరీక్షల నిర్వహణలో సంపూర్ణ పారదర్శకతను నెలకొల్పాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చివరగా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని, నీట్-యూజీ ప్రశ్నాపత్రం లీకేజీపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు.

# జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్

**జమ్మికుంట, జూలై 22 (నినాదం) :** జమ్మికుంట పట్టణానికి చెందిన పాత్రికేయులు కండెం పూజిత వంశీకృష్ణ దంపతుల కవల పిల్లలు కృషిక సాయి, కృషిక రాజ్ ల మొదటి పుట్టినరోజు వేడుకలకు హాజరై చిన్నారులను ఆశీర్వదించిన జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్. పట్టణంలోని సువర్ణ ఫంక్షన్ హాల్ లో జరిగిన మొదటి జన్మదిన వేడుకలకు హాజరై చిన్నారులను ఆశీర్వదించి వారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 30వ వార్డు కౌన్సిలర్ చందా రాజు ఆర్యవైశ్య సంఘం జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు లెంకలపల్లి శరత్ కుమార్ ఆంధ్రప్రభ దినపత్రిక రిపోర్టర్ గుండా రాజేంద్ర ప్రసాద్ నినాదం దినపత్రిక హుజురాబాద్ ఆర్సి ఇంచార్జ్ అయిత రాధాకృష్ణ నాయకులు చుంచు శివ కండెం వేణు తదితరులు పాల్గొన్నారు.





**చిన్నారులను ఆశీర్వదించిన కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్**

జమ్మికుంట పట్టణంలోని సువర్ణ ఫంక్షన్ హాల్ లో పాత్రికేయుడు కండెం పూజిత వంశీకృష్ణ ల కవల పిల్లల మొదటి పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై చిన్నారులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్. అనంతరం పిల్లలకు కేకు తినిపించి వారికి తమ ఆశీస్సులను అందించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారులు బచ్చు భాస్కర్ బచ్చు వీర లింగం నినాదం దినపత్రిక హుజురాబాద్ ఆర్సి ఇంచార్జ్ అయిత రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి సంజయ్ కార్యాలయంపై దాడి యత్నం

ఎమ్మెల్యే కవ్వంపల్లి పాటు కాంగ్రెస్ నాయకులపై పోలీసు కమిషనర్‌కు రాతపూర్వక ఫిర్యాదు

మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి




**కరీంనగర్, జులై22(నినాదం):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ స్థానిక కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దాడికి యత్నించారని ఆరోపిస్తూ, బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కరీంనగర్ పోలీసు కమిషనర్‌కు రాతపూర్వక ఫిర్యాదు చేశారు. కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు బోయినపల్లి ప్రవీణ్ రావు, ఎన్నం ప్రకాశ్, సహనియమిత సభ్యులు, ఇతర బీజేపీ నాయకులు ఈ ఫిర్యాదును సమర్పించారు. ఫిర్యాదు ప్రకారం, మధ్యాహ్నం సుమారు 12:15 గంటలకు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో 50 మందికి పైగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎంపీ కార్యాలయంలోకి అక్రమంగా ప్రవేశించి, కార్యాలయ సిబ్బందిని బెదిరిస్తూ అసభ్య పదజాలంతో దూషించారని పేర్కొన్నారు. సిబ్బందిపై దాడికి యత్నించడంతో పాటు, అక్కడికి చేరుకున్న పోలీసుల విధులకు కూడా ఆటంకం కలిగించారని ఆరోపించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన ఈ ఘటనపై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు సంబంధిత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు కోరారు. ఈ మేరకు పోలీసు కమిషనర్ కార్యాలయం ఫిర్యాదును స్వీకరించింది. ఈ కార్యక్రమం లో ఎన్నం ప్రకాష్ ప్రవీణ్ రావు, పుప్పాల రఘు, బల్ భీర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు

**మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునస్వామి**

**జమ్మికుంట,జూలై22(నినాదం):** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని హోటళ్లు,టిఫిన్ సెంటర్లు,టీ స్టాళ్లు, బజ్జీ బండ్లు, తోపుడు బండ్ల నిర్వాహకులతో పాత మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కమిషనర్ మాట్లా డుతూ సింగిల్-యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ కవర్లలో టిఫిన్లు ఇవ్వకూడదని, ఆకులు లేదా పర్యావరణహిత పాత్రల్లో మాత్రమే ఆహారాన్ని అందించాలని సూచించారు.



టీ స్టాళ్లలో టీని గాజు లేదా స్టీల్ గ్లాసుల్లో మాత్రమే అందించాలని తెలిపారు. ప్లాస్టిక్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు లేదా ఇతర నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే రూ. 1,000 నుంచి రూ. 2,000 వరకు జరిమానా విధించడంతో పాటు నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా బజ్జీ బండ్ల నిర్వాహకులు మెయిన్ రోడ్డుపై ఉన్న వైట్ లైన్ దాటకుండా, తమకు కేటాయించిన ప్రదేశాల్లోనే వ్యాపారం నిర్వహించాలని సూచించారు. దుకాణాల ఎదురుగా బండ్లు నిర్వహించుకున్నప్పుడు సంబంధిత యజమానులకు ఎలాంటి కిరాయి చెల్లించవద్దని తెలిపారు. హోటల్ యజమానులు, బజ్జీ బండ్లు తోపుడు బండ్ల నిర్వాహకులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, వినియోగదారులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని కమిషనర్ సూచించారు. సమావేశంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఐ. రమేష్, జవాన్లు, హోటల్ యజమానులు, బజ్జీ బండ్ల నిర్వాహకులు, తోపుడు బండ్ల వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల వసతి ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ హైమావతి



**హుస్నాబాద్,జూలై 22( నినాదం) :** హుస్నాబాద్ శాతవాహన ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల వసతి కోసం తాత్కాలికంగా కేటాయించిన హుస్నాబాద్ పట్టణంలోని 20వ వార్డులో గల రైతు బజార్ భవనంలోని మొదటి, రెండవ అంతస్తులను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించి విద్యార్థుల వసతికి అవసరమైన ఏర్పాట్లపై అధికారులతో పాటు శాతవాహన ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యానికి పలు సూచనలు, దిశానిర్దేశాలు చేశారు. శాశ్వత ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణం పూర్తయ్యే వరకు తాత్కాలికంగా ఈ భవనంలోనే విద్యార్థులకు వసతి కల్పించనున్నట్లు పేర్కొన్న ఆమె, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, భోజన సౌకర్యం తదితర అన్ని ఏర్పాట్లను శాతవాహన ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యంతో సమన్వయం చేసుకుని సక్రమంగా కల్పిస్తామని తెలిపారు. ఈ పరిశీలనలో ఆర్డీఓ రామ్మూర్తి, తహసీల్దార్, శాతవాహన ఇంజనీరింగ్ కళాశాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటలపై రైతులు మొగ్గుచూపాలి

గండిపల్లి, శ్రీరామ్ తండా గ్రామాల్లో రైతులకు అవగాహన



**హుస్నాబాద్,జూలై 22(నినాదం):** ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీలత సూచించారు. అక్కన్నపేట మండలం గండిపల్లి, శ్రీరామ్ తండా గ్రామాల్లో ఆమె ఆధ్వర్యంలో రైతులకు ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరుతడి పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, కంది, పెసర, మినుము, నువ్వులు, జొన్న, సజ్జ, వేరుశెనగ వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. అలాగే తక్కువ కాల వ్యవధి గల పంట రకాలను ఎంపిక చేసుకోవడం, నేలలో తేమను సంరక్షించే యాజమాన్య పద్ధతులను పాటించడం, వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం, వాతావరణ శాఖ సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ శాఖ సలహాల మేరకు సాగు పనులు చేపట్టాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు బాణోతు వెంకటేష్, బందారం శ్రీనివాస్, ఉపసర్పంచ్‌లు గణేష్, రాజు, పంచాయతీ కార్యదర్శులు తిరుపతి, సుచరితతో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

### తెలంగాణ జలసిరి పోస్టర్ విడుదల

**కోడేరు (నినాదం):** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో తెలంగాణ జలసిరి పోస్టర్ను మండల పరిషత్ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి బుధవారం నాడు ఆవిష్కరించారు ఆమె మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీల్లోనూ ప్రజలు రద్దీగా ఉన్న ప్రాంతాలలో జలసరి పోస్టర్లను విడుదల చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో భూగర్భ జలాలను పెంపొందించుకునే అం దుకోసం పాముపాండ్ గుంతలు పూట కుంటలను నిర్మించుకోవాలని ఆమె అన్నారు. ఈసీ సరిత ఏపీవో నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

### అమృత ఆసుపత్రిలో అవగాహన సదస్సు

**జమ్మికుంట, జూలై 22 (నినాదం):** ప్రపంచ మెదడు దినోత్సవాన్ని పురస్కరించుకుని జమ్మికుంటలోని అమృత న్యూరో హాస్పిటల్, జమ్మికుంటలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది ప్రపంచ మెదడు దినోత్సవం థీమ్ గా ప్రపంచ న్యూరాలజీ సమాఖ్య ప్రకటించింది. డా. భరత్ ఆర్ ఎంబిబిఎస్, ఎండి న్యూరో ఫిజీషియన్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా సుమారు 3.4 బిలియన్ మంది ఏదో ఒక నాడీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు. (స్ట్రోక్, మూర్ఛ (ఎపిలెప్సీ), మైగ్రేన్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తించి సకాలంలో చికిత్స పొందితే ప్రాణాలను కాపాడటంతోపాటు శాశ్వత వైకల్యాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం, రక్తపోటు మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోవడం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. "మెదడు ఆరోగ్యం ప్రతి ఒక్కరి హక్కు. మెదడు ఆరోగ్య సేవలు అందరికీ అందుబాటులో ఉండేలా అవగాహన పెంపొందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత" అని డా. భరత్ ఆర్ అన్నారు. కార్యక్రమంలో అమృత న్యూరో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎలుక దేవేందర్ రెడ్డి, ఎన్సిఎస్ టెక్నీషియన్ ప్రశాంత్, ల్యాబ్ టెక్నీషియన్లు అఖిల్, శ్రావణి, పిఆర్వోలు శ్రీకాంత్, రంజిత్, నర్సింగ్ సిబ్బంది, రిసెప్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కేటీఆర్‌కు 'ఎల్ నినో'పై కనీస అవగాహన లేదు

- కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులు దశాబ్దాలుగా నిలకడగా ఉన్నాయి
- బీఆర్ఎస్ నిర్మించిన మేడిగడ్డ మూడేళ్లకే ఎందుకు కుంగింది
- హరీశ్‌రావును ప్రశ్నించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హనుమకొండ, జూలై 22,(నినాదం):** బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేసిన కాలం తెచ్చిన కరువు కాదు... కాంగ్రెస్ తెచ్చిన కరువు అనే వ్యాఖ్యలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. ప్రపంచ వాతావరణ మార్పులు, ఎల్ నినో ప్రభావంపై కనీస అవగాహన లేకుండా కేటీఆర్ మాట్లాడటం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. అమెరికాలో చదువుకున్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు. హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ కార్యాలయంలోబుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే ఎల్ నినో ప్రభావం వల్లే ప్రపంచంలోని అనేక దేశాల్లో వర్షాభావ పరిస్థితులుఏర్పడుతున్నాయని శాస్త్రవేత్తలు స్పష్టంగా చెబుతున్న విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణకు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ప్రకృతి పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎలా బాధ్యులను చేస్తారా ముఖ్యమంత్రి అక్కడికి వెళ్లి ఏదైనా చేశారా కనీస శాస్త్రీయ అవగాహన లేకుండా ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడటం కేటీఆర్ స్థాయికి తగదనీ విమర్శించారు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మక సూచనలు చేస్తే ప్రభుత్వం స్వాగతిస్తుందన్నారు. కానీ ప్రజలను తప్పుదారి పట్టించే విషప్రచారానికి పాల్పడితే ప్రజలే తగిన సమాధానం చెబుతారనీ భట్టి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అక్రమంగా కూడబెట్టిన సొమ్ముతో ఏర్పాటు చేసుకున్న కొన్ని పత్రికలు, టెలివిజన్ ఛానళ్ల ద్వారా ప్రభుత్వంపై నిరాధార ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలను తెలంగాణ ప్రజలుగమనిస్తున్నారని హెచ్చరించారు. ఈ సందర్భంగా మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావును ఉద్దేశించి భట్టి విక్రమార్క పలు ప్రశ్నలు సంధించారు. "లక్ష కోట్ల రూపాయలతో నిర్మించామని గొప్పలు చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కేవలం మూడేళ్లకే ఎందుకు కుంగిపోయింది? దీనికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత బీఆర్ఎస్ నాయకత్వంపై ఉంది" అనినిలదీశారు. కాళేశ్వరం కంటే ఎగువన కాంగ్రెస్ హయాంలో నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు 20 టీఎంసీల సామర్థ్యంతో నేటికీ సురక్షితంగా నిలిచి లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. అలాగే ఆరు దశాబ్దాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్ఆర్ఎస్పీ) కూడా గోదావరి వరదల్ని సమర్థంగా తట్టుకుని ఇప్పటికీచెక్కుచెదరకుండా ఉందని గుర్తు చేశారు. అదే గోదావరి నది... అదే ఇసుక పునాది... కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టులు దశాబ్దాలుగా ప్రజలకు సేవలందిస్తుంటే, బీఆర్ఎస్ నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ మాత్రం మూడేళ్లకే ఎందుకు కుంగిపోయిందో రాష్ట్రప్రజలకు సమాధానం చెప్పాలి" అని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.





రాహుల్ గాంధీ అక్రమ అరెస్టుపై నిరసనగా హన్మకొండ అంబేద్కర్ జంక్షన్ వద్ద చేస్తున్న నిరసనలు పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి వర్యులు బట్టి విక్రమార్క, మంత్రి కొండ సురేఖ, శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, ఇతర శాసనసభ్యులు డీ సీ సీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న బట్టి, నేతలు.

## ఆరుతడి పంటల వైపు మొగ్గుచూపండి

### జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాపురావు



**మహదేవపూర్ జులై 22, (నినాదం):** ఎల్నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఆశాజనకంగా లేవని రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యవ సాయ శాఖ అధికారి బాపురావు అన్నా రు. బుధవారం పలిమెల గ్రామ పంచాయతీలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువ మోతాదులో పడే అవకాశం ఉందని ఆరుతడి పంటల సాగు, సేంద్రియ వ్యవసాయంపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి సంపత్, ఏఈఓ శరత్, ఆగ్రోస్ రమేష్ రెడ్డి రైతులు పాల్గొన్నారు.

## ఎరువులు అధిక ధరలకు అమ్మితే కఠినచర్యలు

- ఏడిఏ ఆదిరెడ్డి



**కమలాపూర్, జులై 22 (నినాదం) :** ఎరువులు మందుల దుకాణ దారులు ఎవారైనా ఎం ఆర్ పి దరలకంటే అధిక ధరలకు అమ్మినట్లైతే కఠిన చర్యలు తీసుకుంటామని సహాయ సంచాలకులు డి అదిరెడ్డి డీలర్ లను ఎచ్చరించారు. వ్యవసాయ మండలంలోని గూడూరు గ్రామంలో గల శ్రీ రాజమాత ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాన్ని వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువులు, పురుగుమందుల నిల్వలు, విక్రయ రికార్డులు, ధరల జాబితా, బిల్లుల జారీ తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం సహాయ వ్యవసాయ సంచాలకులు డోమా ఆదిరెడ్డి మాట్లాడుతూ ఏ ఉత్పత్తినైనా గరిష్ట చిల్లర ధర ఎం ఆర్ పి కంటే అధిక ధరకు విక్రయిస్తే తీవ్రంగా పరిగణించి, సంబంధిత ఎరువులు, పురుగుమందుల విక్రయ లైసెన్సను రద్దు చేసే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు., ధరల జాబితాను వినియోగదారులకు కనిపించే విధంగా ప్రదర్శించాలని, ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా పాటించాలని తెలిపారు. రైతులు ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసే ప్రతి సందర్భంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలన్నారు. ఎవరైనా ఎరువులను ఎం ఆర్ పి కంటే అధిక ధర వసూలు చేసినట్లయితే వెంటనే సమీప వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ తనికీలలో మండల వ్యవసాయ అధికారి బి వేణు, వ్యవసాయ విస్తరణ అధికారి బి ప్రశాంత్ లు పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలు అందించాలి



- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

**మహదేవపూర్ జులై 22, (నినాదం):** ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. బుధవారం అటవీ ప్రాంతమైన పలిమెల పోలీస్ స్టేషన్ లో ఆయన ఆకస్మిక తనికి నిర్వహించారు. స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసులో దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను ఆయన పరిశీలించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు ప్రజల ఫిర్యాదును సత్వరంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరించి నేరాలు నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించేలా పనిచేయాలని సిబ్బందికి ఆదేశించారు.

## విద్యుత్ కార్మికుల హామీలు అమలు చేయాలి

- ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకుడు జంపన్న ఫైర్




**ములుగు ప్రతినిధి, జూలై 22 (నినాదం):** విద్యుత్ ఆర్టిజన్లు, అన్‌మ్యాన్ వర్కర్లకు ఏప్రిల్ 8 సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్య జంపన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, సమ్మె విరమింపజేసే సమయంలో ప్రభుత్వం పలు హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఇది ఉద్యోగులను మోసం చేసినట్టేనని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్పీడీసీఎల్ హైదరాబాద్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపడుతున్న ఆర్టిజన్లు, అన్‌మ్యాన్ వర్కర్లను పోలీసులు అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధ చర్య అని ఆయన అన్నారు. సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలు ఇప్పటివరకు చెల్లించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం తరఫున ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన గానీ, సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీ గానీ ఇవ్వలేదని తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఏర్పాటు చేస్తున్న టాడా వ్యవస్థల వల్ల క్షేత్రస్థాయిలో ఎలాంటి ఉపయోగం లేదని, ఈ పనుల్లో కోట్ల రూపాయల అవినీతి జరిగిందనే ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లాల్లో జేసీఎం పోస్టులను భర్తీ చేయకపోవడంతో విద్యుత్ సిబ్బందిపై పనిభారం పెరిగి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలను విడుదల చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఆర్టిజన్లు, అన్‌మ్యాన్ వర్కర్ల ఆగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎదుర్కోవాల్సి వస్తుందని భూక్య జంపన్న హెచ్చరించారు.

## ఫైనల్ లేఅవుట్ ధ్రువీకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

### వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ కెన్యానాయక్



**అమరచింత, జూలై 22, (నినాదం):** ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న ఫైనల్ లేఅవుట్ ధృవీకరణ ప్రక్రియను ఒకరు మున్సపాలిటీ అదనపు కలెక్టర్ కిమ్యా నాయక్ సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లేఅవుట్‌కు సంబంధించిన వివరాలను పరిశీలిస్తూ, నిబంధనల ప్రకారం అన్ని ప్రక్రియలను పారదర్శకంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం స్వయం సహాయక సంఘాల ( ఎస్ హెచ్ జి ఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న నూతన సోలార్ ప్లాంట్ పనులను పరిశీలించారు. ప్లాంట్ ఏర్పాటు పురోగతి, విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, నిర్వహణ విధానంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ, సోలార్ ప్లాంట్‌ను సకాలంలో పూర్తి చేసి సమర్థవంతంగా వినియోగంలోకి తీసుకు రావాలని సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎ. నరేష్ కుమార్ అదనపు కలెక్టర్‌కు లేఅవుట్ ధృవీకరణ ప్రక్రియ, సోలార్ ప్లాంట్ పురోగతి మరియు మున్సిపాలిటీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలు అందించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అన్ని అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేసి, ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సంబంధిత సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## చారిత్రక కోటగుళ్ల క్షేత్రం పునరుద్ధరణ చేపట్టాలి


### ప్రభుత్వానికి జయశంకర్ సారస్వత సమితి విజ్ఞప్తి



**భూపాలపల్లి బ్యూరో (నినాదం):** కాకతీయుల కాలం నాటి గొప్ప చారిత్రక, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన కోటగుళ్ల క్షేత్రాన్ని పునరుద్ధరించి, భావితరాలకు చారిత్రక సంపదగా అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని జయశంకర్ సారస్వత సమితి ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సమితికి చెందిన సాహితీవేత్తల బృందం కోటగుళ్ల క్షేత్రాన్ని సందర్శించి ఆలయ పరిసరాలను పరిశీలించింది. అనంతరం వారు మాట్లాడుతూ, తెలంగాణలోని ఎన్నో చారిత్రక కట్టడాలు, దేవాలయాలు కాలగర్భంలో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాకతీయుల శిల్పకళా వైభవానికి నిదర్శనంగా నిలిచిన కోటగుళ్ల క్షేత్రాన్ని జీర్ణోద్ధరణ చేసి, పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి ఆలయ పునరుద్ధరణతో పాటు మౌలిక వసతులు కల్పిస్తే దేశ, విదేశాల నుంచి పర్యాటకులు, భక్తులు అధిక సంఖ్యలో సందర్శించే అవకాశం ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జయశంకర్ సారస్వత సమితి వ్యవస్థాపకులు గడ్డం లక్ష్మయ్య, వీరశర్మ, నల్లగొండ సురేష్, పూర్ణశర్మ, శ్రీధర్, యాదగిరి, పొన్నాల సంజీవ్, స్థానిక ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## దాశరథి ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తి

### జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా. హాఫిజ్ ఖాన్



**నల్లగొండ ప్రతినిధి, జులై 22 (నినాదం):** జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం ప్రముఖ తెలుగు కవి, గేయకారుడు దాశరథి కృష్ణమాచార్యుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా. హాఫిజ్ ఖాన్ ముఖ్య అతిథిగా హాజరై దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ దాశరథి కృష్ణమాచార్యులు తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహాకవి అని అన్నారు. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అంటూ తెలంగాణ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడని కొనియాడారు. నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా తన కలాన్ని ఆయుధంగా మలుచుకుని ప్రజల్లో చైతన్యం నింపిన గొప్ప ప్రజాకవి అని పేర్కొన్నారు. యువత దాశరథి రచనలను చదివి ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి. బాలమ్మ, కవి యాదగిరి రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రాజేష్ హాజరయ్యారు.

## పర్యావరణ పరిరక్షణకు పాఠశాల నుంచే పునాది

### స్టీల్ ప్లేట్లు, గ్లాసులతో ప్లాస్టిక్‌కు దూరంగా జీవశాస్త్ర ఉపాధ్యాయుల వినూత్న సందేశం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (నినాదం):** పర్యావరణ పరిరక్షణపై సమాజంలో చైతన్యం తీసుకురావడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జయశంకర్ భూపాలపల్లి జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంఓ) పింగళి విజయపాల్ రెడ్డి అన్నారు. ఘనపూర్ మండల కేంద్రంలోని తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయులకు మూడు రోజులుగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదుల్లో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల్లో ఆరోగ్యం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించాలని సూచించారు. సైన్స్ ల్యాబ్‌ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. విద్యార్థుల అభ్యసనాభివృద్ధి కోసం ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానున్న వర్క్‌బుక్స్‌ను సక్రమంగా వినియోగించాలని, ఏఐ కోపైలట్ వంటి ఆధునిక సాంకేతిక సాధనాలు, దీక్ష కోర్సులను ఉపయోగించుకుని బోధనకు అవసరమైన విద్యా సామగ్రిని రూపొందించుకోవాలని తెలిపారు. 'ప్లాస్టిక్ వద్దు.. పర్యావరణమే ముద్దు' అనే సందేశాన్ని చాటుతూ తెలంగాణ బయలాజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో శిక్షణలో వినూత్న కార్యక్రమాలు చేపట్టడాన్ని ఏఎంఓ అభినందించారు. మధ్యాహ్న భోజనానికి స్టీల్ ప్లేట్లు, టీకి పేపర్ గ్లాసులకు బదులుగా స్టీల్ గ్లాసులు వినియోగించారు. ఇళ్లలో పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లను ప్లాస్టిక్ బాటిళ్లలో నింపి సీల్ చేసి రీసైక్లింగ్‌కు పంపించే విధానంపై కూడా అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను అరికట్టడం ద్వారా భూకాలుష్యం, పర్యావరణ సమస్యలను తగ్గించవచ్చని వివరించారు. ఆగస్టులో పదవీ విరమణ చేయనున్న సీనియర్ జీవశాస్త్ర ఉపాధ్యాయుడు హట్కర్ సమ్మయ్యను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. శిక్షణ కార్యక్రమానికి కోర్స్ డైరెక్టర్‌గా తిరుపతి వ్యవహరించగా, జిల్లా రిసోర్స్ పర్సన్లుగా బి. ప్రభాకర్ రెడ్డి, కే. శ్రీనివాస్, పి. సునీల్, ఎస్. శ్రీధర్ సేవలందించారు. రెండో విడత శిక్షణలో కాటారం సబ్‌డివిజన్‌కు చెందిన 40 మంది జీవశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రతి వర్షపు నీటి చుక్కను ఒడిసి పట్టుకోవాలి

- మునిసిపల్ కమిషనర్ ఏ. నరేష్ కుమార్



**అమరచింత, జూలై 22, (నినాదం):** ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో అమృత్ 3.0 కార్యక్రమంలో భాగంగా జె ఎస్ జె డబ్ల్యూ ల్ సంవాద్ క్యాచ్ ద రైన్ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ ఎ. నరేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నాగమణి, వైస్ చైర్మన్ ఎం. శ్రీనివాసులు, వార్డు కౌన్సిలర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు. అనంతరం వార్డులో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, డ్రైనేజీలు, రహదారులు మరియు ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి ఇంటిలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసి వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్యాచ్ ద రైన్ వేర్ ఇట్ ఫాల్స్ వెన్ ఇట్ ఫాల్స్ కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేసి భూగర్భ జలాలను పరిరక్షించాలని కోరారు. అలాగే, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఇంటిలోనే తడి వ్యర్థాలు, పొడి వ్యర్థాలు, శానిటరీ వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి మున్సిపాలిటీకి అందించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యర్థాలను మూలం వద్దనే వేరు చేయడం ద్వారా పరిశుభ్రమైన పట్టణం, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ మరియు రీసైక్లింగ్ మరింత సమర్థవంతంగా జరుగుతుందని వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జి. నాగమణి మాట్లాడుతూ, నీటి ప్రతి బొట్టును సంరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, వర్షపు నీటి సంరక్షణతో పాటు ప్రతి కుటుంబం వ్యర్థాలను తప్పనిసరిగా వేరు చేసి మున్సిపాలిటీకి అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే స్వచ్ఛమైన, హరిత ఆత్మకూరును నిర్మించగలమని ఆమె పేర్కొన్నారు. వైస్ చైర్మన్ శ్రీ ఎం. శ్రీనివాసులు మాట్లాడుతూ, అమృత్ 3.0 జల్ సంవాద్ కార్యక్రమాల లక్ష్యాలను ప్రతి ఇంటికి చేర్చాలని, వ్యర్థాల విభజనను ప్రతి ఒక్కరూ రోజువారీ అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. అనంతరం కమిషనర్ వార్డులోని పారిశుద్ధ్య పనులు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా, రహదారులు మరియు ఇతర పౌర సమస్యలను పరిశీలించి, గుర్తించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు కౌన్సిలర్ జుబేదా బేగం, మున్సిపల్ అధికారులు, వార్డు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## హోరెత్తిన కాంగ్రెస్ నిరసనలు..

- ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం
- రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్ట్ ప్రజాస్వామ్యంపై దాడి
- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ జూలై 22( నినాదం):** మిర్యాలగూడలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్ట్‌కు నిరసనగా బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. మిర్యాలగూడ శాసనసభ్యులుబత్తుల లక్ష్మారెడ్డి నాయకత్వంలో సుమారు 1000 మంది విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి రాజీవ్ చౌక్ వరకు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం రాజీవ్ చౌక్ వద్ద ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేసి కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజల హక్కులు, సమస్యలపై నిరంతరం పోరాడుతున్న కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అక్రమంగా అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీయడమేనని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉందని, ఆ హక్కును హరించే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని, వెంటనే కాంగ్రెస్ నాయకులపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి వారిని నిర్బంధాల నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా ప్రజా ఆందోళనలు నిర్వహిస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతి నిధులు, విద్యార్థులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్ యూఐ, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

- కలెక్టర్ చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి, జూలై 22 (నినాదం):** మహిళలు డ్రోన్ సాంకేతికతను అందిపుచ్చుకుని స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదిగి విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా మారడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. బుధవారం టిటిడిసి లో డీఆర్‌డీఏ--సెర్ప్ ఆధ్వర్యంలో, సీఎస్ఆర్ నిధులతో మీరాయి శిక్షణ సంస్థ నిర్వహిస్తున్న నీలగిరి జిల్లా మహిళా కిసాన్ డ్రోన్ ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా డ్రోన్ ఆపరేటర్ శిక్షణ పొందుతున్న 50 మంది మహిళలతో ముఖాముఖి మాట్లాడారు. మహిళలకు 10 రోజుల పాటు ఇస్తున్న డ్రోన్ శిక్షణను పూర్తిగా సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ నైపుణ్యం సాధించాలని కోరారు. ఈ శిక్షణతో వ్యవసాయ రంగంలోనే కాకుండా ,వివిధ రంగాలలో ఉపాధి అవకాశాలను సృష్టించుకోవచ్చని తెలిపారు. డ్రోన్ సేవల ద్వారా ప్రతి ఎకరానికి సుమారు రూ. 400 చొప్పున సేవా రుసుము లభించే అవకాశం ఉందని, జిల్లా వ్యాప్తంగా ఒకే విధమైన రేటు విధానాన్ని అమలు చేసుకుని రైతులకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. తమకు వచ్చే ఆదాయాన్ని అంచనా వేసుకుని అవసరమైన మేరకు మాత్రమే రుణాలు తీసుకోవాలని, మిగిలిన ఆదాయాన్ని పొదుపు చేసుకుంటూ ఆర్థికంగా బలపడాలని చెప్పారు. మహిళలు ఉద్యోగాల కై ఎదురుచూడకుండా తామే డ్రోన్ యూనిట్ల యజమానులుగా మారాలని, ప్రతి గ్రూపు వద్ద ఒక డ్రోన్ యూనిట్ ఉండేలా ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. డ్రోన్ ఆపరేట్ చేయడం మాత్రమే కాకుండా డ్రోన్ మరమ్మతు, నిర్వహణలో కూడా పూర్తి అవగాహన పెంచుకుని మెకానిక్‌లుగా కూడా నైపుణ్యం సంపాదించాలని అన్నారు. దీంతో తమ డ్రోన్లను తామే మరమ్మతు చేసుకోవడం వల్ల నిర్వహణ ఖర్చులు తగ్గడంతో పాటు, ఆదాయం పెరుగుతుందని చెప్పారు. వ్యవసాయ రంగంలో పంటలపై ఎరువులు, పురుగుమందుల పిచికారీతో పాటు ,ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సర్వేలు, మ్యాపింగ్ తదితర రంగాల్లో కూడా డ్రోన్లకు విస్తృతంగా డిమాండ్ ఉందని తెలిపారు. అందువల్ల మహిళలు ఒకే సీజన్‌కే పరిమితం కాకుండా ఏడాది పొడవునా వివిధ రంగాల్లో డ్రోన్ సేవలు అందిస్తూ 360 రోజులు ఉపాధి పొందేలా కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి , మీరాయి సీఈవో విజయ్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సతీష్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రామిక్ ,ఎ పిడి శ్రవణ్ కుమార్ , శ్రీలేఖ, శ్రీనిధి ఆర్ఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు .

# సేంద్రియ సాగుతోనే రైతులకు లాభం..

### ప్రజలకు ఆరోగ్యం.. ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**నిర్మల్ ప్రతినిధి, జూలై 22(నినాదం):** రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాల్సిన అవసరం ఉందని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో బుధవారం సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులతో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖిగా మాట్లాడిన నాయకులు.. సేంద్రియ సాగులో ఎదురవుతున్న సమస్యలు, ఉత్పత్తులకు గిట్టుబాటు ధర, ప్రభుత్వ ప్రోత్సాహంపై చర్చించారు. సేంద్రియ పద్ధతుల్లో పండించిన పంటలకు దేశవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోందని, ఈ విధానాన్ని అనుసరించడం ద్వారా రైతుల పెట్టుబడి ఖర్చులు తగ్గి ఆదాయం పెరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారం కోసం సేంద్రియ ఉత్పత్తుల వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్న నాయకులు, సేంద్రియ వ్యవసాయ విస్తరణకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావుతో పాటు, జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, సేంద్రియ వ్యవసాయం చేస్తున్న పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# తానూర్ పోలీస్ స్టేషన్‌లో మొక్కలు నాటిన ఎస్పీ

### వార్షిక తనిఖీ నిర్వహించి సరిహద్దు భద్రత, నేర నియంత్రణ, కమ్యూనిటీ పోలీసింగ్‌పై అధికారులకు దిశానిర్దేశం






**నిర్మల్ ప్రతినిధి/తానూర్, జూలై 22 (నినాదం):** వన మహోత్సవం-2026 కార్యక్రమంలో భాగంగా బుధవారం మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని ముధోల్ సర్కిల్ పరిధిలోని తానూర్ పోలీస్ స్టేషన్‌కు విచ్చేసిన నిర్మల్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ గారికి పోలీసు అధికారులు పూల మొక్కను అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పోలీసు గార్డ్ ద్వారా జిల్లా ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం తానూర్ పాఠశాల విద్యార్థులతో కలిసి వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని సుమారు 300 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని పెంచి సంరక్షించినప్పుడే వన మహోత్సవం లక్ష్యం సార్థకమవుతుందని తెలిపారు. అనంతరం తానూర్ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ నిర్వహించిన జిల్లా ఎస్పీ, స్టేషన్ పరిపాలన, శాంతిభద్రతల నిర్వహణ, నేర నియంత్రణ చర్యలు, రికార్డుల నిర్వహణ, కమ్యూనిటీ పోలీసింగ్, బీట్ వ్యవస్థ, సీసీ కెమెరాల పనితీరు, మాల్ఖానా, ఆయుధాగారం, పోలీసు వాహనాలు, దర్యాప్తు పురోగతి తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి అధికారులకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల విశ్వాసమే పోలీసు శాఖకు అతిపెద్ద బలమని పేర్కొన్నారు. ప్రతి ఫిర్యాదుదారునికి మర్యాదపూర్వకంగా స్పందిస్తూ సత్వర, పారదర్శక, నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రతి పోలీసు అధికారి కట్టుబడి ఉండాలని సూచించారు. ముధోల్ సర్కిల్ పరిధిలోని మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఉన్న తానూర్ పోలీస్ స్టేషన్‌కు ప్రత్యేక వ్యూహాత్మక ప్రాధాన్యత ఉందని పేర్కొంటూ, అంతర్‌రాష్ట్ర నేరాల నియంత్రణకు మరింత అప్రమత్తంగా పనిచేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టమైన వాహన తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ మద్యం, గంజాయి, మాదకద్రవ్యాలు, పశువుల అక్రమ రవాణా తదితర చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే మహారాష్ట్ర పోలీసులతో సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి అంతర్‌రాష్ట్ర నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, బాల్య వివాహాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి నాణ్యమైన దర్యాప్తు చేపట్టడంతో పాటు న్యాయస్థానాల్లో శిక్షల శాతం పెరిగేలా దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచాలని తెలిపారు. అదేవిధంగా గంజాయి, గుడుంబా, ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని, కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తూ గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో 5ఎస్ విధానం, పరిశుభ్రత, క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రజలకు మరింత నాణ్యమైన పోలీసు సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఐపీఎస్, ముధోల్ సీఐ రవీంద్ర నాయక్, తానూర్ ఎస్ఐ షేక్ జుబేర్ ఖాన్, తానూర్ పాఠశాల విద్యార్థులు, పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ పార్లమెంటులో చర్చకు రావాలి


### రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



**మంచిర్యాల, జులై 22 (నినాదం):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నీట్ పేపర్ అంశంపై పార్లమెంట్లో చర్చకు రావాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి డిమాండ్ చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం లక్షెట్టిపేట పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ అంశంపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ, కాంగ్రెస్ నాయకులు చర్చకు బదులుగా నిరసన కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం ఎదుట కాంగ్రెస్ చేపట్టిన ధర్నాను ఆయన తప్పుబట్టారు. నీట్ అంశంపై చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లో జరిగే చర్చలో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించాలని రాహుల్ గాంధీకి సూచించారు. నీట్ అంశంపై పార్లమెంట్‌లో చర్చకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. చర్చకు బదులుగా నిరసనలకు దిగడం సమంజసం కాదని ఆయన విమర్శించారు. ప్రజాస్వామ్య వేదిక అయిన పార్లమెంట్‌లోనే అభిప్రాయాలు చెప్పాలని పేర్కొన్నారు. దేశంలో అలజడి సృష్టించే రాజకీయాలకు బీజేపీ వ్యతిరేకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, హరి గోపాల్, నాగిరెడ్డి హేమంత్ రెడ్డి, బొప్పు కిషన్, గుండ ప్రభాకర్, వేముల మధు, సామ వెంకటరమణ, మంద రాజేందర్, గాడికొప్పుల చంద్రమౌళి, బొక్కనపల్లి సతీష్, గొల్ల రాజేష్, కోమాకుల రవి, రాజా గురువయ్య, తగరపు గంగన్న, ముష్కం గంగన్న, కోన చంద్రశేఖర్, బియ్యాల లచ్చన్న, అడ్లూరి దేవేందర్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# దుద్దిళ్లకు అధికారం వస్తే ఖాకీ యూనీఫాంకు అవమానాలే

### దాడికి కూడగట్టుకున్నరని కేసు పెట్టడం దుర్మార్గం
### అధికారంలోకి రాగానే ఇప్పటి కేసులపై రివ్యూలు పెడుతం
### ప్రజల కోసం పోరాడితే న్యాయం మన పక్కనే ఉంటదని గుర్తించాలే
### రాబోయే రోజుల్లో దుద్దిళ్ల కుటుంబానికి సేమ్ టూ సేమ్ చూపిస్తం
### మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**మంథని జూలై 22( నినాదం) :** దుద్దిళ్ల శ్రీధర్‌కు ఎప్పుడు అధికారం వస్తే అప్పుడు ఖాకీ యూనీఫాంలకు అవమానాలేనని, ఇప్పటికే పలుమార్లు చెప్పినా పోలీసుల్లో మార్పు రావడం లేదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. రామగిరి మండలం నాగేపల్లి గ్రామంలోనీ కమాన్ పూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, టీజీ టీవీ అధినేత పూదరి సత్యనారాయణ గౌడ్ నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజాస్వామ్యం మంట కలిసిపోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ ఎవ్వరూ రాజ్యాంగాన్ని తెలుసుకుని అభివృద్ధి కావద్దని కక్ష్యకట్టిని మంథని ఎమ్మెల్యే రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ ముందుకు సాగుతున్నాడని విమర్శించారు. ఆనాడు మంత్రిగా ఉన్నప్పుడు తనపై అనేక కేసులు పెట్టించడంతో పాటు చివరకు రౌడీషీట్ ఓపెన్ చేయించిన కీర్తి దుద్దిళ్లకే దక్కుతుందని, ఈనాడు ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం కోసం అహర్నిశలు కృషిచేస్తున్న పూదరి సత్యనారాయణ పై ఇప్పటికే 20కేసులు పెట్టించాడని, అనేక ఇబ్బందులకు గురి చేశాడని గుర్తు చేశారు. పూదరిని తీసుకెళ్లేందుకు వచ్చిన రామగిరి పోలీసులపై దాడి చేసేందుకు పూదరి తల్లి, తండ్రి, భార్య, పెద్దమ్మ, బావలు కూడగట్టుకుని ఉన్నారని కేసు పెట్టారని, కుటుంబసభ్యులు ఎక్కడైనా కూడగట్టుకుని ఉంటారా అని ప్రశ్నించారు. ఇంట్లో సమస్య వస్తే అందరూ ఒక్క చోటుకు వస్తారే కానీ అలా వస్తే ఇంత నీచమైన కేసు పెడుతారా అని ప్రశ్నించారు. కేసు పెట్టడంతో పాటు ఆరువై ఏండ్ల పూదరి తల్లిపై దౌర్జన్యం చేసి ఆమెను గాయపర్చారని ఆయన తెలిపారు. జూన్ 9న కేసు అయితే ఈనాటికి 42రోజులు అయిందని సత్యనారయణను పట్టుకోవడం కోసం ఆరు టీంలు ఏర్పాటు చేశారని, ఒక్కో టీంకు పది మంది పోలీసులు, ముగ్గురు ఎస్ఐలు, ఒక సీఐ ఒక ఏసీపీ ఒక డీసీపీలు 42రోజులు కేవలం సత్తి కోసమే తిరిగిండ్లని ఆయన తెలిపారు. సత్యనారాయణను పట్టుకోవడం లేదని మొన్న రాత్రి డీసీపీని దుద్దిళ్ల నానా దుర్భాషలాడాడని, దుద్దిళ్ల శ్రీధర్ కోసం పనిచేస్తే కోర్టులో చివాట్లు పడ్డారని ఆయన వివరించారు. ఏం కేసులు పెట్టినవ్ ఏం జ్ఞానం ఉందని హైకోర్టులో జడ్జి హెచ్చరించారని ఆయన తెలిపారు. ఇప్పటికే రామగుండం సీపీకి చెప్పామని, ఐపీఎస్ అధికారిగా జాగ్రత్త పడాలని సూచించినా మార్పు లేదని, ఒక వైపు దుద్దిళ్లతో తిట్లు, మరో వైపు హైకోర్టులో చివాట్లతో ఖాకీ యూనీఫాంకు అవమానాలేనని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో పక్కా అధికారంలోకి రావడం ఖాయమని, ఆనాడు దుద్దిళ్ల హైదరాబాద్‌లో ఉన్నా పూదరికి జరిగినట్లే సేమ్ టూ సేమ్ ట్రీట్ ఇస్తామని, అలాపై ఈ కేసులపై రివ్యూ పెట్టి మరీ తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మీ అరాచకాలు అక్రమ సంపాదనపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా చీకటి పాలన పోవడానికి నా కొడుకుతోని నా కుటుంబం ఉంటమని పూదరి తల్లి బార్య చెప్పన్నారని, నియోజకవర్గంలోని అనేక మంది కుటుంబసభ్యులు ఈ నిర్ణయానికి వస్తున్నారని తెలిపారు. ప్రజలు కోరుకునే అభివృద్ధి చేయాలని చెప్పితే పోలీసులతో అణిచివేయాలని చూస్తున్నాడని, అభివృద్ధిని పూర్తి చేయలేని అసమర్థ ఎమ్మెల్యే దుద్దిళ్ల అని ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా పోలీసులు మారాల్సిన అవసరం ఉందని, దుద్దిళ్ల అడుగులకు మడుగులు ఒత్తకుండా బానిసలుగా ఉండవద్దని, ఆనాడు పదేండ్లు పోలీసులను గౌరవించామని, కలిసి పని చేశామని ఆయన గుర్తు చేశారు. పదేండ్లు వీళ్ల కోసం మేం పని చేశామా అని అనేక మంది కాంగ్రెస్ పార్టీ నాయకకులు బాధపడుతున్నారని, ప్రజల పక్షాన కొట్లాడితే న్యాయం మన పక్కనే ఉంటదని పూదరి సత్యనారాయణగౌడ్ నిరూపించారని ఆయన స్పష్టం చేశారు.

# వాన కోసం మహిళల భక్తి ప్రవాహం

### భూలక్ష్మి దేవికి ఘన జలాభిషేకం
### 3వ వార్డులో కౌన్సిలర్ కందునూరి సమత కుమార్ ఆధ్వర్యంలో విశేష కార్యక్రమం



**సుల్తానాబాద్, జూలై 22 (నినాదం):** సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ బుధవారం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 3వ వార్డులో భూలక్ష్మి దేవికి శుద్ధ జలాలతో ప్రత్యేక శుద్ధి కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య 3వ వార్డు కౌన్సిలర్ కందునూరి సమత కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళల భక్తి, ఐక్యత, సంప్రదాయాల పట్ల ఉన్న గౌరవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ కందునూరి సమత కుమార్ మాట్లాడుతూ, ప్రకృతి అనుగ్రహంతోనే రైతు కుటుంబాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని, మంచి వర్షాలు కురిసి రాష్ట్రం సస్యశ్యామలం కావాలని ప్రతి ఒక్కరూ మనస్ఫూర్తిగా ప్రార్థించాలని అన్నారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని హృదయపూర్వకంగా ప్రార్థించానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో 3వ వార్డులో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని, కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది.



# సుల్తానాబాద్‌లో ఎస్ఐఆర్ నమోదు జోరు

### మండలంలో మొత్తం ఓటర్లు..35688
### ఎస్ఐఆర్ నమోదు పూర్తి.. 34107
### మండల ప్రగతి 88.16. శాతం.. మున్సిపల్ ఓటర్లు 16651
### ఎస్ ఐ ఆర్ నమోదు పూర్తి...12447 మంది
### మున్సిపల్ ప్రగతి 75 శాతం : తాహసిల్దార్ బషీరుద్దీన్



**సుల్తానాబాద్, జూలై 22 (నినాదం):** సుల్తానాబాద్ మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) నమోదు కార్యక్రమం వేగంగా కొనసాగుతూ లక్ష్యసాధన దిశగా ముందుకు సాగుతోంది. మండలంలోని మొత్తం 35,668 మంది ఓటర్లలో 34,107 మందికి ఎస్ఐఆర్ మ్యాపింగ్ పూర్తి కావడంతో 88.16 శాతం ప్రగతి నమోదు అయినట్లు తహసీల్దార్ బషీరుద్దీన్ తెలిపారు. మండలంలోని 45 పోలింగ్ కేంద్రాల పరిధిలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు), ఆశా వర్కర్లు, గ్రామ దీపికలు, రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను నమోదు చేస్తున్నారని చెప్పారు. అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమిష్టి కృషితో కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందన్నారు. అదేవిధంగా సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 17 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 16,651 మంది ఓటర్లలో 12,447 మందికి ఎస్ఐఆర్ నమోదు పూర్తి కాగా, 75 శాతం ప్రగతి నమోదైంది. మిగిలిన ఓటర్ల నమోదు ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో అధికారులు ముందుకు సాగుతున్నట్లు తహసీల్దార్ వెల్లడించారు. ప్రతి అర్హ ఓటరు వివరాలు నమోదు అయ్యేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తూ, ఎవరూ మిగిలిపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారులు, బీఎల్‌వోలు, ఆర్‌పీలు, ఆశా వర్కర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# 'విజ్జన్న'కు మంత్రి హోదా..

### సుల్తానాబాద్‌లో బైక్ ర్యాలీతో సంబరాల సందడి...
### భాకం సాయికిరణ్ ఆధ్వర్యంలో 100 బైకులు, 50 కార్లతో భారీ ర్యాలీ..
### బాణాసంచా పేల్చి ఆనందోత్సవాలు





**సుల్తానాబాద్, జూలై 22 (నినాదం):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావుకు రాష్ట్ర మంత్రి (మంత్రి హోదా) కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో సుల్తానాబాద్ పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా సంబరాలు నిర్వహించాయి. మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు కౌన్సిలర్ భాకం సాయికిరణ్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి ఎమ్మెల్యే విజయ రమణారావు శివపల్లి నివాసం వరకు భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. సుమారు 100 బైకులు, 50 కార్లు పాల్గొన్న ఈ ర్యాలీ పట్టణ ప్రజల దృష్టిని ఆకర్షించింది. ర్యాలీ ముందు కార్యకర్తలు భారీగా బాణాసంచా పేల్చి ఆనందోత్సవాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే విజయ రమణారావుకు మంత్రి హోదా లభించడం పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధికి మరింత దోహదపడుతుందని భాకం సాయికిరణ్ పేర్కొన్నారు. ప్రజలకు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు అందే అవకాశాలు మెరుగవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయ రమణారావుకు శుభాకాంక్షలు తెలిపారు.

# రచ్చపల్లి పాఠశాల్లో ఘనంగా బోనాల ఉత్సవాలు




**ధర్మారం జూలై 22 (నినాదశీ) :** మండలంలోని రచ్చపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఈరోజు బోనాల పండుగ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు సముద్రాల వంశీ మోహన్ ఆచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆషాడమాసంలో జరిగే బోనాల పండుగ విశిష్టతను ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులకు విపులంగా వివరించాడు. బోనం అనే పదం భోజనం పదవ నుండి వచ్చిందని అలాగే అమ్మవారికి బెల్లం తో వండిన ఆహారాన్ని నైవేద్యంగా సమర్పిస్తారని ఈ బోణంలోని ఆయుర్వేద ప్రాముఖ్యత వేపాకు యొక్క సైంటిఫిక్ విలువ మరియు ఈ పండుగ వెనుక దాగి ఉన్న గొప్పదనాన్ని విద్యార్థులకు ఈ వేడుకలో పోతరాజులుగా వేషధారణ చేసి ఆకట్టుఉన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రజలు పాల్గొని విద్యార్థులు చేసిన వేషధారణను చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంపత్ లక్ష్మణ్ సౌమ్య అమ్మ ఆదర్శ పాఠశాల చైర్పర్సన్ తాళ్లపల్లి ప్రమీల మరియు సర్పంచ్ సూర రజిత, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులతోసహపంక్తిభోజనం చేసిన ఎమ్మెల్యే ఏలేటి

### ఎంజేపీ పాఠశాలలో వసతులపై క్షేత్రస్థాయి పరిశీలన
### ఎంజేపీ పాఠశాల ఆకస్మిక తనికి చేసిన ఎమ్మెల్యే



**నిర్మల్ ప్రతినిధి, జూలై 22 ( నినాదం):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన వసతులు కల్పించడమే లక్ష్యమని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా ఫూలే (ఎంజేపీ) బాలుర పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్య, వసతులు, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, వంటశాల నిర్వహణ, ఆహార నాణ్యతను ఎమ్మెల్యే క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి, వారికి వడ్డిస్తున్న భోజనం రుచి, నాణ్యతపై స్వయంగా ఆరా తీశారు. విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ వారి చదువులు, వసతి, రోజువారీ అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వసతిగృహంలోని ఒక గదిలో 25 మంది విద్యార్థులు ఉండాల్సి వస్తోందని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంజేపీ పాఠశాలకు శాశ్వత భవనం నిర్మించే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు చేపట్టేలా ప్రయత్నిస్తానని తెలిపారు. పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో రాజీ పడొద్దని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఆకస్మిక తనిఖీతో విద్యార్థులు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యేకు వివరించే అవకాశం లభించడంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, పట్టణ కౌన్సిలర్లు గంజి రాజు, శశాంక్, సూరి, అర్జున్, సాత్విక్, విఠల్, నరేష్, బీజేపీ నాయకులు రాచకొండ సాగర్ , జమాల్, నారాయణ గౌడ్, కందుల హరీష్, భరత్, తో పాటు పట్టణ బీజేపీ నాయకులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

### డీసీపీ భాస్కర్



**మంచిర్యాల, జులై( 22):** శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంచిర్యాల డీసీపీ భాస్కర్ హెచ్చరించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని తాండూర్ పోలీస్ స్టేషన్‌ను బుధవారం వార్షిక తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ దేవయ్య, ఎస్ఐ ప్రసాద్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం డీసీపీ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ సెంటర్, రికార్డులు, సీసీటీఎన్ఎస్ నిర్వహణ, పెండింగ్ కేసుల ఫైళ్లు, క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ వ్యవహారాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, సీసీ కెమెరాల ఫుటేజీని నిరంతరం పర్యవేక్షిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. గ్రామాలను తరచూ సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకోవడంతో పాటు సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. సైబర్ నేరాలు, చట్టాలపై అవగాహన, మత్తు పదార్థాల నిర్మూలన, రహదారి భద్రత, హెల్మెట్, సీటు బెల్టు వినియోగంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని, జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలతో సమన్వయం కొనసాగించాలని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ కోసం రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. తనిఖీల్లో ఏసీపీ కిరణ్ కుమార్, సీఐ దేవయ్య, ఎస్ఐ ప్రసాద్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యా నాణ్యతతో పాటు భద్రతకు ప్రాధాన్యం

### కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల,జూలై 22 (నినాదం) :** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సి.ఐ. రవీందర్ తో కలిసి సందర్శించి భద్రతా చర్యలలో భాగంగా సి.సి. కెమెరాల ఏర్పాటు, భోజనశాల, వంటశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల భద్రత దృష్ట్యా సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ క్రమంలో పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. ఇంటర్మీడియట్ బి.పి.సి. విద్యార్థులతో మాట్లాడుతూ విద్యా బోధన నాణ్యత పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విధుల పట్ల సమయ పాలన పాటించాలని, వర్షాకాలం దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ సంతోష్ కుమార్ తో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణను పరిశీలించారు. ప్రజల నుండి సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియలో జాగ్రత్త వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా స్పష్టంగా వివరాలు నమోదు చేయాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రక్రియ వేగవంతానికి బూత్ స్థాయి ఏజెంట్లు, వాలంటీర్లు, యువత సహకారం తీసుకోవాలని తెలిపారు. భూభారతి, సాదా బైనమా, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. మందమర్రి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని తహసిల్దార్ సతీష్ కుమార్, బెల్లంపల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణ, భూభారతి, సాదా బైనమా, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి భూభారతి, సాదా బైనమా, రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు.




### మీరు గాంధీ భవన్ ముట్టడిస్తే

# మేము బీజేపీ ఆఫీస్ ముట్టడిస్తాం

**రాహుల్ గాంధీ చెప్పినట్లు ప్రధాని మోడీ దేశ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావుకి టీపీసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కౌంటర్**

**సంగారెడ్డి బ్యూరో, జులై 22 (నినాదం)**

కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లు డిల్లీ లో ప్రధాని నివాసం ముందు ధర్నా చేసి దేశ ప్రజల మనోభావాలను కించ పరచారని, అందుకు ప్రతిగా గాంధీ భవన్ ను ముట్టడిస్తామన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్ రావు వ్యాఖ్యలపై టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యార్థుల పై విచక్షణా రహితంగా దాడి చేసి తప్పు చేసిన బీజేపీ తిరిగి తమ గాంధీ భవన్ ను ముట్టడి స్తామనడం ఏంటని ప్రశ్నించారు. బీజేపీ నేతలు గాంధీ భవన్ ను ముట్టడిస్తే తాము బీజేపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని అన్నారు. బీజేపీ నేతలతో పాటు కేంద్ర మంత్రులను సైతం ఘెరావ్ చేస్తామన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ తో లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడిన కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను రాజీనామా చేయాలని డిమాండ్ చేసినందుకు విద్యార్థులను ఘోరంగా చితకబాదడం దారుణమన్నారు. ఈ ఘటన కు నిరసనగా పిఎం ఇంటి ఎదుట రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లు ధర్నా చేశారని అన్నారు. రాహుల్ గాంధీ డిమాండ్ చేసినట్లు దేశం లోని విద్యార్థులకు ప్రధాని మోడీ క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు.

### రూ.56 కోట్ల వ్యయంతో విద్యుత్ రంగం

# మౌలిక వసతుల విస్తరణకు శ్రీకారం

### ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**సబ్‌స్టేషన్లు, నూతన కార్యాలయ భవనాలు, కార్పొరేట్ మౌలిక వసతుల ప్రారంభోత్సవాలు,శంకుస్థాపనలు**

**హనుమకొండ, జులై 22, (నినాదం ):**

తెలంగాణ రాష్ట్రంలో నాణ్యమైన, నిరంతరం విద్యుత్ సరఫరాతో పాటు విద్యుత్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు హనుమకొండలో రూ.56 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు విద్యుత్ అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యతో కలిసి హనుమకొండ నక్కలగుట్టలోని టీజీఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం విద్యుత్ భవన్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి కాలనీ, ఆర్ అండ్ బీ క్వార్టర్స్, విద్యుత్ నగర్, వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ ప్రాంతాల్లో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలకు, హనుమకొండ నూతన సర్కిల్ కార్యాలయ భవనానికి, అలాగే టీజీఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఐదో



అంతస్తు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.అనంతరం డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని, టీజీఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్కార్యాలయంలో అత్యాధునిక సమావేశ మందిరాన్ని ఉపముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా హనుమకొండ నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సామర్థ్యం గణనీయంగా పెరగడంతో పాటు, వోల్టేజ్ సమస్యలు తగ్గి, విద్యుత్ అంతరాయాలు నివారించబడతాయి. వేగంగా విస్తరిస్తున్న నగర అవసరాలకుఅనుగుణంగా విద్యుత్ పంపిణీ వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, తెలంగాణను విద్యుత్ రంగంలో దేశానికి ఆదర్శంగా నిలిపే దిశగా ప్రభుత్వంప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని, విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ వ్యవస్థలను అత్యాధునికంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడం, పరిశ్రమలు, వాణిజ్య రంగం, గృహ అవసరాలకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరంటీజీఎన్‌పీడీసీఎల్కార్పొరేట్కార్యాలయంలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. విద్యుత్ సరఫరా, మౌలిక వసతుల విస్తరణ, సబ్‌స్టేషన్ల నిర్మాణం, వినియోగదారులకు మెరుగైన సేవలు, భవిష్యత్ కార్యాచరణపై అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడంతో పాటు విద్యుత్ రంగాన్ని మరింతఆధునికీకరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలనిఆయన అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న, జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ) నిఖిల, టీజీఎన్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.




### కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా

# ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీ ధర్నా

### పాల్గొన్న మంత్రి తుమ్మల

**ఖమ్మం, జులై 22 (నినాదం):**

లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసిసి అధ్యక్షుడు కర్గే రా పలువురి నేతల అరెస్టులు, దాడులు నిరసిస్తూ ఖమ్మం నగరంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం అంబేద్కర్ సెంటర్లో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విపక్ష నాయకులపై కక్ష పూర్వకంగా వివరిస్తూ ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తుందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే నీట్ పరీక్ష పేపర్లు లీక్ చేస్తూ వారి భవిష్యత్తును అంధకారంగా చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రతిపక్ష పార్టీ నాయకులు ధర్నా నిర్వహిస్తే, ఆ నాయకుడు పై మోడీ ప్రభుత్వం విచక్షణహితంగా పోలీసు చేత లాటీ ఛార్జ్ చేయించడం దుర్మార్గ చర్యని అని ఆయన అన్నారు. ఈ ధర్నాలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సుడా చైర్మన్ దుర్గాప్రసాద్, రాయల్ నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నగర నాయకులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# ఓన్లీ...నిరసనే..దహనాలు లేవు!

### దిష్టిబొమ్మలు లాక్కున్న పోలీస్ లు... అధికార పార్టీ కి డి.ఎస్.పి ఝలక్

**జగిత్యాల ప్రతినిధి జూలై 22 ( నినాదం ) :**

దేశవ్యాప్తంగా పరీక్షల పారదర్శకతపై ఆందోళనలు కొనసాగుతున్న వేళ, నీట్ పరీక్షల పేపర్ లీక్ అంశం మరియు కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జగిత్యాల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమం రాజకీయ చర్చకు దారితీసింది. నిరసనలు, ధర్నాలు చేపట్టిన వేళ అధికార పక్షం, ప్రతిపక్షాల పట్ల వేర్వేరుగా వ్యవహరిస్తుంటారు. ఇది మాములే, కానీ అధికార పక్షం చేపట్టబోయే కార్యక్రమం లో దిష్టి బొమ్మల దహనంపై డివిజ




నల్ అధికారి తీసుకున్న నిర్ణయం కాస్త ఆలోజింపచేసింది. దీనితో దిష్టిబొమ్మల దహనానికి పోలీసులు అడ్డుకట్ట వేయడం జిల్లాలో చర్చనీయంశంగా మారింది. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచనల మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు గాజంగి నందయ్య నాయకత్వంలో నిర్వహించిన ఈ నిరసనలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మలను తీసుకువచ్చి నిరసన వ్యక్తం చేయడానికి ప్రయత్నించారు.అయితే ముందస్తు బందోబస్తు నిర్వహిస్తున్న డీఎస్పీ స్వయంగా అక్కడికి చేరుకుని, పరిస్థితిని సమీక్షించి దిష్టిబొమ్మల దహనానికి అడ్డుకట్ట వేశారు . అనంతరం పోలీసులు దిష్టిబొమ్మలను స్వాధీనం చేసుకున్నారు.

NINADAM CINEMA



### ఇంటర్‌లోనే లవ్‌లో పడ్డ

## రాజమౌళి

స్టార్ డైరెక్టర్‌గా ఉన్నత శిఖరాలకి ఎదిగిన రాజమౌళి కూడా ఒకప్పుడు సాధారణ విద్యార్థే. అయితే ఆయన గతంలో చెప్పిన తన తొలి ప్రేమ జ్ఞాపకాలు మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఒక పాత ఇంటర్వ్యూలో రాజమౌళి తన ఇంటర్ రోజుల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న సమయంలో తన క్లాస్‌లో ఉన్న ఓ అమ్మాయిని ఎంతో ఇష్టపడినట్లు ఆయన వెల్లడించారు. అయితే ఆమెపై ఉన్న అభిమానాన్ని లేదా ప్రేమను నేరుగా చెప్పే ధైర్యం మాత్రం తనకు ఎప్పుడూ రాలేదని చెప్పారు.తనకు ఆ అమ్మాయి అంటే ఇష్టమని క్లాస్‌లోని దాదాపు అందరికీ తెలుసని, స్నేహితులు కూడా ఆ విషయంపై తనను ఆటపట్టించేవారని గుర్తుచేసుకున్నారు. అయినప్పటికీ ఏడాది మొత్తం గడిచిపోయే వరకు ఆమెతో మాట్లాడే అవకాశం రాలేదని తెలిపారు.చివరికి విద్యా సంవత్సరం ముగిసే సమయానికి ఒక్కసారి ధైర్యం చేసి ఆమెతో మాట్లాడానని చెప్పారు. తన ముందు కూర్చున్న ఆ అమ్మాయిని పేరు పెట్టి పిలుస్తూ 'ట్యూషన్ ఫీజు కట్టావా' అని మాత్రమే అడిగానని తెలిపారు. ఆమె ఒక్కసారిగా వెనక్కి తిరిగి తన వైపు చూసిన ఆ క్షణం ఇప్పటికీ తన మదిలో నిలిచిపోయిందని, ఆ ఒక్క చూపు కోసం చాలా రోజులుగా ఎదురుచూశానని రాజమౌళి భావోద్వేగంగా చెప్పుకొచ్చారు.ఆ సంఘటన జరిగినప్పుడు రాజమౌళి ఏలూరులో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారని తెలుస్తోంది. అనంతరం కొంతకాలం చదువుకు విరామం ఇచ్చిన ఆయన, తర్వాత ఇంటర్ రెండో సంవత్సరం పూర్తి చేశారు. ఆ తర్వాత సినీ రంగంలో అడుగుపెట్టి రచయితగా, దర్శకుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు.

### సంక్రాంతి బరి నుంచి చిరు

# తప్పుకున్నారా



ఒకప్పుడు సంక్రాంతి అంటే తెలుగు సినీ పరిశ్రమకు పెద్ద పండుగగా భావించేవారు. ఆ సీజన్‌లో సినిమా విడుదలైతే భారీ వసూళ్లు ఖాయమనే నమ్మకం నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లలో ఉండేది. కానీ గత కొన్నేళ్లుగా పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఒకేసారి పలువురు స్టార్ హీరోల సినిమాలు బరిలోకి దిగుతుండటంతో థియేటర్ల కోసం తీవ్ర పోటీ నెలకొంటోంది. ఫలితంగా స్క్రీన్లు పంచుకోవాల్సి రావడం, కలెక్షన్లు విడిపోవడం వల్ల ఆశించిన స్థాయిలో లాభాలు రావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మెగాస్టార్ చిరంజీవి హీరోగా దర్శకుడు బాబీ తెరకెక్కిస్తున్న భారీ చిత్రంపై ఓ ఆసక్తికర ప్రచారం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మొదట ఈ సినిమాను సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని చిత్రబృందం భావించినప్పటికీ, ప్రస్తుతం ఆ నిర్ణయాన్ని పునఃసమీక్షిస్తున్నట్లు టాలీవుడ్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి బాక్సాఫీస్ వద్ద గరిష్ట స్థాయిలో వసూళ్లు రావాలంటే పోటీ లేకుండా సోలోగా విడుదల చేయడం ఉత్తమమనే ఆలోచనలో నిర్మాతలు ఉన్నట్లు సమాచారం. సంక్రాంతి సమయంలో కనీసం రెండు లేదా మూడు పెద్ద సినిమాలు విడుదలయ్యే అవకాశాలు ఉండటంతో, కలెక్షన్లపై ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారట. అందుకే సంక్రాంతి రేసు నుంచి తప్పుకుని సమ్మర్ లేదా మరో అనుకూలమైన ఫెస్టివల్ సీజన్‌లో సినిమాను విడుదల చేసే అంశంపై అంతర్గతంగా చర్చలు జరుగుతున్నాయని ఇండస్ట్రీ వర్గాల్లో టాక వినిపిస్తోంది. అయితే ఈ ప్రచారాలపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.



### రంభ ఊర్వశి మేనక నుంచి సాంగ్ విడుదల


**అల్లరి నరేశ్ ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'రంభ ఊర్వశీ మేనక'. చంద్రమోహన్ చింతడ దర్శకత్వంలో రానున్న ఈ సినిమాలో సురభి కథానాయికగా కనిపించనున్నారు. సెప్టెంబర్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమాలోని 'నా కంటి మీద కునుకే'అంటూ సాగే పాటను విడుదల చేశారు. భాస్కరభట్ల రవికుమార్ లిరిక్స్ అందించిన ఈ పాటను ధనుంజయ్ ఆలపించారు.**



# స్పిరిట్ 40 శాతం షూటింగ్ పూర్తి

### కీలక అప్‌డేట్ ఇచ్చిన సందీప్ వంగా

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం స్పిరిట్ పై అభిమానుల్లో రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. సినిమా ప్రకటించిన నాటి నుంచి ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, తాజాగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా షూటింగ్ పురోగతిపై కీలక సమాచారం వెల్లడించారు. అమెరికాలోని నార్త్ కరోలినాలో జరిగిన తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న సందీప్ రెడ్డి వంగా, అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'స్పిరిట్' అప్డేట్‌ను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ కూడా పాల్గొన్నారు. వేదికపై మాట్లాడిన సందీప్ రెడ్డి వంగా, 'స్పిరిట్' చిత్రీకరణ ఇప్పటికే 40 శాతం పూర్తయిందని వెల్లడించారు. అంతేకాదు, ఈ




సినిమా ప్రతి ప్రేక్షకుడికి నచ్చేలా రూపొందిస్తున్నామని, ప్రభాస్ అభిమానుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సందీప్ చేసిన ఈ ప్రకటనతో ప్రభాస్ అభిమానులు సోషల్ మీడియాలో సంబరాలు చేసుకుంటున్నారు. సినిమా షూటింగ్ వేగంగా సాగుతుండటంతో విడుదలపై కూడా త్వరలో మరిన్ని అధికారిక ప్రకటనలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో ప్రభాస్ ఓ పవర్‌ఫుల్ ఐపీఎస్ అధికారిగా కనిపించనున్నట్లు సమాచారం. అకాడమీ టాపర్‌గా ఎదిగిన ఓ పోలీస్ అధికారి జీవితంలో జరిగే అనూహ్య పరిణామాలు, అతనిపై వచ్చిన ఆరోపణలు, వాటి వెనుక ఉన్న అసలు నిజం కథలో కీలకంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్ సరసన బాలీవుడ్ నటి తృప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రకాష్ రాజ్, వివేక ఒబెరారు, కాంచన తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. టీ-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

# నన్ను అపార్థం చేసుకున్నారు

### నాకెలాంటి సర్జరీ జరగలేదన్న బిగ్‌బి

బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ ఇటీవల చేసిన సోషల్ మీడియా పోస్ట్ దేశవ్యాప్తంగా ఆందోళనకు గురిచేసిన సంగతి తెలిసిందే. శస్త్రచికిత్స, ఐసీయూ, కోలుకునే పక్రియ గురించి ఆయన చేసిన వ్యాఖ్యలతో అమితాబ్‌కు సర్జరీ జరిగిందని అభిమానులు భావించారు. అయితే ఈ ప్రచారాలపై తాజాగా ఆయన స్వయంగా స్పందిస్తూ పూర్తి క్లారిటీ ఇచ్చారు. బిగ్ బీ తన బ్లాగ్‌లో శస్త్రచికిత్స అనంతరం కోలుకోవడం ఎంత కష్టమో వివరిస్తూ ఓ పోస్ట్ చేశారు. దీంతో ఆయన ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొందారని, సర్జరీ చేయించుకున్నారని వార్తలు వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఆ పోస్టు వెనుక అసలు ఉద్దేశాన్ని అమితాబ్ వివరించారు.



Printed, Published & Owned by B. Srinivas, Printed at RAHNUMA-E-DECCAN PRESS, H.No.12-2-837/A/3, Asifnagar, Hyderabad., Telangana-500028
Published at 6-3-439, Kisannagar, Karimnagar-505001(TS) Editor: B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787